నమస్తే తెలంగాణ
తాజా వార్తలు, ఈ పేపర్ కోసం ntnews.com చూడండి.

మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ
జిల్లా టాబ్లాయిడ్ వార్తల కోసం 10, 11పేజీలు చూడండి.

సోమవారం 13.4.2020 • సంపుటి 9 • సంచిక 289 • వెల రూ. 6.50
కరీంనగర్ పేజీలు : 12
షష్ఠి
అశ్విని కార్తి మేష సంక్రమణ సూర్యోదయం: 6.01, సూర్యాస్తమయం: 6.32, శార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, చైత్రమాసం, కృష్ణపక్షం, సోమవారం, తిథి: షష్ఠి సాయంత్రం 4.19 వరకు తదుపరి సప్తమి, నక్షత్రం: మూల సాయంత్రం 7.03 వరకు తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: సాయంత్రం 5.27 నుండి 7.03కు, పునర్ వర్జ్యం : రాత్రి తెల్లవారురూము: 4.54 నుండి, అమృత ఘడియలు: పగలు 12.41 నుండి పగలు 14.16 వరకు, రాహుకాలం : ఉదయం 7.36 నుండి 9.09 వరకు, దుర్ముహూర్తం: పగలు 12.41 నుండి పగలు 1.31 వరకు పు.దు .పగలు 3.11 నుండి సాయంత్రం 4.01 వరకు.
PUBLISHED FROM KARIMNAGAR • HYDERABAD • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD
www.ntnews.com /ntdailyonline



కరీంనగర్ జిల్లాలోని ఓ రెడ్ జోన్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది

## మార్చి 18.. కరీంనగరం..

అప్పటికి తెలంగాణలో మొదటి కరోనా కేసు బయటపడి 16 రోజులైంది. కానీ ఆ ఒక్కరోజే 8 మందికి కరోనా పాజిటివ్ వచ్చింది. తెలంగాణ ఉలిక్కిపడింది. దేశంలోనే ఇదొక సంచలనం. ఒకచోట.. ఒకేరోజున ఇన్ని కేసులు పాజిటివ్ రావడం అదే మొదటిసారి. కరీంనగరైతే తల్లడిల్లింది.

ఏం జరుగుతుందో అర్థంకాక ప్రజలు అల్లాడిపోయారు. కరోనా ఎవరికి ఏ విధంగా వ్యాపిస్తుందో తెలియక ఆందోళనకు గురయ్యారు. ఊళ్లో ఉంటే ఏమవుతుందో.. ఎవరిని కలిస్తే ఏ విధంగా అంటుకుంటుందో తెలియక సతమతమయ్యారు. కానీ.. ప్రభుత్వ యంత్రాంగం ధైర్యం కోల్పోలేదు. నిర్ణయాలు తీసుకోవడంలో క్షణం ఆలస్యం చేయలేదు. సీఎం కేసీఆర్ నేరుగా రంగంలోకి దిగారు. పలు విభాగాల అధికారులు క్షేత్రస్థాయిలో కఠినంగా కట్టడి చర్యలను చేపట్టారు. కలెక్టరేట్ సమీపంలోని మూడు కిలోమీటర్ల పరిధిని అష్టదిగ్బంధంచేశారు. రాష్ట్రంలో, దేశంలో లాక్‌డౌన్ ప్రకటించడానికి ముందే కరీంనగర్‌ను లాక్‌డౌన్ చేశారు. ప్రతి ఒక్కరికీ వైద్యపరీక్షలు నిర్వహించారు. పకడ్బందీగా శానిటైజ్‌చేశారు. ఏ చిన్న అనుమానం వచ్చినా క్వారంటైన్‌కు తరలించారు. రేయింబవళ్లు శ్రమించి కమ్యూనిటీ ట్రాన్స్‌మిట్ దశలోకి వైరస్ ప్రవేశించకుండా విజయం సాధించారు.

కేవలం 10 రోజుల్లోనే కరీంనగర్ మళ్లీ ఊపిరి పీల్చుకొన్నది. నిశ్చింతగా నిద్రపోవడం మొదలుపెట్టింది. కరీంనగర్ ఘటనతో నిజాముద్దీన్ ఉదంతాన్ని తెలంగాణ ప్రభుత్వం కేంద్రం దృష్టికి తేగలిగింది. అన్ని రాష్ట్రాలను అప్రమత్తంచేసింది. కరోనా నియంత్రణలో ఇవాళ కరీంనగర్ దేశానికి రోల్ మోడల్‌గా నిలిచింది.

# కరీంనగర్ ధీకారం

జనం కలిసికట్టు కరోనా ఆటకట్టు

- ఒక్కరోజే 8 కేసులతో ఉలిక్కిపడ్డ నగరం
- రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తం
- నేరుగా రంగంలోకి దిగిన ముఖ్యమంత్రి కేసీఆర్
- జనతా కర్ఫ్యూకు ముందే పట్టణం లాక్‌డౌన్
- నగరం మొత్తం శానిటేషన్ అనుమానిత ప్రాంతాలు, వ్యక్తులు క్వారంటైన్
- కమ్యూనిటీ ట్రాన్స్‌మిట్ కాకుండా వైరస్ కట్టడి
- రోల్‌మోడల్‌గా కరీంనగరం

### నిగ్గు తేల్చిన నిఘా

కరీంనగర్‌లో ఒక కానిస్టేబుల్‌కు వచ్చిన అనుమానం.. రాష్ట్రంలో, దేశంలో కరోనా పెనువ్యాప్తికి అడ్డుకట్టవేసింది. రాష్ట్ర నిఘా వర్గాల పకడ్బందీ విచారణ.. పక్కా ప్రణాళిక.. దేశంలో తబ్లిగీ జమాత్ తుట్టెను కదిలించింది. కరోనా తగ్గుముఖం పడుతుందనుకొన్న సమయంలో.. దేశవ్యాప్తంగా వైరస్ విస్తరించడానికి ఒక కారణమైన.. మర్కజ్‌కు వెళ్లివచ్చిన వారి జాడను పసిగట్టేట్లు చేసింది. మన నిఘా వర్గాల సమర్థ పనితీరు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం.. దేశానికే ఆదర్శంగా నిలిచింది. నాలుగు రోజుల వ్యవధిలో తెలంగాణ నుంచి మర్కజ్‌కు వెళ్లివచ్చిన 1200 మందిని గుర్తించి క్వారంటైన్‌కు తరలించడం రాష్ట్ర నిఘావర్గాల సమర్థతకు నిదర్శనం.

కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ: కరీంనగర్‌లో ఒక్కసారిగా 8 పాజిటివ్ కేసులు నమోదుకావడంతో రాష్ట్రం, దేశం యావత్తు ఉలిక్కిపడింది. కానీ, ఆ భయాలన్నింటినీ కరీంనగరం పటాపంచలు చేస్తూ కరోనాను కలిసికట్టుగా పారదోలింది. కరోనాపై పోరులో దేశానికే ఆదర్శంగా నిలిచి ఇప్పుడూ దేశ్యవాప్తంగా చర్చల్లో నిలిచింది. వైరస్ మరింతమందికి సోకకుండా జిల్లా, రాష్ట్రయంత్రాంగం కలిసికట్టుగా కదిలింది. పాజిటివ్ వచ్చిన వారు సంచరించిన ప్రాంతాలను గుర్తిస్తూనే.. అనుమానితులను హోంక్వారంటైన్‌కు తరలించారు. ఒకేసారి 8 కేసులు వచ్చినా.. వైరస్ వ్యాప్తి చెందకుండా జిల్లా యంత్రాంగం వ్యవహరించిన తీరు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నది. ఇండోనేషియాకు చెందిన 10 మంది మతప్రచారకులు మార్చి 14న రామగుండం నుంచి కరీంనగర్ చేరుకొన్నట్టు యంత్రాంగం గుర్తించింది. వారు ముకరంపుర మసీదులో ఉన్నారన్న సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, రెండుగంటల్లోనే అందరినీ అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ దవాఖానకు తరలించి ప్రాథమిక పరీక్షలు చేయించారు. ఒకరికి కరోనా పాజిటివ్ లక్షణాలున్నట్టు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో జిల్లా యంత్రాంగం మొత్తం అలర్ట్ అయింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారి తో సన్నిహితంగా తిరిగిన మరో ముగ్గురిని గుర్తించి, మొత్తం 13 మందిని అదేరోజు మధ్యాహ్నంకల్లా సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. వారిలో ఒకరికి కరోనా పాజిటివ్ వచ్చినట్టు 17న తేలింది. 18న మరో ఏడుగురికి పాజిటివ్‌గా బయటపడింది. జిల్లాలో మొత్తం 18 మందికి కరోనా పాజిటివ్ రాగా..

మిగతా 2వ పేజీలో

# అప్రమత్తతే ఆయుధం

- ప్రపంచం, దేశంలో పెరుగుతున్న కేసులు
- రాష్ట్రంలో 531కి చేరిన కరోనా బాధితులు
- ప్రజలు, అధికారులు జాగ్రత్తగా వ్యవహరించాలి
- మర్కజ్ వెళ్లొచ్చినవారు స్వచ్ఛందంగా రండి
- ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా వైరస్ మహమ్మారి ఇక్కడ, అక్కడ అనే తేడా లేకుండా ప్రపంచం, దేశం, తెలంగాణలోనూ వ్యాప్తి చెందుతున్నదని, ప్రజలు ఇంతకు ముందుకంటే మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విజ్ఞప్తిచేశారు. అప్రమత్తతే కొవిడ్ కట్టడికి ఆయుధమని పేర్కొన్నారు. కొవిడ్ వ్యాప్తి నివారణకు చేపడుతున్న చర్యలు, వైరస్ సోకినవారికి అందుతున్న చికిత్స, లాక్‌డౌన్ అమలవుతున్న తీరు, పేదలకు అందుతున్న సాయం, పంట ఉత్పత్తుల కొనుగోళ్లు జరుగుతున్న తీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మధ్యాహ్నం మూడు నుంచి రాత్రి 9.30 గంటలవరకు సాగిన ఈ సమీక్షలో రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితిని సీఎం సమీక్షించారు. రాష్ట్రంలో ఆదివారం కొత్తగా 28 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని, ఇద్దరు చనిపోయారని తెలిపారు. చికిత్స పొందుతున్నవారిలో ఏడుగురు కోలుకొని డిశ్చార్జి అయినట్టు చెప్పారు. దీంతో తెలంగాణలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 531కి, మరణించినవారి

మిగతా 2వ పేజీలో

## భారత్‌లో కరోనా ఉగ్రరూపం

# 24 గంటల్లో 909 కేసులు

- ఒక్కరోజులో 34 మంది మృతి
- తెలంగాణలో 28 పాజిటివ్ కేసులు
- ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు

5

బ్రిటన్ ప్రధాని బోరిస్ డిశ్చార్జి 4

# వృద్ధిరేటు అంతంతే!

- ఈసారి భారత జీడీపీ 1.5 శాతమే
- గత 30 ఏండ్లలో ఇదే అత్యల్పం
- వచ్చే ఏడాది 5 శాతానికి పుంజుకొనే అవకాశం
- 40 ఏండ్ల కనిష్ఠానికి దక్షిణాసియా వృద్ధిరేటు
- తాజా నివేదికలో ప్రపంచ బ్యాంకు అంచనా
- నిధుల సమీకరణకు తెలంగాణ పక్కా వ్యూహం
- నేడు తెలంగాణ బాండ్ల వేలం?



కరోనా కాటుతో దేశ వృద్ధిరేటు మరింత కుదేలవడం ఖాయమంటున్న వివిధ అంతర్జాతీయ సంస్థలతో ప్రపంచ బ్యాంకు కూడా గొంతు కలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 1.5 శాతం నుంచి 2.8 శాతం మేరకు నమోదుకావచ్చని అభిప్రాయపడింది. దేశంలో ఆర్థిక సరళీకరణ మొదలైన 1991 తర్వాత ఇదే అత్యల్ప వృద్ధిరేటని స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2019-20)లో భారత వృద్ధిరేటు 4.8 నుంచి 5 శాతం మేరకు ఉండవచ్చని అంచనా వేసిన ప్రపంచ బ్యాంకు.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జీడీపీ వృద్ధిరేటు 5 శాతానికి పుంజుకోవచ్చని తెలిపింది. తెలంగాణ ప్రభుత్వం మరోవైపు నిధుల సమీకరణకు ఉపక్రమించింది. తద్వారా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలకు, ప్రజల అత్యవసరాలకు విఘాతం కలుగకుండా చూసేందుకు పక్కా వ్యూహంతో ముందుకు సాగుతున్నది. బాండ్ల వేలం ద్వారా తొలుత బహిరంగ మార్కెట్ల నుంచి రూ.2 వేల కోట్ల రుణాలను తీసుకోనున్నది. ఈ బాండ్లను రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ద్వారా సోమవారం వేలానికిపెట్టే అవకాశమున్నది.

12



పాపయ్యపేటలోని కొనుగోలు కేంద్రంలో మక్కలను తూకం వేస్తున్న నిర్వాహకులు

# మక్కకు మద్దతు

గ్రామాల్లో మార్క్‌ఫెడ్ కేంద్రాల ఏర్పాటు.. మద్దతు రూ.1,760తో కొనుగోళ్లు

నీటి వసతితో పెరిగిన సాగువిస్తీర్ణం, దిగుబడి

వరంగల్ రూరల్ జిల్లాప్రతినిధి, నమస్తే తెలంగాణ: వరంగల్‌రూరల్ జిల్లా చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో మొత్తం భూవిస్తీర్ణం 3,672 ఎకరాలు. గ్రామంలో అధికంగా మొక్కజొన్న సాగుచేస్తుంటారు. గతేడాది యాసంగిలో 320 ఎకరాల్లో మాత్రమే మక్కలు వేశారు. ఈ ఏడాది వర్షాలు కురియడంతోపాటు, కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా సాగునీరు సమృద్ధిగా వచ్చింది. దీనికితోడు కాళేశ్వరం నీటితో చుట్టుపక్కల చెరువు కూడా నింపడంతో భూగర్భజలాలు పెరిగి బోర్లలో నీళ్లు ఉబికివచ్చాయి. దీంతో పాపయ్యపేట రైతులు ఈ యాసంగిలో 1,200 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశారు. నీళ్లూ సమృద్ధిగా అందడంతో ఎకరానికి 40 నుంచి 45 క్వింటాళ్ల దిగుబడి వస్తున్నది. మక్కలను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఈ నెల 7వ తేదీన గ్రామంలో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటుచేసింది. క్వింటాకు

మిగతా 7వ పేజీలో

## ముమ్మరంగా యాసంగి ధాన్యం సేకరణ

లక్షా 25 వేల మెట్రిక్ టన్నులు దాటిన కొనుగోళ్లు

రైతుబంధు సమితి చైర్మన్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి 7



# ఎంసెట్ వాయిదా

ఈసెట్ సహా అన్ని ప్రవేశ పరీక్షలకు వర్తింపు

మే 5 వరకు దరఖాస్తుల గడువు

ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో మే 4 నుంచి 11 వరకు నిర్వహించే టీఎస్‌ఎంసెట్-2020తోపాటు అన్ని రకాల ప్రవేశపరీక్షలను వాయిదావేసినట్టు ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం లాక్‌డౌన్‌ను ఈ నెల 30 వరకు పొడిగించిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మేలో నిర్వహించాల్సిన తెలంగాణ రాష్ట్ర ఇంజినీరింగ్, అగ్రికల్చర్, మెడికల్ (ఫార్మసీ, వెటర్నరీ.. ఇతర) కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (టీఎస్ ఎంసెట్), ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఈసెట్), ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఐసెట్), లా కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (లాసెట్), ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎడ్‌సెట్), పోస్టు గ్రాడ్యుయేషన్ ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్), ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) వంటి అన్ని రకాల ప్రవేశ పరీక్షలను వాయిదా వేశామని పేర్కొన్నారు. ఈ పరీక్షల దరఖాస్తుల గడువు తేదీని కూడా మే ఐదు వరకు పొడిగించినట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగంచేసుకోవాలని కోరారు.





బట్టలు ఉతుకుతున్న బుచ్చవ్వ

# పేద బతుకు పెద్ద మనసు

- లాక్‌డౌన్‌లో నిరుపేదలకు సాయం
- 25 వేలు దానంచేసిన వృద్ధురాలు
- కిరాయి మాఫీచేసిన మరో మహిళ

నిరుపేదల కన్నీళ్లు చూసి నాలుగేండ్ల రెక్కల కష్టాన్ని వదులుకున్నదో ముసలవ్వ. 'సంపాదించింది ఏమన్నా నెత్తినవెట్టుకపోతమా.. పోరగాండ్ల తిండికి మన పైసలు అక్కెరయితే అంతకంటే సంబురం ఇంకేముంటది' అని రూ.25 వేలు దానంచేసి అందరికీ ఆదర్శంగా నిలిచింది జగిత్యాలకు చెందిన బుచ్చవ్వ. ముఖ్యమంత్రి పిలుపునకు కదిలి రూ.5.7 లక్షల కిరాయి రద్దు చేశారు నిజామాబాద్‌కు చెందిన మరో మహిళ హజ్రత్ బేగం. సాయం చేయడంలో పేద, ధనిక అనే భేదాల్లేవని నిరూపించారు. లాక్‌డౌన్ వేళ తిండికి నోచుకోని వారికి బాసటగా నిలిచారు.

3

అందరిలాగే ఆరోజు రాత్రి
కమ్మని స్వప్నాలను
కప్పుకొని నిద్రించాం
తెల్లారేసరికి
మరో ప్రపంచంలో వున్నాం.
-డా.ఎన్. గోపి

## లాక్‌డౌన్-డే 21

ఉష్ణోగ్రతలు

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| హైదరాబాద్ | 37.8°c | 22.2°c |
| కరీంనగర్ | 39.0°c | 25.0°c |
| వరంగల్ | 39.0°c | 23.5°c |
| రంగారెడ్డి | 37.0°c | 24.0°c |
| నల్లగొండ | 39.4°c | 24.2°c |
| మెదక్ | 36.0°c | 24.0°c |
| ఆదిలాబాద్ | 38.8°c | 23.2°c |
| నిజామాబాద్ | 39.4°c | 24.9°c |
| మహబూబ్‌నగర్ | 38.5°c | 24.1°c |
| ఖమ్మం | 39.0°c | 25.0°c |





కరీంనగర్‌లోని రెడ్‌జోన్ ఏరియాలో కరోనాపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మంత్రి గంగుల కమలాకర్, (ఇన్‌సెట్) 36వ డివిజన్‌లో వివరాలు సేకరిస్తున్న కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి (ఫైల్ ఫొటోలు)

కరోనా పాజిటివ్ వచ్చిన మొదటి రోజు నుంచే సీఎం కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. కరోనా కట్టడికి, ప్రజలకు ఇబ్బంది ఎదురవకుండా అనేక సూచనలు ఇచ్చారు. సహకరించాలని అన్నివర్గాలను కోరాం. జిల్లా అధికార యంత్రాంగం అహర్నిశలు శ్రమించింది.

- మంత్రి గంగుల కమలాకర్

కరోనా వైరస్ వ్యాప్తి కట్టడవుతుందా అనే భయం ముందుగా ఉన్నది. కానీ, సీఎం, స్థానిక మంత్రి, ప్రజల సహకారంతో సమర్థంగా ఎదుర్కోగలిగాం. వైద్య, నగరపాలక, పోలీసు సిబ్బంది అందరి సహకారం వల్లే ఇది సాధ్యమయింది. ప్రజలూ సహకరించారు.

- శశాంక, కరీంనగర్ కలెక్టర్

# కరీంనగర్ ధిక్కారం

మొదటిపేజీ తరువాయి...

ఇందులో పదిమంది ఇండోనేషియా మత ప్రచారకులు. మరో ముగ్గురు ఢిల్లీ మర్కజ్‌కు వెళ్లొచ్చిన వారున్నారు. ప్రతి పరిణామాన్నీ గమినిస్తూ వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్.. నేరుగా రంగంలోకి దిగారు. జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి.. తీసుకోవాల్సిన చర్యలను ఎప్పటికప్పుడు సూచిస్తూ వచ్చారు. పరిస్థితులను దగ్గరుండి పర్యవేక్షించాల్సిందిగా బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్‌ను పంపించారు.

### అనుమానిత ప్రాంతాల గుర్తింపు

అధికారులు ముందుగా ఇండోనేషియన్లు తిరిగిన ప్రాంతాలను గుర్తించారు. ఎక్కడ తిరిగారు, ఎవరిని కలిశారన్న విషయాలపై సీసీ ఫుటేజీల ఆధారంగా వివరాలు సేకరించారు. ఇందుకోసం ర్యాపిడ్ రెస్పాన్స్ టీంలను రంగంలోకి దించారు. ఆ ప్రాంతాలను 19వ తేదీన రెడ్‌జోన్‌గా ప్రకటించారు. కలెక్టరేట్ వద్ద గల మసీదులో మత ప్రచారకులు నివాసం ఉన్నారని గుర్తించి.. అక్కడి నుంచి మూడుకిలోమీటర్ల పరిధిలో ఎవరూ బయటకు రాకుండా కర్ఫ్యూ ప్రకటించారు.

### 150 బృందాలతో ర్యాపిడ్ ఫీవర్ సర్వే

రెడ్‌జోన్‌గా ప్రకటించిన ప్రాంతాల్లోని 36,074 ఇండ్లలో 1,36,348 మందికి 150 వైద్యబృందాలతో మూడురోజులపాటు ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. 73 మంది అనుమానితులను గుర్తించి క్వారంటైన్‌కు తరలించారు. రక్తనమూనాలను గాంధీ దవాఖానకు పంపించడంతోపాటు, వారిని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేశారు. రెడ్ జోన్ ప్రాంతాల్లో కొంతమంది వైద్యపరీక్షలకు సహకరించకపోవడంతో మంత్రి గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ శశాంక, సీపీ కమలాసన్‌రెడ్డి నేరుగా రంగంలోకి దిగారు. మత పెద్దలతో మాట్లాడి వారిని ఒప్పించారు. విదేశాల నుంచి జిల్లాకువచ్చిన 622 మందినీ హోంక్వారంటైన్ చేశారు. వారు బయటకు రాకుండా నిఘా పెట్టడంతోపాటు, జియో ట్యాగింగ్ చేశారు.

### పారిశుద్ధ్య పనులు.. మందు పిచికారీ

పట్టణంలో అధికారులు మరోవైపు పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. సుమారు వెయ్యి మంది కార్మికులతో పట్టణం మొత్తం శుభ్రం చేయించారు. 140 ఆటో పవర్‌స్ప్రేలు, ఐదు ఫైర్‌ఇంజిన్లు, ప్రత్యేకంగా తయారుచేసిన ఐదు ట్రాక్టర్లతోపాటు, డ్రోన్‌సహాయంతో హైపో క్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేశారు. అన్ని వీధుల్లో బ్లీచింగ్, ఫినాయిల్ చల్లారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు 50వేల కరపత్రాలు ముద్రించి ఇంటింటికీ పంపిణీచేశారు.

### ముందుగానే లాక్‌డౌన్

దేశంలో జనతాకర్ఫ్యూ, లాక్‌డౌన్‌ను ప్రకటించడానికి ముందుగానే కరీంనగర్‌లో కర్ఫ్యూ అమలుచేశారు. ఈ సమయంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రత్యేకంగా రెండు కాల్‌సెంటర్లను కూడా ఏర్పాటు చేశారు. ఇండ్లనుంచి ఎవరూ బయటకు రాకుండా సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వాహనం, డ్రోన్ కెమెరాల సహాయంతో పోలీసులు నిరంతరం పర్యవేక్షించారు. ఆయా మతాల పెద్దలతో మాట్లాడి మందిరాలు, మసీదులు, చర్చిల వద్ద ప్రజలు గుమికూడకుండా చర్యలు తీసుకొన్నారు.

### ఇండ్లకే నిత్యావసరాల సరఫరా

రెడ్‌జోన్ ఏరియాప్రాంతాల్లో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఇండ్లవద్దకే పాలు, కూరగాయలు, ఇతర నిత్యావసర సరకులు సరఫరా చేశారు. ప్రజలు ఎక్కడివారు అక్కడే కూరగాయలు కొనుక్కొనేలా పౌరసరఫరాల శాఖ అధికారులు మినీ, మొబైల్ రైతు బజార్లను అందుబాటులోకి తెచ్చారు. పట్టణంలో దాదాపు 15వేల మంది వలస కార్మికులను గుర్తించి వారికి 12 కేజీల బియ్యం, ఒక్కొక్కరికి రూ.500 పంపిణీ చేశారు.

### వైద్యానికి ముందస్తు ఏర్పాట్లు

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు వైద్యారోగ్యశాఖ సహకారంతో జిల్లాకేంద్రంలోని దవాఖానలో 200 బెడ్లతో ఐసోలేషన్ వార్డు, 20 బెడ్ల ఐసీయూవార్డును ఏర్పాటు చేశారు. అలాగే చల్మెడ దవాఖానలో 500 ఐసొలేషన్, 50 ఐసీయూ.. ప్రతిమ వైద్యశాలలో 500 ఐసొలేషన్, 150 ఐసీయూ బెడ్లను సిద్ధంచేశారు. జిల్లాలో కరోనా పాజిటివ్ వచ్చిన 18మందిలో 11మందికి నెగెటివ్ వచ్చి డిశ్చార్జికాగా, మరో ఏడుగురు గాంధీ దవాఖానలో చికిత్స పొందుతున్నారు.



కరీంనగర్ పట్టణంలో ప్రత్యేక యంత్రాలతో క్రిమిసంహారక మందుల పిచికారీ (ఫైల్)

# నిగ్గు తేల్చిన నిఘా

## కానిస్టేబుల్‌కు వచ్చిన సందేహంతో కదిలిన తబ్లిగీ జమాత్ డొంక

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో కరోనా క్రమంగా తగ్గుముఖం పడుతుందనుకొంటున్న తరుణంలో కరీంనగర్‌లో ఇండోనేషియన్ల సంచారం ఒక్క కుదుపుకుదిపింది. కరీంనగర్ జిల్లాలో గ్రానైట్ ఇండస్ట్రీ ఉండటంతో గత కొన్నేండ్లుగా విదేశీయుల రాకపోకలు పెరిగాయి. ఏడాదిన్నర కాలంగా వారి కదలికలపై పోలీస్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టింది. దీనికితోడు కరోనా ముప్పు బయటపడటంతో విదేశీయులందరిపైనా నిఘా మరింతపెంచారు. జిల్లా ఇంటెలిజెన్స్‌వర్గాలు విదేశాల నుంచి వచ్చినవారి వివరాలు సేకరిస్తున్న క్రమంలో కరీంనగర్ పట్టణం.. ముకరంపుర ప్రాంతంలోని ఓ మసీదులో ఇండోనేషియన్లు ఉన్నారన్న జాడ తెలిసింది. మార్చి 15 సాయంత్రం అక్కడకు వెళ్లిన ఇంటెలిజెన్స్ కానిస్టేబుల్.. ఇండోనేషియన్లలో ఒకరు దగ్గు, జలుబుతో బాధపడుతున్నట్టు గమనించారు. అనుమానంతో ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. అధికారులు అతనికి నిర్వహించిన పరీక్షలో కరోనా పాజిటివ్ అని తేలడంతో మిగతావారందరినీ అదుపులోకి తీసుకొని పరీక్షలుచేయించారు. వారిలో 8మందికి పాజిటివ్ అని తేలింది. దీంతో నిఘా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇండోనేషియా బృందాన్ని విచారించారు. ఈ దర్యాప్తులోనే తబ్లిగీ జమాత్ లింక్ బయటపడింది. వాళ్లంతా మార్చి 9న ఇండోనేషియా నుంచి ఢిల్లీకి వచ్చారు. నిజాముద్దీన్ ప్రాంతంలోని బడీ బంగ్లావాలీ మసీదులో ఉన్నారు. ఆ తర్వాత తబ్లిగీ జమాత్ ప్రార్థనల్లో పాల్గొన్నారు. అక్కడి నుంచి రైలు ద్వారా కరీంనగరానికి వచ్చారు. ఈ సమాచారం పోలీసు ఉన్నతాధికారులను ఉలిక్కిపడేలాచేసింది. పూర్తి వ్యవహారంపై నిగ్గు తేల్చడానికి ఇంటెలిజెన్స్ ప్రత్యేకబృందాన్ని ఢిల్లీకి పంపించారు. అదేసమయంలో కేంద్ర హోం, ఆరోగ్యశాఖలకు తబ్లిగీ జమాత్ సమాచారాన్ని అందించి అలర్ట్‌చేశారు. దీంతో కేంద్రప్రభుత్వం అలర్ట్ అయి అన్ని రాష్ట్రాలకు సమాచారమిచ్చింది.

### గంటల్లోనే ఆపరేషన్ పూర్తి

హైదరాబాద్ నుంచి ఢిల్లీకి వెళ్లిన రాష్ట్ర ఇంటెలిజెన్స్ బృందం పకడ్బందీ ప్రణాళికతో వ్యవహరించింది. తెలంగాణ నుంచే కాకుండా ఏపీ నుంచి తబ్లిగీ జమాత్‌కు వెళ్లినవారి వివరాలు, ఫోన్‌నంబర్లను అక్కడి నిర్వాహకుల నుంచి సేకరించారు. తెలంగాణ నుంచి 1200 మంది మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్నట్లు తేలింది. ఇంటెలిజెన్స్ బృందంలోని కొందరు సభ్యులు.. నిజాముద్దీన్ ప్రాంతంలోని సెల్‌ఫోన్ టవర్ డంప్ ద్వారా తెలంగాణకు చెందిన వారి ఫోన్లన్నింటినీ ట్రాక్‌చేయడం మొదలుపెట్టారు. మరికొందరు ఇవే ఫోన్ నంబర్ల ఆధారంగా ఢిల్లీ నుంచి తెలుగు రాష్ట్రాలకు వెళ్లినవారి వివరాలు, వారు ప్రయాణించిన రైళ్లు.. ఎక్కడి వరకు రిజర్వేషన్ చేయించుకొన్నారు.. ఏయేబోగీల్లో, ఏ సీట్లలో ప్రయాణించారు.. ఏ స్టేషన్లో దిగారన్న వివరాలను సేకరించారు. తర్వాత జిల్లాలవారీగా మర్కజ్ ప్రయాణికుల వివరాలను విభజించారు. ఆ సమాచారం ఆధారంగా స్థానిక పోలీసులు వారిని గుర్తించారు. మార్చి 17న మొదలైన ఆపరేషన్ నాలుగురోజుల్లోనే పూర్తయింది. మొత్తం 1200 మందిని అదుపులోకి తీసుకొన్నారు. వారందరినీ వైద్యసిబ్బంది సహకారంతోక్వారంటైన్ సెంటర్లకు తరలించారు.

### లాక్‌డౌన్‌తో పెనుప్రమాదమే తప్పింది

ఇదేసమయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నింటినీ బంద్‌చేయడం, లాక్‌డౌన్ దిశగా చర్యలు తీసుకోవడం నిఘావర్గాల సెర్చ్ ఆపరేషన్‌కు మరింత కలిసొచ్చింది. ఎక్కడివారు అక్కడ ఇండ్లకే పరిమితం కావడంతో మర్కజ్ వెళ్లి వచ్చినవారు ఈజీగా చిక్కారు. దీంతో కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్ ముప్పునుంచి బయటపడ్డాం. క్షేత్రస్థాయిలో మెడికల్ సిబ్బందితోకలిసి పోలీస్ బృందాలు కరోనా లక్షణాలున్న వారితోపాటు వారి కుటుంబసభ్యులు, సన్నిహితులందరినీ క్వారంటైన్‌కు పంపారు. ఇలా నిఘావర్గాల పక్కా వ్యూహం వల్ల దాదాపు మూడువేల మంది క్వారంటైన్ అయ్యారు. ఇప్పుడు రెండు, మూడు దశల్లో ఎవరికైనా మళ్లీ వైరస్ వ్యాప్తి చెందిందా అన్న విషయంపైనా ప్రత్యేక బృందాలు దృష్టి సారించాయి. తెలంగాణ పోలీసుల మాదిరిగా మహారాష్ట్ర పోలీసులు వెంటనే అప్రమత్తం కాకపోవడంతో అక్కడ కమ్యూనిటీ ట్రాన్స్‌మిషన్‌లోకి కరోనా వైరస్ వ్యాప్తి వెళ్లిందని, అందుకే అక్కడ కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా పెరుగుతున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.



### ఇంత తీవ్రత ఊహించలేదు

రెండేండ్లుగా జిల్లాలో స్పెషల్ బ్రాంచ్‌ను పటిష్ఠంచేసి, ఇతర దేశాల నుంచి వచ్చేవారి కదలికలపై నిఘాపెట్టాం. కరోనాతో మరింత అప్రమత్తమయ్యాం. ఆ క్రమంలోనే ఇండోనేషియన్ల విషయం తెలిసింది. వారికి కరోనా పాజిటివ్ అని వచ్చే వరకు కూడా ఇంత తీవ్రతను ఊహించలేదు. వెంటనే అప్రమత్తమై సమాచారాన్ని రాష్ట్రస్థాయి అధికారులకు ఇచ్చాం. వాళ్లంతా ఢిల్లీలో మర్కజ్ నుంచి వచ్చారని మేం ఇచ్చిన సమాచారంతో దేశావ్యాప్తంగా ఇంతపెద్ద విపత్తును బయటకు తెస్తామనుకోలేదు.

- కమలాసన్‌రెడ్డి, సీపీ, కరీంనగర్



దవాఖానలో అనూష

# తల్లీబిడ్డల ప్రాణం నిలిపారు

## రెండు గర్భసంచులున్న మహిళకు అరుదైన శస్త్రచికిత్స

**హుజూరాబాద్‌టౌన్:** రెండు గర్భసంచులు ఉండి పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణికి వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఆదేశాలతో హుజూరాబాద్ వైద్యులు అరుదైన శస్త్రచికిత్సచేసి ప్రాణంపోశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు సమీపం మొగచింతలకు చెందిన ఏడుకొండలు-జయమ్మ దంపతులు కొన్ని నెలల క్రితం వచ్చి జమ్మికుంటకు వచ్చారు. స్థానికంగా తాపీ పని చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరి కూతురు అనూష గర్భిణీ కావడంతో నెలనెలా హన్మకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానలో పరీక్షలు చేయించారు. ప్రసవం తేదీ దగ్గర పడడంతో ఆమెకు వెంటనే శస్త్రచికిత్స చేయాలని, ఇందుకు రూ.2 లక్షలకుపైగా ఖర్చవుతుందని వైద్యులు చెప్పారు. దీంతో ఏమిచేయాలో తెలియక మంత్రి ఈటల రాజేందర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించారు. స్పందించిన మంత్రి ఆ గర్భిణిని ఆదుకోవాలని హుజూరాబాద్ ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ ప్రవీణ్ రెడ్డిని ఆదేశించారు. దీంతో లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో వైద్యులు రెండు గంటలకు పైగా శ్రమించి పగిలిన గర్భసంచి తొలగించి, మరో గర్భసంచిలోని బిడ్డను క్షేమంగా బయటకు తీశారు. శిశువును వరంగల్ ఎంజీఎంకు తరలించగా, తల్లి హుజూరాబాద్‌లో కోలుకుంటున్నది. లక్ష మందిలో ఒకరిద్దరికి జన్యులోపంతో రెండు గర్భసంచులుంటాయని లాప్రోస్కోపిక్ సర్జన్ తెలిపారు.

## దశలవారీగా భారత్‌కు తీసుకురండి

### కేంద్రానికి ఐటీశాఖ మంత్రి కేటీఆర్ విజ్ఞప్తి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విదేశాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్న భారతీయులను.. ఇక్కడకు తీసుకురావడానికి కృషిచేయాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పూరిని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కే తారకరామారావు కోరారు. వయసు పైబడినవారు, ఇతరులను దశలవారీగా విమానాల్లో భారత్‌కు తీసుకురావాలని ఆదివారం ట్విట్టర్‌లో విజ్ఞప్తిచేశారు. తమను స్వదేశానికి తీసుకురావాలంటూ ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేకమంది భారతీయులు.. వారి బంధువులను, మిత్రులను, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారని కేటీఆర్ తెలిపారు.

### లోకం పోకడ



బలుసాకు తెచ్చాను.. ఇక మనం బయటికి వెళ్ళాల్సిన పనిలేదు!

## ఏసు బోధనల మననంతో సేవాభావం

### క్రైస్తవులకు గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ ఈస్టర్ శుభాకాంక్షలు





హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈస్టర్ సందర్భంగా ఆదివారం క్రైస్తవ సోదరులకు, గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, సీఎం కే చంద్రశేఖర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా రోగులు, పేదవారికి సేవచేయడంలో ఏసుక్రీస్తు నిబద్ధతను గుర్తుచేసుకుంటూ.. ఆయన బోధనలను మనం ఎప్పుడూ మననం చేసుకోవాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు. కరోనా వైరస్‌ను విజయవంతంగా అధిగమించడానికి, ఆరోగ్యకరమైన తెలంగాణ రాష్ట్రాన్ని సృష్టించడానికి ఏసు పునరుత్థానం మనకు బలాన్ని ఇస్తుందన్నారు. జీసెస్ బోధనలను మార్గదర్శకంగా తీసుకొని సర్వమానవాళి శ్రేయస్సుకోసం పాటుపడాలని గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ పేర్కొన్నారు. ఈ స్ఫూర్తితో కరోనా మహమ్మారిని తరిమికొట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ముమ్మరంగా ఆన్‌లైన్ పాఠాలు

### నేడు, రేపు హెచ్‌వోడీల భేటీ.. చర్యలు చేపట్టిన వర్సిటీలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ నెల 30 వరకు లాక్‌డౌన్ పొడిగించిన నేపథ్యంలో యూనివర్సిటీల్లో ఆన్‌లైన్ పాఠాల బోధన పనులు మరింత ముమ్మరంగా సాగుతున్నాయి. విద్యార్థులు విద్యాసంవత్సరం నష్టపోకుండా అని యూనివర్సిటీలు చర్యలు చేపట్టాయి. ఆన్‌లైన్ వీడియో పాఠాలు, వర్చువల్ క్లాస్‌రూమ్స్, పీపీటీ, రేడియో వంటి పలు రకాల పద్ధతుల్లో ఆన్‌లైన్ పాఠాల బోధనకు కావాల్సిన పనుల్లో వేగంపెంచారు. సోమ, మంగళవారాల్లో యూనివర్సిటీల్లోని అన్ని శాఖల హెచ్‌వోడీలు, సీనియర్ ప్రొఫెసర్లు సమావేశం కానున్నారు. ఇందులో ఆన్‌లైన్ పాఠాలకు సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు. అఫిలియేషన్ కళాశాలల్లో ఆన్‌లైన్ పాఠాల బోధన విధానాన్ని తప్పనిసరి చేయాలనే అంశంపై చర్చించి, అభిప్రాయాలు సేకరిస్తామని జేఎన్టీయూహెచ్ అధికారులు తెలిపారు.

# అప్రమత్తతే ఆయుధం

మొదటిపేజీ తరువాయి...

సంఖ్య 16కు, డిశ్చార్జి అయినవారి సంఖ్య 103కు చేరినట్టు వివరించారు. మిగతా 412 మంది దవాఖానల్లో చికిత్స పొందుతున్నట్టు పేర్కొన్నారు. 'ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా, తెలంగాణలో పరిణామాలను గమనిస్తుంటే కరోనా వైరస్ వ్యాప్తి ఆగడంలేదని స్పష్టమవుతుంది. ఆదివారం కూడా గణనీయ సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తెలంగాణలో కొత్తగా 28 మందికి పాజిటివ్‌గా తేలడంతోపాటు ఇద్దరు చనిపోయారు. పక్కనే ఉన్న మహారాష్ట్రలో పరిస్థితి భయంకరంగా ఉంది. దేశవ్యాప్తంగా కూడా పాజిటివ్ కేసులు, మరణాలు పెరిగాయి. ఈ పరిస్థితి ఉన్నందునే లాక్‌డౌన్ పొడిగింపు నిర్ణయం తీసుకున్నాం. పరిస్థితి తీవ్రతను ప్రజలు అర్థం చేసుకోవాలి. వీలైనంతవరకు ఇండ్లకే పరిమితం కావాలి. బయటకు వెళ్లాల్సి వస్తే తప్పక నిర్ణీత దూరం పాటించాలి. వ్యక్తిగత పరిశుభ్రత చాలా ముఖ్యం. ఎవరికి ఏమాత్రం అనుమానం వచ్చినా పరీక్షలు చేయించుకోవాలి. వైరస్ సోకిన వ్యక్తులున్న ప్రాంతాలను గుర్తించి, ప్రభుత్వం అక్కడ ప్రత్యేక చర్యలు తీసుకున్నది. ప్రజలు దానికి సహకరించాలి. కరోనా వ్యాప్తి నివారణ అన్నది ప్రభుత్వం తీసుకునే నిర్ణయాల వల్ల మాత్రమే సాధ్యం కాదు. ఆ నిర్ణయాలను ప్రజలు తూచా తప్పకుండా పాటించడం వల్లే సాధ్యమవుతుంది. వైరస్ వ్యాప్తి జరుగుతున్నదనే వాస్తవం గ్రహించి, ప్రజలు ఇంతకుముందుకంటే కూడా మరింత జాగ్రత్తగా ఉండాలి' అని సీఎం కోరారు.

### పాజిటివ్ కేసుల వెనుక ఆరా తీయండి

ఈ తరుణంలో అధికార యంత్రాంగం కూడా మరింత అప్రమత్తమై ఎవరికి లక్షణాలు కనిపించినా పరీక్షలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. పాజిటివ్ వచ్చిన వారు ఎవరెవరిని కలిశారు? ఎక్కడ తిరిగారు? అనే వివరాలు సేకరించి, వారికి కూడా పరీక్షలు నిర్వహించాలని సూచించారు 'అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద తనిఖీలు ఎక్కువ చేయాలి. నియంత్రణ పెంచాలి. మర్కజ్ ప్రార్థనల్లో పాల్గొన్నవారిని గుర్తించి, పరీక్షలు చేసే ప్రక్రియ ముమ్మరంగా జరుగుతుంది. ఇంకా ఎవరైనా తెలిసో తెలియకో పరీక్షలు చేయించుకోకుంటే వారే స్వయంగా వచ్చి పరీక్షలు చేయించుకోవాలి. ఇది వారికోసం, వారి కుటుంబసభ్యుల సంక్షేమంకోసం చెప్తున్న మాటలు. ప్రజలు నిరంతర అప్రమత్తంగా ఉంటూ, ఇండ్లకు పరిమితమైతేనే కరోనా వ్యాప్తి నివారణ సాధ్యమవుతుంది' అని సీఎం కేసీఆర్ స్పష్టంచేశారు. ఈ సమీక్షలో వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ప్రభుత్వ సలహాదారు రాజీవ్‌శర్మ, సీఎస్ సోమేశ్‌కుమార్, డీజీపీ మహేందర్‌రెడ్డి, ముఖ్య కార్యదర్శులు నర్సింగ్‌రావు, రామకృష్ణారావు, జనార్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కేసీఆర్ రియల్ హీరో

### మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశంస

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కరోనా కట్టడి ఓ వైపు, చేతికొస్తున్న పంటలు ఇంకోవైపు.. ఈ రెండింటిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలోనే రియల్ హీరోగా నిలిచారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశంసించారు. కరోనాపై నిత్యం సమీక్షలు నిర్వహిస్తూ.. వైరస్ వ్యాప్తి నివారణలో దేశంలో ముందువరుసలో ఉన్నందుకు సీఎం కేసీఆర్‌ను చూసి గర్వపడాలని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఆర్థికంగా నష్టం జరిగినా.. దూరదృష్టితో ప్రజాక్షేమాన్ని కోరి ఈ నెల 30 వరకు లాక్‌డౌన్ పొడిగించారని ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు లాక్‌డౌన్‌కు సహకరించాలని కోరారు. స్వీయ నియంత్రణ పాటించి కరోనా వ్యాప్తిని అరికడుదామని పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లాలో బత్తాయి, నిమ్మ రైతులు తమ ఉత్పత్తులను మార్కెట్లలో విక్రయించడానికి అయ్యే రవాణా ఇంధన ఖర్చు ను జిల్లాయంత్రాంగం భరిస్తుందని తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తంచేశారు.

# రేడియో న్యూస్‌రీడర్ పార్వతీప్రసాద్ కన్నుమూత

### తొలితరం వార్తాప్రయోక్త.. అనువాద రచనలో దిట్ట



హైదరాబాద్, నమస్తే తెలంగాణ/తెలుగు యూనివర్సిటీ: ఆకాశవాణి, దూరదర్శన్ న్యూస్‌రీడర్, రచయిత్రి పింగళి పార్వతీప్రసాద్ (70) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఆదివారం తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. 1980 నుంచి ఆకాశవాణి, దూరదర్శన్‌లో పనిచేసిన ఆమె.. తొలితరం వార్తాప్రయోక్తగా తెలుగు ప్రజలకు సుపరిచితం. దూరదర్శన్‌లో వివిధ హోదాల్లో దాదాపు 35 ఏండ్లు సేవలు అందించారు. అనువాద రచనలో ఖ్యాతిగడించారు. పలు పత్రికలకు అనువాదాలతోపాటు ఎన్నో నాటికలు, వ్యాసాలు రాశారు. యునిసెఫ్, సేవ్ ది చిల్డ్రన్ యూకే, ఆంధ్ర మహిళాసభ, పంచాయతీరాజ్‌శాఖ వంటి సంస్థలకు ప్రచారసామగ్రి తయారీలో తోడ్పాటు అందించారు. వినసొంపైన కంఠస్వరంతో ప్రతి అక్షరమూ శ్రోతలకు స్పష్టంగా వినబడాలని తపించే ఆమె.. ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారు. కొత్తగా ఉద్యోగంలో చేరేవారు అడిగే ప్రశ్నలకు ఎంతో ఓపికగా చిరునవ్వుతో సమాధానాలు చెప్పేవారు. రహమత్‌నగర్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. పార్వతీప్రసాద్‌కు భర్త, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆమె మృతికి ఆకాశవాణి ప్రాంతీయ వార్తావిభాగం అధికారి డాక్టర్ రాహుల్ గౌలీకర్, కరస్పాండెంట్ ఎంఎస్ లక్ష్మి, న్యూస్ ఎడిటర్ సురేశ్ ధర్మపురి, న్యూస్‌రీడర్లు తురగా ఉషారమణి, గద్దే దుర్గారావు, డాక్టర్ జే చెన్నయ్య, జే నాగేశ్వరరావు, వెంపటి కామేశ్వరరావు, ఏ రవికిశోర్, డాక్టర్ జగన్నాథస్వామి, పోణంగి భాస్కర్, శరత్ జ్యోత్స్న, ముంజల తిరుపతి, డాక్టర్ ఆర్ సూర్యప్రకాశ్‌రావు తదితరులు తీవ్ర సంతాపం ప్రకటించారు.

# కోలుకొన్నా వదలదు

- కరోనా నుంచి కోలుకొని ఇంటికెళ్లాక కూడా.. నెలపాటు గృహనిర్బంధం పాటించాల్సిందే
- తిరిగి పాజిటివ్ వచ్చే అవకాశాలూ లేకపోలేవు
- నిమ్స్ పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ పరంజ్యోతి



డాక్టర్ మాట

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** కరోనా పాజిటివ్ నుంచి పూర్తిగా కోలుకొన్న వ్యాధిగ్రస్థులు దవాఖాన నుంచి డిశ్చార్జి అయిన తర్వాత కూడా కనీసం నెలపాటు స్వీయ గృహనిర్బంధంలో ఉండాల్సిందేనని నిమ్స్ పల్మనాలజీ విభాగం అధిపతి డాక్టర్ పరంజ్యోతి చెప్పారు. పాజిటివ్ నుంచి నెగెటివ్‌కు కోలుకొన్నప్పటికీ రోగి శరీరంలో వైరస్ కారకాలు ఉండే అవకాశాలుంటాయని తెలిపారు. దవాఖాన నుంచి డిశ్చార్జి కాగానే జనాల్లోకి వెళ్లడం, ఇంటివారితో, స్నేహితులతో కలివిడిగా ఉండటం చేయకూడదన్నారు. సాధారణంగా పాజిటివ్ రిపోర్ట్ వచ్చిన వ్యక్తికి చేసే థ్రోట్ స్వాబ్, నోస్ స్వాబ్ టెస్టుల్లో నెగెటివ్ వచ్చినప్పటికీ రోగి స్టూల్‌లో (మలంలో) మాత్రం పాజిటివ్ వస్తుందని, అంటే రోగి శరీరంలో వైరస్ కారకాలు కోలుకొన్నప్పటికీ కనిపిస్తున్నట్టుగా భావించాలని పేర్కొన్నారు. ఇలాంటివారికి చికిత్స పెద్దగా అవసరం ఉండదని, అయితే ముందుజాగ్రత్త చర్యగా దవాఖాన నుంచి డిశ్చార్జి అయి ఇంటికిపోయిన తర్వాత కనీసం మరో 30 రోజులు స్వీయ గృహ నిర్బంధంలో ఉండాలని చెప్పారు. ఇలా మరో నెలపాటు స్వీయ గృహ నిర్బంధం పొడిగించడం రోగితోపాటు కుటుంబసభ్యులకు, ఆయనతో కలిసే ఇతరులకు కూడా మంచిదని గుర్తుంచుకోవాలని తెలిపారు. ప్రస్తుతం మన దగ్గర పాజిటివ్ నుంచి కోలుకొన్నవారికి మూడుసార్లు పరీక్షలు జరుపుతారని, అన్ని పరీక్షల్లో నెగెటివ్ వస్తేనే సదరు వ్యక్తి కోలుకొంటున్నట్టు భావించిన తర్వాత మరికొన్నిరోజులు పర్యవేక్షించి డిశ్చార్జ్ చేస్తారన్నారు.

### వుహాన్ వ్యూహం అదే

లక్షల సంఖ్యలో బాధితులు, వేల సంఖ్యలో మరణాలు జరిగిన చైనాలోని వుహాన్ ప్రజలు త్వరగా కోలుకొనేందుకు అక్కడి ప్రభుత్వం క్వారంటైన్ పద్ధతిని కచ్చితంగా పాటించిందని డాక్టర్ పరంజ్యోతి చెప్పారు. అక్కడ కొవిడ్ పాజిటివ్ వ్యాధిగ్రస్థుడు పూర్తిగా కోలుకొని తదనంతర వైద్యపరీక్షల్లో నెగెటివ్ వచ్చిన తర్వాత కూడా నెలపాటు దవాఖాన క్వారంటైన్‌లోనే ఉంచారని, అంటే పాజిటివ్ రోగులను అక్కడ కనీసం 60 నుంచి 70 రోజుల వరకు క్వారంటైన్‌లో ఉంచి కేసుల సంఖ్య పునరావృతం కాకుండా జాగ్రత్తపడ్డారని వెల్లడించారు.

# కమ్మటి పండు మన బంగినపల్లి

- ఉత్తరాది రాష్ట్రాలకు 50 శాతం ఎగుమతి
- విదేశాలకు ఏటా 49 వేల టన్నులు
- రవాణా సర్వీసులకు రైల్వేశాఖ ప్రత్యేక అనుమతి
- కరోనా నేపథ్యంలో రవాణాపై తొలగిన అనుమానాలు
- ఆనందంలో తెలంగాణ మామిడి రైతులు



'వింటే రామాయణం వినాలి'.. తింటే తెలంగాణ బంగినపల్లి మామిడి పండ్లే తినాలి.. అన్నంత కమ్మగా ఉంటున్నాయి మన రాష్ట్రంలో పండే ఈ రకం పండ్లు. రుచిలో, నాణ్యతలో దేశంలోనే మేటిగా నిలుస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. విదేశాల్లోనూ ఈ మామిడికి మంచి గిరాకీ ఉన్నది. మామిడిలో రారాజుగా వెలుగొందుతున్న తెలంగాణ బంగినపల్లి రకంలో.. కొల్లాపూర్, జగిత్యాల, సంగారెడ్డి ప్రాంతాల్లో ఉత్పత్తి అయ్యేవి మరింత శ్రేష్ఠంగా ఉంటాయి. రాష్ట్రంలో ఈ ఏడాది 10.80 లక్షల టన్నుల మామిడి దిగుబడి వచ్చే అవకాశం ఉన్నది. ఉత్పత్తిలో ఏటా 50 శాతం ఉత్తరాది రాష్ట్రాలకు సరఫరా చేస్తుండగా, 49 వేల టన్నులను విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా కరోనా వైరస్ ప్రభావంతో మామిడి విక్రయాలపై మొన్నటివరకు అనుమానాలు వ్యక్తమయ్యాయి. నిల్వ ఉండని పండ్లు, కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు ప్రత్యేక రైలు సర్వీస్‌లకు శనివారం కేంద్ర వ్యవసాయశాఖ అనుమతులు ఇవ్వడంతో మామిడి రైతుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో కొన్ని రాష్ట్రాలు మాత్రమే పండ్ల తోటల సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ఇందులో తెలంగాణ ముఖ్యమైనది. రాష్ట్రంలో 48 శాతం ఎర్ర భూములు పండ్ల తోటల సాగుకు అనుకూలం. దీనికి తోడు మన రాష్ట్రంలో గాలిలో తేమ శాతం తక్కువగా ఉండటం వల్ల తెగుళ్ల తాకిడి తక్కువని అధ్యయనాలు చెప్తున్నాయి. కొల్లాపూర్, జగిత్యాల, సంగారెడ్డి ప్రాంతాల్లో శ్రేష్ఠమైన మామిడి ఉత్పత్తి అవుతుంది. సాగునీటి ప్రాజెక్టుల వల్ల భూగర్భజలాలు భారీగా పెరగడంతో కొల్లాపూర్ ప్రాంతంలోని మామిడి కాయలు మంచి సైజుతో దిగుబడులు ఎక్కువగా వస్తున్నాయి. దేశంలో 1000కిపైగా మామిడి రకాలుంటే.. ఒక్కో రాష్ట్రంలో ఐదారు రకాలు మాత్రమే సాగులో ఉన్నాయి. కానీ కొన్ని రకాలు మాత్రమే వినియోగదారుల ఆదరణ పొందుతున్నాయి. అందులో బంగినపల్లి ప్రధానమైనది.

### నాణ్యత ఎక్కువ.. చీడపీడలు తక్కువ

చీడపీడల సమస్య తక్కువగా ఉండి, కాయలు నాణ్యతగా ఉండటం తెలంగాణ మామిడికి కలిసొచ్చే అంశం. రైతులు అవగాహనా లోపంతో ఎగుమతులపై ఎక్కువగా మొగ్గుచూపడంలేదు. ఎగుమతి ఖర్చుతో కూడుకున్నదని, సాంకేతికంగా కష్టమని భావిస్తున్నారు. కొంచెం కష్టపడితే తెలంగాణ మామిడికి మంచి ధర వచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఉదాహరణకు.. మామిడి కాయలకు ఇర్రేడియేషన్ ట్రీట్‌మెంట్ ఇచ్చి అమెరికా, ఐరోపా దేశాలకు ఎగుమతి చేయవచ్చు. వేడి నీటిలో ముంచి ఆస్ట్రేలియా వంటి దేశాలకు, ఎటువంటి ట్రీట్‌మెంట్ లేకుండానే సింగపూర్, ఇతర ఆసియా దేశాలకు పంపించవచ్చు. ఎగుమతులపై అవగాహన కల్పిస్తే మామిడి రైతులు లాభాలు మెండుగా గడించే అవకాశం ఉన్నది.

### 2.875 లక్షల ఎకరాల్లో సాగు విస్తీర్ణం

రాష్ట్రంలో మామిడి సాగు విస్తీర్ణం 2.875 లక్షలు. ఎకరానికి సగటున 3.7 టన్నుల దిగుబడి వస్తుంది. ఈ ఏడాది దాదాపు 10.80 లక్షల టన్నుల దిగుబడి రావొచ్చని ఉద్యాన వర్సిటీ శాస్త్రవేత్తలు అంచనా వేశారు. రాష్ట్రం నుంచి 50 శాతం ఉత్తరాది రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నారు. ఏటా దాదాపు 49 వేల టన్నుల మామిడి లండన్, సౌదీ అరేబియా, అమెరికా, కువైట్, ఒమెన్, నేపాల్, బహ్రెయిన్, సింగపూర్, జపాన్‌కు ఎగుమతి అవుతాయి.



### దిగుబడి తగ్గినా.. డిమాండ్ అధికం

ఈ ఏడాది వాతావరణ మార్పులు, పూత రాలడంతో మామిడి దిగుబడులు తగ్గనున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో వచ్చే మామిడి మంచి నాణ్యత, రుచిగా ఉంటాయి. మే రెండోవారంలో కోసే పండు అత్యంత రుచికరంగా ఉంటుంది. ప్రస్తుతం లాక్‌డౌన్ ఏప్రిల్ చివరి వరకు కొనసాగి.. మే నెలలో ఎత్తివేస్తే మామిడి రైతులు గట్టెక్కే అవకాశం ఉన్నది. మార్కెట్లలోకి మామిడి పండ్ల సరఫరా జూన్ 15 వరకు కొనసాగనున్నది.

### మధ్య దళారులకే లాభం

రాష్ట్రంలో మామిడి తోటలు 80 శాతం థర్డ్‌పార్టీ చేతుల్లో, 20 శాతం రైతుల చేతుల్లో ఉన్నాయి. తెలంగాణలో మామిడి మార్కెట్ పూర్తిగా మూడు నాలుగు కుటుంబాల చేతుల్లోనే ఉన్నది. పూతకొచ్చే దశలో మహారాష్ట్ర వ్యాపారులు వచ్చి అడ్వాన్స్‌లు చెల్లిస్తారు. కోత సమయంలో సదరు వ్యాపారి బీహార్ నుంచి కూలీలను తీసుకొచ్చి కాయలు కోసి ఢిల్లీ, ముంబై మార్కెట్లకు, అక్కడి నుంచి విదేశాలకు ఎగుమతి చేస్తూ లాభాలు గడిస్తున్నారు. తెలంగాణలో ఉత్పత్తి అయ్యే మామిడిలో స్థానికంగా 45 శాతం వినియోగిస్తుండగా, 50 శాతం ఉత్తరాదికి ఎగుమతి అవుతున్నది. మిగతా 5 శాతం విదేశాలకు సరఫరా చేస్తున్నారు. ఇక్కడి నుంచి దుబాయ్, మిడిల్‌ఈస్ట్, సింగపూర్ దేశాలకు ఎగుమతి చేయడానికి ఎలాంటి పరిమితులు లేవు. మొత్తం భారత్ నుంచి 69 దేశాలకు మామిడి ఎగుమతి అవుతున్నది.

### మన బంగినపల్లికి భలే క్రేజ్



దేశంలో పండే బంగినపల్లి రకాలలో తెలంగాణ పండుకు ఎక్కువ క్రేజ్ ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో పండే బంగినపల్లి పండుకు మచ్చతోపాటు రుచిలో కూడా వ్యత్యాసం ఉంటుంది. మామిడి దిగుబడి ఏపీలో ఎక్కువగా ఉన్నప్పటికీ తెలంగాణ బంగినపల్లికి దేశవ్యాప్తంగా ఎక్కువ డిమాండ్ ఉన్నది.

– డాక్టర్ భగవాన్, రిజిస్ట్రార్, ఉద్యాన వర్సిటీ
మామిడి పరిశోధన సంస్థ శాస్త్రవేత్త



నారాయణగూడ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదానం చేస్తున్న సీపీ సజ్జనార్

# సీపీ సజ్జనార్ రక్తదానం

- ఆయనబాటలోనే ఎస్సీఎస్సీ వాలంటీర్లు, పోలీసులు
- 117 యూనిట్ల రక్తదానం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** తలసేమియా, క్యాన్సర్, ఇతర వ్యాధిగ్రస్థుల కోసం సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఆదివారం రక్తదానం చేశారు. ఆయన స్ఫూర్తితో సొసైటీ ఫర్ సైబర్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ), సైబరాబాద్ పోలీస్ సిబ్బంది 117 యూనిట్ల రక్తందానం చేశారు. రక్తనిధి కేంద్రంలో రక్తం కొరత రాకుండా చూసేందుకు సీపీ సజ్జనార్ ఆధ్వర్యంలో ఎస్సీఎస్సీ వాలంటీర్లు, పోలీసులు నారాయణగూడలోని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సీపీ సజ్జనార్ మాట్లాడుతూ.. ఒక్కరు రక్తదానంచేస్తే.. ముగ్గురి జీవితాలను కాపాడినవారవుతారని అన్నారు. ఒకరి రక్తదానం ఆర్బీసీ, ప్లాస్మా, ప్లేట్‌లేట్స్ తక్కువ ఉన్నవారికి ఉపయోగపడుతుందని చెప్పారు. రక్తదాతలు ఎవరైనా సైబరాబాద్ కొవిడ్-19 కంట్రోల్ రూం నంబర్ 9490617440/431ను సంప్రదించి వారిపేర్లను నమోదుచేసుకొని పోలీసులే రవాణా సౌకర్యం కల్పిస్తారని తెలిపారు. రక్తదానం యూనిట్లను ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ అధికారి పిచ్చిరెడ్డికి అప్పగించారు. కార్యక్రమంలో ఎస్సీఎస్సీ ప్రధాన కార్యదర్శి కృష్ణ ఏదుల, పోలీసు ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

### సజ్జనార్ సేవలు అద్భుతం

- మంత్రి కేటీఆర్ ప్రశంస

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. సీపీ సజ్జనార్‌తో పాటు పోలీసులు, ఎస్సీఎస్సీ వలంటీర్లు తలసేమియా, క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల కోసం రక్తదానం చేయడాన్ని అద్భుతమైన సేవగా ప్రశంసించారు. రక్తదానానికి సంబంధించిన ఫొటోలను ఆదివారం ట్విట్టర్‌లో ట్యాగ్‌చేసి 'అపారమైన సేవ సజ్జనార్ గారు' అంటూ కేటీఆర్ మెచ్చుకున్నారు.

# గోసనిపిచ్చింది

- రెక్కల కష్టం రూ.25 వేలు దానం
- లాక్‌డౌన్‌తో తిండిలేనోళ్లకు వితరణ
- ఇండ్లల్ల బట్టలుతికి కూడబెట్టింది
- 70 ఏండ్ల వృద్ధురాలి దాతృత్వం

**జగిత్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ఆడకట్టుకున్నోళ్లంతా కూలీలే.. పనిచేస్తేనే ఆళ్ల కడుపులల్లకు పట్టెడన్నం పోయేది. లేకపోతే ఉపాసమే. లాక్‌డౌన్‌తో ఇంట్లకేని ఎవరూ బైటికెళ్తలేరు. కనీసం పిల్లలకు బువ్వపెట్టలేకపోతుండ్రు.. ఈ పరిస్థితిని చూసి ఓ నిరుపేద 70 ఏండ్ల వృద్ధురాలు చలించిపోయి నాలుగేండ్లుగా దాచిన రూ.25 వేలు దానంచేసింది.

జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన గొల్లపల్లి బుచ్చవ్వ, గంగారాం భార్యాభర్తలు. బుచ్చవ్వ రోజూ ఇండ్లల్ల బట్టలు ఉతుకగా, గంగారాం ఇస్త్రీ చేసిండు. ఇద్దరు కొడుకులు కులవృత్తి చేస్తుండగా, మూడోవాడు శ్రీనివాస్ హైదరాబాద్‌లో చార్టర్డ్ అకౌంటెంట్. లాక్‌డౌన్‌తో పనుల్లేక బుక్కెడు బువ్వ కడుపులకుపోని నిరుపేదలను చూసి బుచ్చవ్వ చలించిపోయింది. అలాంటోళ్లకు సాయంచేద్దామన్న ఆలోచనను భర్తకు చెప్పింది. నాలుగేండ్లుగా కులవృత్తి చేస్తూ కూడబెట్టిన రూ.25 వేలు దానంచేయాలని నిర్ణయించిండ్రు. తమ వార్డులో నిరుపేదలైన ఒక్కో కుటుంబానికి రూ.1500 చొప్పున ఈ నెల 8న మొత్తం 16 కుటుంబాలకు అందజేసిండ్రు. వయసు మీదపడటంతో గంగారాం ఇస్త్రీ దుకాణాన్ని కొడుక్కు అప్పగించి ఇంట్లోనే ఉంటున్నాడు. బుచ్చవ్వ మాత్రం ఇప్పటికీ ఐదిండ్లల్ల బట్టలు ఉతికి పైసలు ఎన్కేస్తున్నది. నిరుపేదలకు డబ్బులు దానంచేసి అందరికీ ఆదర్శంగా నిలిచింది.



నిరుపేద మహిళకు నగదు ఇస్తున్న బుచ్చవ్వ

### పైసలు నెత్తిల వెట్టుకొని పోతమా

బుద్ధి తెలిశినప్పటి సంది రెక్కల కష్టాన్నే నమ్ముకున్న. కరోనా అచ్చిందని, ఎవలూ ఇంట్లకెళ్లి బైటకు రావొద్దని కేసీఆర్ సార్ టీవీల జెప్పంగ ఇన్న. మా ఆడకట్టుల అందరు కూలి చేసుకునేటోళ్లే. పోరగాండ్లకు బువ్వ పెట్టనీకె గూడ తిప్పలు వడ్తుండ్రు. ఆళ్లని సూత్తె గోసనిపించింది. ఆళ్లకు ఏదోఒకటి చేయాలనిపిచ్చింది. మా పెద్దమనిషి కూడా ఏదన్నా శేద్దాం అన్నడు. మా శిన్నకొడుకు గూడ పట్నంల లచ్చ రూపాలు ఇచ్చిండట. 'మంచి పనిచేత్తున్నవు ఇయ్యి బుద్దయితే ఇయ్యి' అని మా శిన్న కొడుకు శెప్పిండు. గందుకే నాలుగేండ్ల సంది దాపెట్టిన పైసలను 16 ఇండ్లకు పంచినం. సంపాదించిన పైసలు నెత్తిల వెట్టుకొని పోతమా సార్. పోరగాండ్ల తిండికి మన పైసలు అక్కెరకు అచ్చినయంటే.. అంతకంటే సంబురం ఏముంటుంది సార్..

– బుచ్చవ్వ

# కిరాయి మాఫీ

- దాతృత్వాన్ని చాటిన హజ్రత్ బేగం
- నిరుపేద కుటుంబాలకు బాసట
- ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపునకు నిజామాబాద్ మహిళ స్పందన

**ఖలీల్‌వాడి:** ఇంట్లో కిరాయివాళ్లంతా రోజువారీ కూలీలే. పనులు చేస్తేనే వారి ఇంట పొయ్యివెలిగేది. రోజంతా పనులు చేస్తేనే పూటగడిచి కిరాయి కట్టుడు కష్టం. అలాంటిది లాక్‌డౌన్‌తో పనుల్లేకుండయినయి. ఇప్పుడు కడుపునింపుకునుడెట్లా.. కిరాయి కట్టుడెట్లా అని గుబులు పడుతున్నోళ్లకు నిజామాబాద్‌లోని ముస్లిం మహిళ బాసటగా నిలిచారు. కిరాయి ఇంట్లో ఉంటున్నవారి నుంచి కిరాయి తీసుకోవద్దని సీఎం కేసీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు కిరాయి మాఫీ చేశారు. లాక్‌డౌన్ ఉన్నంత కాలం కిరాయి తీసుకోబోనని స్పష్టంచేశారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోజా కాలనీకి చెందిన హజ్రత్ బేగం కరోనా లాక్‌డౌన్‌తో పనుల్లేక కష్టాలు పడుతున్న నిరుపేదలకు రూ.70 వేలకుపైగా ఇంటి కిరాయి మాఫీచేశారు. కాలనీలోనే ఉన్న మదర్సా భవనానికి సంబంధించిన పదేండ్ల కిరాయి రూ.5 లక్షలను రద్దుచేశారు. హజ్రత్ బేగంకు 18 రేకుల ఇండ్లు, రెండు భవనాల్లో ఏడు పోర్షన్లు ఉన్నాయి. వీటిని కిరాయికిచ్చారు. ఆ ఇండ్లలో ఉండేవాళ్లంతా రోజువారీ కూలీ పనిచేసేవారే. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆమె ప్రతి ఒక్కరికీ నిత్యావసర సరుకులు పంపిణీచేయాలని భావించారు. కానీ, అది సరిపోదనే భావనతో ఇంటి కిరాయిని మాఫీచేస్తే బాగుంటుందనే నిర్ణయించారు. ఇండ్లకు సంబంధించి ఒకనెల అద్దె రూ.70,800 రద్దు చేశారు. నిరుపేదలకు అండగా నిలిచారు. మదర్సా భవనానికి సంబంధించి నెలకు రూ.5 వేల చొప్పున పదేండ్ల అగ్రిమెంటు ఉన్నది. దీని ప్రకారం రూ.6 లక్షలు అవుతుంది. ఇందులో లక్ష రూపాయలు వివిధ మరమ్మతుల కోసం మదర్సా నిర్వాహకులు ఖర్చుచేశారు. మిగతా రూ.5 లక్షలను మాఫీ చేస్తున్నట్టు ఆమె ప్రకటించారు. హజ్రత్ బేగం 1999లో నిజామాబాద్ పట్టణంగా ఉన్న సమయంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. హజ్రత్ బేగం భర్త సివిల్ కాంట్రాక్టర్.



### లాక్‌డౌన్ రోజుల్లో కిరాయి తీసుకోను

కరోనా లాక్‌డౌన్ నేపథ్యంలో సీఎం కేసీఆర్ పిలుపుమేరకు ఈ నెల ఇంటి కిరాయిని తీసుకోలేదు. మా ఇండ్లలో కిరాయికి ఉండే ప్రతిఒక్కరూ కూలీపని చేసుకొనేవారే. నెలకు వచ్చే రూ.70,800తోపాటు మదర్సా పదేండ్ల కిరాయి రూ.5 లక్షలను మాఫీచేశాను. లాక్‌డౌన్ ఎప్పటివరకు పొడిగిస్తే అప్పటివరకు కిరాయి తీసుకోను.

–హజ్రత్ బేగం

# లాక్‌డౌన్ పొడిగింపు ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకుగాను రాష్ట్రంలో ఈ నెల 30 వరకు లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీచేసింది. ముందు జాగ్రత్త చర్యగా లాక్‌డౌన్‌ను పొడిగిస్తూ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించినట్టు సీఎం కేసీఆర్ శనివారం మీడియాకు వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ లాక్‌డౌన్‌ను ఈ నెల 14 నుంచి 30వ తేదీ వరకు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వులిచ్చారు. గతంలో లాక్‌డౌన్‌కు సంబంధించి జారీచేసిన నిబంధనలు, మార్గదర్శకాలన్నీ అమలులో ఉంటాయని పేర్కొన్నారు.

# మరో 28 పాజిటివ్ కేసులు

- ఇద్దరి మృతి.. ఏడుగురి డిశ్చార్జి
- చికిత్స పొందుతున్న 412 మంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఆదివారం కొత్తగా 28 పాజిటివ్ కేసులు నమోదుకాగా, ఇద్దరు మృతి చెందగా, ఏడుగురు డిశ్చార్జి అయ్యారని వైద్యారోగ్యశాఖ బులెటిన్ విడుదలచేసింది. రాష్ట్రంలో ఇప్పటివరకు 531 మందికి వైరస్ పాజిటివ్‌గా నిర్ధారణ కాగా, ఇందులో 103 మంది కోలుకుని డిశ్చార్జి అయ్యారు. 16మంది మరణించారు. ప్రస్తుతం 412 మంది ఆయా దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ పరిధిలోని బ్లడ్‌బ్యాంక్‌లకు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్ (ఐపీఎం) ద్వారా రక్తం యూనిట్లు అందించనున్నట్టు బులెటిన్ పేర్కొన్నది.

**ప్రజారోగ్యశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం మొత్తం కేసుల సంఖ్య**

| వివరాలు | ఆదివారం ఒక్కరోజు | ఇప్పటి వరకు మొత్తం |
|---|---|---|
| కొవిడ్-19 వైరస్ పాజిటివ్స్ | 28 | 531 |
| కోలుకున్న/డిశ్చార్జి అయినవారు | 7 | 103 |
| మరణాలు | 2 | 16 |
| చికిత్స పొందుతున్నవారు | -- | 412 |

# టీఆర్ఎస్ ఎన్నారై సామాజిక సేవ

## పెద్ద ఎత్తున నిత్యావసర వస్తువుల పంపిణీ

### మహేశ్ బిగాల పుట్టినరోజు సందర్భంగా వలస కూలీలు, అనాథ, వృద్ధాశ్రమాలకు చేయూత

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో మహేశ్ బిగాల జన్మదిన వేడుకలకు దూరంగా ఉన్నారు. వివిధ దేశాల్లో టీఆర్ఎస్ పార్టీకి ఎన్నారై శాఖల ఏర్పాటులో మహేశ్ బిగాల తీవ్రంగా కృషిచేస్తున్నారు. ప్రస్తుతం 40కిపైగా దేశాల్లో టీఆర్ఎస్ ఎన్నారై శాఖలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో టీఆర్ఎస్ ఎన్నారైశాఖ నాయకులు పలువురు ఆయన పుట్టినరోజు సందర్భంగా మల్కాజిగిరి మిర్జాల్‌గూడలోని సెయింట్ ఆంథోని రాబోర్ట్ వృద్ధాశ్రమం, ఘట్‌కేసర్ మండలం నారపల్లిలోని లహరి వృద్ధాశ్రమం, వనస్థలిపురంలోని వివేకానంద విద్యావిహార్ చిన్నపిల్లల అనాథాశ్రమం, ఐడీఏ బొల్లారం డిజైర్ సొసైటీ కేరింగ్ ఫర్ స్పెషల్ చిల్డ్రన్, గచ్చిబౌలి, హఫీజ్‌పేట్, హెచ్ఎంటీ స్వర్ణపురి కాలనీ, జంగడిగుళ్ల, మల్కారంలోని వలస కూలీల క్యాంపుల్లో బియ్యం, కందిపప్పు, వంటనూనె, రవ్వ, ఎండుమిర్చి వంటి నిత్యావసర వస్తువులను పంపిణీచేశారు. టీఆర్ఎస్ ఎన్నారై నాయకులు మాస్కు ధరించి, నిర్ణీత దూరం పాటిస్తూ ఈ సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. లాక్‌డౌన్ కారణంగా పనులు కోల్పోయిన జవహర్‌నగర్ ప్రాంతంలోని మల్కాపురం గ్రామం వద్ద ఉన్న భవన నిర్మాణ వలస కూలీలకు భోజన ఏర్పాటుచేశారు. వలస కూలీలకు ఒక్కొక్కరికీ 25 కిలోల బియ్యం, 2 కిలోల కందిపప్పు, కిలో నూనె, ఇతర సరుకులను వ్యక్తిగతంగా అందజేశారు. మియాపూర్ పరిసర ప్రాంతాల్లో దినసరి కూలీలు, మురికివాడల్లోని వారికి, యాచకులకు ఆహారం అందజేశారు. అల్వాల్ వేదపాఠశాలలోని విద్యార్థులకు కావాల్సిన బియ్యం, కందిపప్పు, వంటనూనె, రవ్వ ఇచ్చారు. ఐడీఏ బొల్లారంలోని డిజైర్ సొసైటీకి పిల్లల కోసం మందులు పంపిణీచేశారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులు తెలుసుకొని తమ వంతు సహకారాన్ని అందించి మానవత్వం చాటుకున్నారని టీఆర్ఎస్ ఎన్నారై నాయకులను మహేశ్ బిగాల అభినందించారు. వారికి ధన్యవాదాలు తెలిపారు. కరోనా వైరస్ కట్టడికి సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందిగా చర్యలు చేపట్టిందని కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలోని రాష్ట్ర ప్రజలందరూ సుభిక్షంగా ఉంటారని పేర్కొన్నారు.



టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల జన్మదినం సందర్భంగా నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఆయన అభిమానులు

# వైద్యసిబ్బందికి షిఫ్టులు

- పనిచేశాక ఐదురోజులు స్వీయ గృహనిర్బంధం
- భోజనం, రవాణాతోపాటు ఇతర సదుపాయాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా బాధితులకు సేవలందిస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది భద్రతపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వైద్యులు, సిబ్బందిని మూడు బ్యాచ్‌లుగా విభజించి షిఫ్టులవారీగా ఐదురోజులపాటు విధులు నిర్వర్తించేలా అవకాశం కల్పించారు. విధులు పూర్తిచేసుకున్నాక ఐదురోజులపాటు ప్రత్యేక కేంద్రాల్లో ఉండేలా ఏర్పాటుచేశారు. ఒకవేళ ఇంటికెళ్లినా ఐదురోజులపాటు క్వారంటైన్‌లో ఉండాల్సిందే. ఆ తర్వాతి రోజునుంచి ఐదురోజులపాటు మళ్లీ విధులకు రావాల్సి ఉంటుంది. వైద్య సిబ్బందికి కరోనా వైరస్ సోకే అవకాశం ఉన్నందున.. వారిద్వారా కుటుంబసభ్యులకు లేదా చుట్టుపక్కలవారికి వ్యాధి అంటుకోకుండా ఈ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విధులు ముగించుకొని ఇంటికెళ్లే ముందు వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులు పరిశీలిస్తారు. వీరికి షిఫ్టులవారీగా దవాఖానకు వచ్చేందుకు 20 మార్గాల్లో వివిధ ప్రాంతాలనుంచి బస్సులు నడుపుతున్నారు. విధులు నిర్వర్తించేవారికి, ప్రత్యేక కేంద్రాల్లో క్వారంటైన్‌లో ఉన్నవారికి మూడు పూటలా బలమైన ఆహారం అందిస్తున్నారు.

అది స్వాభిమాని, అత్యంత అహంభావి
అతిపెద్ద ఇగోయిస్టు
మనకైమనం పిలిస్తేనేగాని దానికదేరాదు
ముడితేనే అంటుకుంటుంది
తాకితేనే తగులుకుంటుంది
- ఎల్ శ్రీనాథ్



## దవాఖాన నుంచి బోరిస్ డిశ్చార్జి

**లండన్:** కరోనా మహమ్మారిబారిన పడి దవాఖానలో చేరిన బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ ఆదివారం డిశ్చార్జి అయ్యారు. తాను కోలుకోవడంలో విశేష కృషి చేసిన వైద్య సిబ్బందికి జీవితాంతం రుణపడి ఉంటానని కృతజ్ఞతలు తెలిపారు. 'కేవలం వారికి ధన్యవాదాలు మాత్రమే చెప్పను. నా జీవితాంతం వారికి రుణపడి ఉంటాను' అని లండన్‌లోని సెయింట్ థామస్ దవాఖాన సిబ్బందిని ఉద్దేశించి బోరిస్ చెప్పినట్టు ఆయన కార్యాలయం తెలిపింది.

## గ్రామీణ భారతం సిద్ధంగా లేదు

### ఎమ్మెస్ స్వామినాథన్

**న్యూఢిల్లీ:** కరోనా కారణంగా నెల కొన్న ఆర్థిక ప్రతిష్టంభన సవాళ్లను ఎదుర్కోవడానికి గ్రామీణ భారతం ప్రస్తుతానికి సిద్ధంగా లేదని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎమ్మెస్ స్వామినాథన్ పేర్కొన్నారు. సంస్థాగత మౌలిక సదుపాయాల్ని గ్రామాలకు తరలించి, సాంకేతిక సాయాన్ని అందిస్తే పరిస్థితి మెరుగు పడుతుందన్నారు.

## 23 మంది పాక్ సైనికులు, ఉగ్రవాదులు హతం

**జమ్ము:** పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై శుక్రవారం భారత సైన్యం జరిపిన దాడిలో పాకిస్థాన్‌కు చెందిన 15 మంది సైనికులు, 8 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. జమ్ముకశ్మీర్‌లోని కీరన్ సెక్టార్ వద్ద కిషన్‌గంగా నది ఒడ్డున ఉన్న దుధ్‌నియాల్ లక్ష్యంగా దాడి చేశామని భారత సైన్యం ప్రతినిధి తెలిపారు. ఆదివారం కీరన్ సెక్టార్ పరిధిలో పాక్ జరిపిన కాల్పుల్లో ముగ్గురు పౌరులు మరణించారు.

# ఈ కార్డుంటేనే బయటికి

- ఇమ్యూనిటీ కార్డుల జారీకి జర్మనీ, బ్రిటన్ సమాయత్తం
- కరోనా వైరస్ నేపథ్యంలో ప్రత్యామ్నాయ చర్యలు
- ప్రజలకు విస్తృతంగా యాంటీబాడీ పరీక్షలు
- కరోనాను తట్టుకునే సామర్థ్యం ఉన్నవారికే కార్డు



న్యూయార్క్‌లో కరోనా బాధితుడి నుంచి నమూనా సేకరిస్తున్న సిబ్బంది

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కరోనా మహమ్మారితో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతున్నది. వ్యాపార, వాణిజ్య కార్యకలపాలు స్తంభించిపోయాయి. రోజులు, వారాలు, నెలలు గడుస్తున్నా ఉద్యోగులు గడప దాటలేని పరిస్థితి. వైరస్ పీడ ఎప్పుడు విరగడవుతుందో తెలియదు. ఈ నేపథ్యంలో పలు దేశాలు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాయి. వైరస్ కల్లోలాన్ని ఎదుర్కొంటూనే, ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టే మార్గాలపై దృష్టిసారించాయి. ఈ మథనం నుంచే పుట్టిన ఆలోచనే ఇమ్యూనిటీ కార్డ్స్. ఇప్పుడు దీనిపై అభివృద్ధి చెందిన దేశాల్లో విస్తృత చర్చ నడుస్తున్నది. అర్హులకు వీటిని జారీచేసి జనజీవనాన్ని పట్టాలెక్కించాలని ఆయా దేశాలు ప్రయత్నాలు చేస్తున్నాయి. చైనాలో ఇప్పటికే యాప్ రూపంలో ఈ విధానం అమల్లో ఉండగా.. జర్మనీ, బ్రిటన్ ఇమ్యూనిటీ కార్డుల విధానం వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఇక అగ్రరాజ్యం అమెరికా కూడా ఈ కార్డులను ప్రవేశపెట్టేందుకు తీవ్రంగా యోచిస్తున్నది.

**ఏమిటీ ఇమ్యూనిటీ కార్డ్స్..?**

కరోనా బారినపడి ప్రస్తుతం కోలుకున్న వారికి సాధారణంగా ఆ వైరస్‌ను తట్టుకునే ఇమ్యూనిటీ (నిరోధక శక్తి) ఉన్నట్లే. వైరస్ సోకని వారిలో కరోనాను ఎదుర్కొనే సామర్థ్యం ఉన్నవారిని యాంటీ బాడీ టెస్ట్‌ల ఆధారంగా గుర్తిస్తారు. ఐజీఎం ఉన్న వారికి రోగ నిరోధక శక్తి తక్కువగా ఉండి, వైరస్‌బారిన పడే అవకాశం ఉంటుంది. ఐజీజీ యాంటీ బాడీస్ ఉన్నవారు వైరస్‌ను ఎదుర్కొనగలరు. ఇలాంటి వారికి ఇమ్యూనిటీ కార్డులను జారీచేస్తారు. వీటినే కొన్ని దేశాల్లో ఇమ్యూనిటీ పాస్‌పోర్టులు అని కూడా పిలుస్తున్నారు. వైరస్‌ను ఎదుర్కొనే శక్తి ఉన్నవారికి ఇతర అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ బయట తిరిగే అవకాశం కల్పిస్తారు. అంటే వీరు ఉద్యోగాలకు తిరిగి వెళ్లొచ్చన్న మాట. చైనాలోనూ ఇలాంటి గుర్తింపు విధానం అమల్లో ఉంది. బ్రిటన్, జర్మనీ కూడా ఈ విషయంలో ఇప్పటికే పరిశోధనలు పూర్తిచేశాయి. పెద్ద ఎత్తున యాంటీ బాడీ పరీక్షలు నిర్వహిస్తున్నాయి. ఇమ్యూనిటీ కార్డుల జారీకి సిద్ధంగా ఉన్నాయి. అయితే ఈ కార్డుల ప్రతిపాదనపై విమర్శలు కూడా ఉన్నాయి. ఇమ్యూనిటీ నిర్ధారణ సమస్యలతోపాటు కార్డుల పంపిణీలో మోసాలు జరిగే అవకాశం ఉందని చెబుతున్నారు.

# సీడీఎఫ్‌డీలోనూ కరోనా పరీక్షలు

- సీసీఎంబీలో వెయ్యి పూర్తి

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** బయోటెక్నాలజీ పరిశోధనా సంస్థ సెంటర్ ఫర్ డీఎన్‌ఏ, ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్ (సీడీఎఫ్‌డీ)లోనూ సీసీఎంబీ తరహాలో కొవిడ్-19 వైరస్ నిర్ధారణ పరీక్షలు నిర్వంచనున్నారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్(ఐసీఎంఆర్)కు ఇప్పటికే అనుమతి లభించింది. ఐసీఎంఆర్ నుంచి టెస్టింగ్ కిట్లు అందగానే వ్యాధి నిర్ధారణ పరీక్షలను యుద్ధప్రాతిపదికన చేపట్టడానికి సీడీఎఫ్‌డీ సన్నాహాలు చేసుకుంటున్నది. సీసీఎంబీ, సీడీఎఫ్‌డీ పరస్పర సహకారంతో పరీక్షలు చేయనున్నాయి. సీడీఎఫ్‌డీ శాస్త్రవేత్తలు సీసీఎంబీలో పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. రెండ్రోజుల్లో సీడీఎఫ్‌డీ పరీక్షలు చేయనున్నది. సీసీఎంబీ కరోనా పరీక్షలను వేగంగా నిర్వహిస్తున్నది. గాంధీ, ఉస్మానియా దవాఖానల నుంచి వస్తున్న శాంపిళ్లను సీసీఎంబీలో ఉన్న 12 రియల్ టైమ్ పీసీఆర్‌ల ద్వారా పరీక్షిస్తున్నారు. రోజుకు వంద శాంపిళ్లను పరీక్షిస్తున్నామని, ఆదివారంనాటికి వెయ్యి పూర్తిచేసినట్టు సీసీఎంబీ డైరెక్టర్ రాకేశ్ మిశ్రా తెలిపారు.

# వైద్యుల రక్షణకు ఏరోసోల్ బాక్సులు

- టీ వర్క్స్ రూపకల్పన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొవిడ్-19 బాధితులకు చికిత్సచేసే వైద్యుల రక్షణ కోసం టీ వర్క్స్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏరోసోల్ బాక్సులు తయారుచేశారు. రోగి నుంచి డాక్టర్లకు, వైద్య సిబ్బందికి వైరస్ సోకకుండా ఈ బాక్స్ రక్షణగా నిలుస్తుంది. ఈ బాక్స్ డిజైన్.. తైవాన్‌కు చెందిన డాక్టర్ లాయి హస్సేన్‌యంగ్ తయారుచేసిన మోడల్‌ను పోలి ఉంటుంది. ఇప్పటికే రూపొందించిన 40 బాక్సులను వివిధ దవాఖానలకు సరఫరా చేశారు. మంచి డిమాండ్ ఉండటంతో మరో 100 బాక్సులను తయారుచేస్తున్నారు. హైదరాబాద్.. కటింగ్ ఎడ్జ్ ప్రొడక్ట్ తయారీ, అభివృద్ధిలో హబ్‌గా మారుతుందని టీ వర్క్స్ సీఈవో సుజయ్ కారంపూరి తెలిపారు.



కరోనా బాధితుడికి ఏరోసోల్ బాక్సు పెట్టి చికిత్స అందిస్తున్న వైద్యుడు

## కూలీలు దొరుకక రైతు ఆత్మహత్య

**బండా (యూపీ):** లాక్‌డౌన్ నేపథ్యంలో కూలీలు దొరుకకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లోని బండా జిల్లా జారి గ్రామానికి చెందిన రైతు రాంభవన్ శుక్లా(52) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన తన గోధుమ పంట నూర్పిడి చేయడానికి కూలీల కోసం కొన్నాళ్లుగా వెతుకుతున్నాడని పోలీసులు చెప్పారు.

## భారతీయులను పంపిస్తాం

**దుబాయి:** తమ దేశంలో చిక్కుకుపోయిన భారతీయులు, ఇతర దేశాల పౌరులకు కరోనా పరీక్షల్లో నెగెటివ్ వస్తే స్వదేశాలకు పంపేస్తామని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) తెలిపింది. ఈ మేరకు అన్ని దేశాల రాయబార కార్యాలయాలకు సమాచారం అందించింది.

# ట్రంప్ ఒంటెత్తు పోకడ

- కరోనా గురించి నిఘా వర్గాలు హెచ్చరించినా పట్టించుకోలేదు
- న్యూయార్క్ టైమ్స్



**న్యూయార్క్:** అమెరికాలో కరోనా విజృంభనకు ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్ ఒంటెత్తు పోకడలే కారణమని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. వైరస్ గురించి ఇంటెలిజెన్స్, జాతీయ దర్యాప్తు సంస్థ, ఆరోగ్య శాఖ అధికారులు పలుమార్లు హెచ్చరించినా ట్రంప్ పెడచెవినపెట్టారని వెల్లడించింది. వైరస్ తీవ్రత గురించి ప్రజలకు తెలియజేయడంలో, దీని వ్యాప్తికి అడ్డుకట్ట వేయడంలో ట్రంప్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని పేర్కొంది. ఈ మేరకు దర్యాప్తు నివేదికను న్యూయార్క్ టైమ్స్ ప్రచురించింది. 'కరోనా చాలా ప్రమాదకరమైనది. దీనికి అడ్డుకట్ట వేయకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి ఇప్పటి నుంచే (జనవరి ప్రారంభంలో) మనం అప్రమత్తం కావాలి. ప్రజలనూ అప్రమత్తం చేయాలి' అని నిఘా వర్గాలు, ఉన్నతాధికారులు హెచ్చరించినా ట్రంప్ పట్టించుకోలేదని వెల్లడించింది. మరోవైపు, అమెరికాకు భారత్ పంపిన హైడ్రాక్సీ క్లోరోక్విన్ మందులు శనివారం సాయంత్రం న్యూజెర్సీలోని నెవార్క్ విమానాశ్రయానికి చేరినట్లు అక్కడి భారత రాయబారి తరణ్‌జిత్‌సింగ్ సంధూ తెలిపారు.

## కరోనా కట్టడికి ఆన్‌లైన్ లగ్గం

**దుబాయి:** కొవిడ్-19 వ్యాప్తి నిరోధంలో భాగంగా వివాహాల నిర్వహణపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) కీలక నిర్ణయం తీసుకున్నది. ఆన్‌లైన్ పెండ్లి సేవలను ప్రారంభించింది. స్థానికులు పెండ్లికి తేదీని నిర్ణయించుకొంటే.. వీడియో లింక్ ద్వారా చర్చి పెద్ద సమక్షంలో ఆన్‌లైన్‌లో వివాహ వేడుకను నిర్వహిస్తారని ఆ దేశ న్యాయశాఖ మంత్రి ఆదివారం వెల్లడించారు. ఇందు కోసం పేపర్ ప్రక్రియను ఆన్‌లైన్‌లో ముందే పూర్తిచేయాల్సి ఉంటుందని చెప్పారు. వధూవరులు, సాక్షుల గుర్తింపును చర్చి పెద్ద ధ్రువీకరిస్తారని తెలిపారు. ఆపై వివాహ ధ్రువపత్రాన్ని ప్రత్యేక కోర్టులో సమర్పిస్తారని పేర్కొన్నారు.

# వలస కార్మికులకు భరోసా

- సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రాలకు కేంద్రం సూచన
- ముందే పకడ్బందీ చర్యలు తీసుకున్న తెలంగాణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ కారణంగా వివిధ రాష్ట్రాల్లో ఉన్న వలస కార్మికుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ.. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆదివారం పలు మార్గదర్శకాలు విడుదలచేసింది. వలస కార్మికుల సంక్షేమానికి సుప్రీంకోర్టు పలు ఆదేశాలిచ్చిన నేపథ్యంలో వాటిని పాటించడంతోపాటు ఆందోళనలో ఉన్న కార్మికులకు భరోసా ఇచ్చేలా వ్యవహరించాలని పేర్కొన్నది. దేశవ్యాప్తంగా ఉన్న షెల్టర్ హోమ్స్, కార్మిక శిబిరాలు, ఉపశమన కేంద్రాల్లో వైద్యం, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని పేర్కొన్నది.

**3.35 లక్షల వలసకార్మికుల గుర్తింపు**

వలస కార్మికుల విషయంలో కేంద్రం ఎలాంటి మార్గదర్శకాలు జారీచేయకముందే రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకున్నది. ఆయా జిల్లాల్లో వివిధ పనుల కోసం వచ్చి ఇక్కడే ఉండిపోయిన 3.35 లక్షల మంది కార్మికులను గుర్తించి, వారికి షెల్టర్ హోమ్స్, ఇతర సౌకర్యాలు ఏర్పాటుచేసింది. వలస కార్మికులకు 12 కిలోల బియ్యం లేదా గోధుమ పిండి అందజేయాలని నిర్ణయించి అమలుచేస్తున్నది. ఎలాంటి బ్యాంకు ఖాతాలు, ఆధారాలు లేకున్నా వలస కార్మికుల చేతికే రూ.500 ఇస్తున్నది. కొన్నిచోట్ల నేరుగా భోజనం సదుపాయం కల్పించింది.

## కానిస్టేబుల్ వైద్యానికి చర్యలు

- రాంచంద్రయ్య త్వరగా కోలుకోవాలని డీజీపీ ఆకాంక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌ను ఉల్లంఘించిన వ్యక్తిని పట్టుకొనే క్రమంలో శనివారం ఉదయం బహదూర్‌పల్లి చౌరస్తాలో గాయపడిన దుండిగల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ రాంచంద్రయ్య త్వరగా కోలుకోవాలని డీజీపీ మహేందర్‌రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. కానిస్టేబుల్ వైద్యానికి అన్ని చర్యలు తీసుకొంటున్నామని, ఈ ఆపత్కాలంలో ఆయన కుటుంబానికి అండగా ఉంటామని డీజీపీ తెలిపారు.



జర్నలిస్టులకు నిత్యావసరాలు పంపిణీచేస్తున్న తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్

## జర్నలిస్టులూ! ఆరోగ్యం జాగ్రత్త

- మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌లోనూ విధులు నిర్వర్తిస్తున్న జర్నలిస్టులు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ సూచించారు. ఇలాంటి ఆపత్కాలంలో జర్నలిస్టుల సేవలు వెలకట్టలేనివన్నారు. ఆదివారం మాసబ్‌ట్యాంక్‌లోని సమాచారభవన్‌లో 1,200 మంది జర్నలిస్టులు, ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు, స్ట్రింగర్లు, పార్ట్‌టైమర్లకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ.. వేతనాలు లేని జర్నలిస్టుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి నిత్యావసరాలను అందజేస్తున్నామన్నారు. ఆందోల్ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ మాట్లాడుతూ.. జర్నలిస్టులు నిర్ణీత దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని సూచించారు. కార్యక్రమంలో మీడియా అకాడమీ కార్యదర్శి విజయ్‌గోపాల్, మేనేజర్ లక్ష్మణ్, టీయూడబ్ల్యూజే ప్రధానకార్యదర్శి మారుతీసాగర్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు పాతబస్తీలో అసెంబ్లీలో ఎంఐఎం పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు నిత్యావసరాలు అందజేశారు.

## సాయమందలేదా.. అధికారులను కలువండి

- సంచారజాతులకు ఎంబీసీ కార్పొరేషన్ సీఈవో సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ నేపథ్యంలో ప్రభుత్వం ప్రజలకు తగిన సాయం అందిస్తున్నదని, సంచారజాతులవారు తమకు సాయం అందకుంటే జిల్లా బీసీ అభివృద్ధి అధికారులను సంప్రదించాలని ఎంబీసీ కార్పొరేషన్ సీఈవో అలోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రభుత్వం రేషన్‌కార్డులున్న కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి 12 కిలోల బియ్యం, రూ.1,500 ఆర్థికసాయం అందిస్తున్నదని చెప్పారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్ కారణంగా హైదరాబాద్‌లో వేలమంది ఆటోడ్రైవర్ల బతుకులు రోడ్డునపడ్డాయని, ప్రభుత్వం వారిని ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి కోరారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐటీయూసీ ఆటో డ్రైవర్స్-వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 200 మంది ఆటోడ్రైవర్ల కుటుంబాలకు ఉచితంగా బియ్యం, నిత్యావసర సరుకులు, కూరగాయలను చాడ పంపిణీ చేశారు. ఆటో కార్మికులకు ఆరునెలల వరకు నెలకు రూ.500 ఆర్థికసాయాన్ని అందించాలన్నారు.

# క్లిక్ చేస్తే ఖల్లాస్!

- లింక్‌లతో వలవేస్తున్న సైబర్ చీటర్స్
- బ్యాంకు ఖాతాలు ఊడ్చేస్తున్న నేరగాళ్లు

లాక్‌డౌన్ నేపథ్యంలో ఇంటర్నెట్ మీద ఆధారపడి లావాదేవీలు సాగిస్తున్న వారిని, కరోనా సమాచారం కోసం వెతికేవారిని, సహాయం కోసం ఎదురు చూసేవారిని టార్గెట్‌గా చేసుకొని సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. నకిలీ యాప్‌లు, అప్లికేషన్లు సృష్టించి, ఈ మెయిల్స్, ఎస్సెమ్మెస్‌ల రూపంలో లింక్‌లు పంపించి, అమాయకుల ఖాతాలను కొల్లగొడుతున్నారు. కాబట్టి, సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

– హైదరాబాద్, నమస్తే తెలంగాణ




### ఆ లింక్‌లు క్లిక్‌చేస్తే ఊడ్చేస్తారు

కరోనా కారణంగా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారి అకౌంట్లలో ప్రధాని, ముఖ్యమంత్రి డబ్బులు జమ చేస్తారంటూ ఈ మెయిల్స్, ఎస్సెమ్మెస్‌ల ద్వారా వచ్చే లింక్‌లను అసలు నమ్మకండి. వీటిని క్లిక్‌చేస్తే.. మీ ఫోన్‌లోని సమాచారం అంతా హ్యాకర్ల చేతిలోకి వెళ్తుంది. బ్యాంక్‌ల్లో ఉన్న మీ డబ్బును ఊడ్చేస్తారు.

### ఈఎంఐ మారటోరియం పేరుతో టోకరా

ఈఎంఐలకు మూడు నెలల మారటోరియం విధిస్తున్నట్టు రిజర్వ్‌బ్యాంక్ ప్రకటించిన నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తులు వేస్తున్నారు. తాము బ్యాంక్ అధికారులమని.. మీకు ఈఎంఐ మారటోరియం వర్తించాలంటే.. మీరు వెరిఫికేషన్ చేసుకోవాలంటూ ఎవరైనా ఫోన్‌కాల్ చేసినా, ఈమెయిల్స్ ద్వారా లింక్‌లు పంపినా నమ్మకండి. వాటిని ఓపెన్‌చేస్తే మన డాటా హ్యాకర్ల చేతిలోకి వెళ్తుంది.

### ఆన్‌లైన్ ఆర్డర్స్‌తో జాగ్రత్త

ఆన్‌లైన్లో ఆర్డర్ చేస్తే ఇంటికే కూరగాయలు, సరుకులు, మందులు, మద్యంసరఫరా చేస్తామని ఫోన్లు చేస్తూ సైబర్ నేరగాళ్లు మన వివరాలు తెలుసుకొంటున్నారు. డబ్బును ముందుగానే ఆన్‌లైన్‌లో పంపాలని కోరుతున్నారు. ఇలాంటి కాల్స్‌ను నమ్మకండి. ముందుగానే వారి అకౌంట్లకు డబ్బు పంపకపోవడం మంచిది.

### కరోనా ట్రాకింగ్ యాప్స్‌తో జాగ్రత్త



'మీ ప్రాంతంలో లేదా మీ చుట్టూ ఉన్న కరోనా పాజిటివ్ కేసుల వివరాలు తెలుసుకోండి' అంటూ సైబర్ నేరగాళ్లు గాలం వేస్తున్నారు. ఇలాంటి వెబ్‌సైట్లు, ట్రాకింగ్ యాప్స్ జోలికి వెళ్లకండి. వీటిని ఓపెన్ చేశారో.. మీ లైవ్ లొకేషన్, వివరాలన్నీ సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కుతాయి. కరోనా ట్రాకింగ్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేయడానికి ప్రయత్నించేటప్పుడే.. మీ ఫోన్‌లోకి వైరస్ జొరబడుతుంది. దీంతో ఫోన్‌లో భద్రపరిచిన సమస్త సమాచారం హ్యాకర్లకు చేరుతుంది. ఇలాంటి యాప్స్ జోలికి వెళ్లకుండా పత్రికలు, టీవీల ద్వారా ప్రభుత్వం వెల్లడిస్తున్న అధికారిక సమాచారాన్నే విశ్వసించాలి.

### ఆ కాల్స్‌ను పట్టించుకోవద్దు

'మీ గూగుల్ పే, ఫోన్‌పే అకౌంట్లు రద్దు కాబోతున్నాయి. వాటిని అప్‌డేట్ చేసుకోండి. ఫాంలో వివరాలు నమోదు చేయండి' అంటూ వచ్చే ఫోన్‌కాల్స్‌ను, లింక్‌లను పట్టించుకోకండి. వీటిని ఓపెన్‌చేసి, యూపీఐ పిన్, ఇతర వివరాలు నమోదుచేసి.. వారిచ్చే సూచనలు పాటించారో మీ అకౌంట్ ఖాళీ అయిపోతుంది. బ్యాంకుల అంతర్గత ఇబ్బందుల కారణంగా కొద్దిసేపు ఇలాంటి అప్లికేషన్స్ పనిచేయకపోయినా ఆందోళన పడొద్దు. గూగుల్‌లో కస్టమర్ కేర్ నంబర్లు సేకరించి, వాటికి కాల్‌చేసి, సైబర్ నేరగాళ్లబారిన పడొద్దు. యూపీఐ అప్లికేషన్లకు కస్టమర్‌కేర్ సేవలుండవు.

### దవాఖానల డాటాపై రాన్‌సంవేర్ల దాడులు



సైబర్ నేరగాళ్లు దవాఖానలను, వైద్య సిబ్బందిని కూడా వదిలిపెట్టడంలేదు. కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలంటూ పలురకాల ఫిషింగ్ ఈ మెయిల్స్‌ను పంపుతున్నారు. వీటిని ఓపెన్‌చేయగానే మీ కంప్యూటర్‌లోకి రాన్‌సంవేర్లతో వైరస్ చేరుతుంది. సమాచారం అంతా ఎన్‌క్రిప్ట్ అవుతుంది. పోగొట్టు కొన్న డేటాను తిరిగి ఇవ్వాలంటే తమకు డబ్బు ఇవ్వాలని సైబర్ నేరగాళ్లు బ్లాక్‌మెయిల్‌కు దిగుతున్నారు.

### అప్రమత్తంగా ఉండాలి



లాక్‌డౌన్ సమయంలో ఇంటర్నెట్ వాడకం పెరిగింది. ఆన్‌లైన్ మోసాలూ అధికమయ్యాయి. తెలంగాణలోనూ గత రెండు నెలలుగా సైబర్ నేరాలు 30శాతం వరకు పెరిగాయి. తెలియని నంబర్లు, వ్యక్తుల నుంచి వచ్చే ఎస్సెమ్మెస్‌లు, ఈ-మెయిల్స్‌ను వీలైనంత వరకు పట్టించుకోకపోవడం ఉత్తమం. కరోనాకు సంబంధించిన సమాచారం కోసం యాప్స్ మీద ఆధారపడవద్దు. సైబర్ నేరగాళ్లు పొంచి ఉన్నారన్న విషయం మరువకూడదు.

**-నల్లమోతు శ్రీధర్, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు**

## సైబర్‌దోస్త్‌తో మోసాలకు చెక్

- సైబర్‌నేరాలపై అవగాహన కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశవ్యాప్తంగా సైబర్ మోసాలపై కేంద్ర ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పిస్తున్నది. సైబర్ నేరగాళ్లు కొత్త తరహాలో ఏయే రకాల నేరాలకు పాల్పడుతున్నారు.. వారి ట్రాప్‌లో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కేంద్ర హోం శాఖ 'సైబర్‌దోస్త్' అనే ట్విట్టర్ ఖాతాలో ప్రతిరోజూ పోస్టులు పెడుతున్నది. ఇంటినుంచే కార్యాలయాల పనులు నిర్వర్తించేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం సూచనలుచేసింది. ఆన్‌లైన్‌లో కూడా సైబర్‌నేరాలపై ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. పూర్తి వివరాలకు https://cybercrime.gov.in ను చూడాలని కేంద్రం సూచించింది.

## లోకాయుక్త కేసుల విచారణ వాయిదా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 30 వరకు లాక్‌డౌన్ పొడిగించినందున లోకాయుక్తలో ఉన్న కేసులపై అప్పటివరకు ఎలాంటి విచారణ జరుపబోమని లోకాయుక్త రిజిస్ట్రార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధితశాఖల అధికారులు, కక్షిదారులు రావాల్సిన అవసరం లేదని, విచారణ తేదీలను తర్వాత వెల్లడిస్తామని పేర్కొన్నారు. ఫిర్యాదులను పోస్టు ద్వారా పంపవచ్చని తెలిపారు. నిర్దేశిత సిబ్బంది మినహా మిగతా ఉద్యోగులు 30 వరకు విధులకు హాజరుకావాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు.

# విపత్తు చట్టం ధిక్కరిస్తే జైలుకే..

- లాక్‌డౌన్ నేపథ్యంలో కఠిన చర్యలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దేశంలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకొంటున్నాయి. లాక్‌డౌన్ పటిష్ఠ అమలుతో రాష్ట్రంలో కేసులు తగ్గుతున్నాయి. ప్రజల ఆరోగ్యాలు కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకొంటున్నా.. కొన్నిప్రాంతాల్లో ఆదేశాలను ఉల్లంఘిస్తున్నారు. ప్రభుత్వం చెప్పేది తమకు కాదన్నట్టుగా వ్యవహరిస్తూ ముప్పు మరింత పెరిగేలా చేస్తుండటంతో కేంద్ర ప్రభుత్వ విపత్తు నిర్వహణ చట్టం- 2005ను అమలులోకి తీసుకొచ్చారు. ఈ చట్టంలో ప్రధానంగా సెక్షన్ 51 నుంచి సెక్షన్ 60 వరకు వివిధ నేరాలు, వాటి శిక్షలను నిర్వచించారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకొంటున్న నేపథ్యంలో ఈ చట్టంలోని సెక్షన్లు, శిక్షల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది.

**సెక్షన్ 51:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించిన నిబంధనలను సరైన కారణం లేకుండా అతిక్రమించేవారికి ఏడాది జైలుశిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. నిర్లక్ష్యం కారణంగా ఎవరైనా ప్రాణాలు కోల్పోయినా, ఆపద వాటిల్లే పరిస్థితి ఉత్పన్నమైనా సదరు వ్యక్తికి రెండేండ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉన్నది.

**సెక్షన్ 52:** ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి అధికారుల నుంచి ఏదైనా సాయం పొందినా, ఏవైనా పనులు చేయించుకున్నా వారికి రెండేండ్ల వరకు జైలుశిక్ష విధించే అవకాశం ఉంది. కొన్నిసార్లు జరిమానా, జైలుశిక్ష రెండూ విధించవచ్చు.

**సెక్షన్ 53:** విపత్తును అరికట్టేందుకు ఉపయోగించే వస్తువులు లేదా నగదును ఎవరైనా దుర్వినియోగం చేసినా, లేదా పారబోసినా అలాంటి వ్యక్తులకు రెండేండ్ల వరకు జైలుశిక్ష లేదా జరిమానా లేదా రెండూ విధిస్తారు.

**సెక్షన్ 54:** ప్రజలను గందరగోళపరిచేలా, ఆందోళన కలిగించేలా తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసేవారికి గరిష్ఠంగా రెండేండ్ల వరకు జైలు, జరిమానా లేదా రెండూ శిక్షలు విధిస్తారు.

**సెక్షన్ 55:** ప్రభుత్వ అధికారి/ ఏదైనా విభాగం ఈ చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలకు ఆదేశించవచ్చు. తనకు తెలియకుండానే ఆ తప్పు జరిగినట్టు నిరూపించే ఆధారాలు సమర్పిస్తే విచారణ నుంచి మినహాయింపు ఉంటుంది.

**సెక్షన్ 56:** విధినిర్వహణలో విఫలమైనా, అనుమతి లేకుండా విధుల నుంచి తప్పుకొన్నా, ఈ చట్టం కింద ప్రభుత్వం అప్పగించిన బాధ్యతల అమలులో విఫలమైనా, లేదా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా విధుల నుంచి వైదొలగినా గరిష్ఠంగా ఏడాది వరకు జైలు, జరిమానా విధించే అవకాశం ఉన్నది.

**సెక్షన్ 57, 58:** విపత్తు నిర్వహణ చట్టం-2005 నిబంధనలను ఏదైనా కంపెనీ లేదా కార్పొరేట్ బాడీ ఉల్లంఘించినట్టు నిరూపితమైతే ఆ కంపెనీ డైరెక్టర్, మేనేజర్, ఆ సమయంలో విధుల్లో ఉన్న సిబ్బందికి ఏడాది జైలుశిక్ష, జరిమానా విధిస్తారు.

**సెక్షన్ 59:** సెక్షన్ 55, 56ల కింద నమోదైన కేసుల ప్రాసిక్యూషన్‌కు వినియోగిస్తారు.

**సెక్షన్ 60:** ఈ చట్టం పరిధిలోని అంశాల్లో కోర్టులు నేరుగా కలుగజేసుకునే అవకాశం ఉండదు.

# ఒక్కరోజే 909 కేసులు



## కారు ఆపితే.. చేయి నరికారు

- పంజాబ్‌లో పోలీసుపై దాడి

**చండీగఢ్:** లాక్‌డౌన్ పక్కాగా అమలుచేస్తున్న పంజాబ్‌లో పోలీసులపై దుండగులు దాడిచేశారు. నిబంధనలు పక్కాగా పాటించాలని చెప్తున్న పోలీసులపై కత్తులతో దాడి చేసి తమ కారు ఆపిన ఏఎస్‌ఐ హర్జీత్‌సింగ్ అనే అధికారి చేయి నరికారు. ఈ ఘటన ఆదివారం పంజాబ్‌లోని పాటియాలలో జరిగింది. ఘటన తర్వాత పారిపోయి ఓ గురుద్వారాలో దాక్కున్న ఏడుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. చేయి తెగిన ఏఎస్‌ఐని పోలీసులు సమీప దవాఖానలో చేర్చారు. వైద్యులు ఏడు గంటలపాటు శ్రమించి హర్జీత్‌సింగ్‌కు చేయిని అతికించగలిగారు.

## వైద్య బృందంపై దాడి

**జమ్ము:** జమ్ముకశ్మీర్‌లోని బుద్గాం జిల్లా వథోరాలో కరోనా వైరస్ స్క్రీనింగ్ పరీక్షలకు వెళ్లిన ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బందిపై స్థానికులు దాడి చేసి, ఓ ఇంట్లో నిర్బంధించారు. వారిని రక్షించేందుకు వెళ్లిన పోలీసులపైనా రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో పలువురిపై కేసు నమోదు చేశామని అధికారులు తెలిపారు. దాడిలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారన్నారు.

- 8,356కి చేరిన బాధితులు
- ఆదివారం 34 మంది మృతి
- 275కు పెరిగిన మృతులు
- దేశంలో కోరలుచాస్తున్న కరోనా వైరస్
- ఆంక్షల సడలింపుపై కేంద్రం దృష్టి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** దేశంలో కరోనా మహమ్మారి కోరలు చాస్తున్నది. గత 24 గంటల్లో కొత్తగా 909 కేసులు నమోదుకాగా, 34 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం కేసుల సంఖ్య 8,356కు చేరుకోగా, మరణాల సంఖ్య 273కి పెరిగినట్లు కేంద్ర వైద్య శాఖ ఆదివారం వెల్లడించింది. ఇప్పటి వరకు 765 మంది కోలుకున్నట్లు తెలిపింది. ఒకవేళ కరోనా కేసులు ఒక్కసారిగా పెరిగినా.. ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొంది. కేంద్ర వైద్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలతోపాటు, ప్రైవేట్ మెడికల్ కాలేజీలలోనూ కరోనా నిర్ధారణ పరీక్షల సామర్థ్యాన్ని పెంచనున్నట్లు తెలిపారు. ఇందుకు దిశానిర్దేశం చేసేందుకు ఎయిమ్స్ వంటి 14 మెంటార్ ఇన్‌స్టిట్యూషన్లలను గుర్తించినట్లు చెప్పారు. అలాగే ప్రాథమిక వైద్య సదుపాయాల పెంపుపై దృష్టిసారించినట్లు తెలిపారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) వివరాల ప్రకారం.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 1,86,906 నమూనాలను పరీక్షించారు. గత ఐదురోజులుగా సగటున రోజుకు 15,747 శాంపిళ్లను పరీక్షించగా, అందులో రోజుకు సగటున 584 పాజిటివ్‌గా తేలాయి. కాగా, పీటీఐ గణాంకాల ప్రకారం.. దేశంలో కరోనా కేసులు 8,933కి (ఆదివారం సాయంత్రం 6.30 గంటల సమయానికి) చేరుకోగా, మరణాలు 296కి పెరిగాయి.

### మహారాష్ట్రలో 2 వేలకు చేరువలో..

మహారాష్ట్రలో కరోనా విజృంభిస్తున్నది. పాజిటివ్ కేసులు 2వేలకు చేరువయ్యాయి. తాజాగా 221 కేసులు నమోదుకావడంతో బాధితుల సంఖ్య 1,982కు చేరుకున్నది. కరోనాతో ఆదివారం మరో 22 మంది మృత్యువాతపడ్డారు. దీంతో రాష్ట్రంలో మొత్తం మృతుల సంఖ్య 149కి చేరుకున్నది. కరోనా తీవ్రత ఆధారంగా పుణే నగరాన్ని గ్రీన్, ఆరెంజ్, రెండ్ అనే మూడు జోన్లుగా విభజించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కాగా, కరోనా బారినపడిన తమ సిబ్బంది ఆరోగ్యం నిలకడగా ఉన్నదని, త్వరలోనే డిశ్చార్జి అవుతారని తాజ్ హోటల్ యాజమాన్యం తెలిపింది. పలువురు ఉద్యోగులకు కరోనా సోకినట్లు శనివారం పేర్కొన్న యాజమాన్యం.. ఎంతమందికి సోకిందనే విషయాన్ని మాత్రం వెల్లడించలేదు.




### ఐదు రంగాలకు సడలింపులు!

కరోనా వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు దేశవ్యాప్తంగా విధించిన లాక్‌డౌన్ ఈ నెల 14తో ముగియబోతున్నది. ఇప్పటికే తెలంగాణ, మహారాష్ట్ర, పంజాబ్, ఒడిశా రాష్ట్రాలు లాక్‌డౌన్‌ను ఈ నెలాఖరు వరకు పొడిగించాయి. ప్రధాని మోదీ శనివారం అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోనూ లాక్‌డౌన్‌ను కనీసం రెండువారాలు పొడిగించాలన్న అభిప్రాయం వ్యక్తమైంది. అదే సమయంలో కరోనా ప్రభావం లేని ప్రాంతాల్లో ఆర్థిక కార్యకలాపాలు ప్రారంభించేందుకు ఆంక్షలు సడలించాలని పలువురు సీఎంలు కోరారు. ఈ నేపథ్యంలో దశలవారీగా వాటిని తిరిగి ప్రారంభించేందుకు ఆయా రాష్ట్రాలతో కేంద్రం సంప్రందింపులు జరుపుతున్నది. ప్రాణాలతోపాటు జీవనాధారాలను కూడా రక్షించే వ్యూహానికి కేంద్రం ప్రణాళికలు రచిస్తున్నది. ఈ మేరకు ఐదు రంగాలను తిరిగి ప్రారంభిస్తే ఎలా ఉంటుదన్న దానిపై సూచనలు కోరింది. ఆ ఐదు రంగాలు.. ఫార్మా, టెక్స్‌టైల్స్, కెమికల్స్, స్టీల్, ఎలక్ట్రానిక్స్ అని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

### కరోనా క్లాక్

12-4-2020

| | | |
|---|---|---|
| ప్రపంచవ్యాప్తంగా ప్రభావిత కేసులు | 18.35 లక్షలు | |
| కోలుకున్నవారు | 4,20,510 | |
| మరణాలు | 1,13,194 | |

| దేశం | కేసులు | మరణాలు |
|---|---|---|
| అమెరికా | 5,50,145 | 21,649 |
| స్పెయిన్ | 1,66,019 | 16,972 |
| ఇటలీ | 1,56,363 | 19,899 |
| ఫ్రాన్స్ | 1,32,591 | 14,393 |
| జర్మనీ | 1,26,656 | 2,908 |
| యూకే | 84,279 | 10,612 |
| చైనా | 82,052 | 3,339 |
| ఇరాన్ | 71,686 | 4,474 |
| టర్కీ | 56,956 | 1,198 |
| బెల్జియం | 29,647 | 3,600 |

### రాష్ట్రాల్లో ఇదీ పరిస్థితి

#### 16 కోట్ల మాస్కులు పంపిణీ చేయనున్న ఏపీ

- *ఏపీ-అమరావతి:* రాష్ట్రంలోని 5.3 కోట్ల మంది ప్రజలకు 16 కోట్ల మాస్కులను పంపిణీ చేయాలని, ప్రతి పౌరుడికి మూడు మాస్కుల చొప్పున అందజేయాలని సీఎం జగన్మోహన్ రెడ్డి ఆదేశించారు. అదేవిధంగా పోగాకు ఉత్పత్తులను బహిరంగంగా ఉమ్మి వేయడాన్ని నిషేధించారు.
- *హిమాచల్ ప్రదేశ్:* కరోనా కట్టడి వ్యూహంలో భాగంగా రాష్ట్రాన్ని ఆరు జోన్లుగా విభజించనున్నట్లు హిమాచల్ ప్రదేశ్ సీఎం జైరామ్ ఠాకూర్ తెలిపారు.
- *పశ్చిమబెంగాల్:* కోల్‌కతాలోని ప్రభుత్వ వైద్య కాలేజీ దవాఖానలో ఇద్దరు రోగులకు కరోనా సోకింది. దీంతో దవాఖానలోని 22 మంది వైద్య సిబ్బందిని క్వారంటైన్‌లో ఉంచారు.
- *న్యూఢిల్లీ:* ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి వారి ఇండ్లలోనే తల్లిదండ్రుల ద్వారా హ్యాపీ క్లాసెస్ నిర్వహించనున్నట్లు ఢిల్లీ ప్రభుత్వం తెలిపింది.
- *ఒడిశా:* 9వ తరగతి నుంచి పదో తరగతికి ప్రమోట్ అయ్యే విద్యార్థులకు ఆన్‌లైన్‌లో తరగతులు నిర్వహించనున్నట్లు ఒడిశా ప్రభుత్వం తెలిపింది.
- *జమ్ముకశ్మీర్:* ప్రస్తుతం రాష్ట్రంలో సాగునీటి అవసరాలు లేకపోవడంతో కాలువల్లో పూడికతీత పనులను చేపట్టారు.



ముంబైలో రసాయనాల పిచికారి

#### మందుబాబులకు ఖుష్ ఖబర్!

**షిల్లాంగ్:** మందుబాబులకు మేఘాలయ సర్కారు శుభవార్త చెప్పింది. సోమవారం నుంచి ఈ నెల 17 వరకు ఐదు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మద్యం దుకాణాలు తెరువాలని నిర్ణయించింది. అయితే, మద్యం విక్రయాల సందర్భంగా వినియోగదారులు కనీసం ఒక మీటరు నిర్ణీత దూరం పాటించేలా చూడాలని ఆదేశాల్లో పేర్కొంది.

#### కరోనాను గెలిచిన పసి కూనలు

**బెంగళూరు/చెన్నై:** ప్రపంచ మానవాళిని గడగడలాడిస్తున్న కరోనాను ఇద్దరు పది నెలల పసి కందులు జయించారు. కర్ణాటకలోని దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన దంపతులకు పది నెలల కొడుకు ఉన్నాడు. గత నెలలో సదరు దంపతులు కేరళకు వెళ్లి వచ్చారు. ఈ క్రమంలో మార్చి 26న చిన్నారికి కరోనా పాజిటివ్ అని తేలింది. అయితే, దవాఖానలో చికిత్స తీసుకున్న చిన్నారికి తాజా పరీక్షల్లో కరోనా నెగెటివ్ వచ్చిందని వైద్యులు చెప్పారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన 10 నెలల మరో చిన్నారికి కూడా ఇటీవల కొవిడ్-19 సోకింది. అయితే, చికిత్స అనంతరం అతను కూడా కోలుకున్నాడు.



ఆదివారం ఈస్టర్ ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా బోసిపోయిన హంగేరి రాజధాని బుడాపెస్ట్‌లోని హంగేరియన్ క్యాథలిక్ చర్చి

## నిరాడంబరంగా ఈస్టర్ వేడుకలు

**వాటికన్‌సిటీ/రోమ్:** ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను నిరాడంబరంగా జరుపుకున్నారు. సాధారణంగా ఈస్టర్‌రోజు క్రైస్తవ కుటుంబాలు చర్చిల్లో జరిగే సామూహిక ప్రార్థనలకు హాజరవుతాయి. కానీ, కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఈసారి ఇంట్లో కొందరు స్నేహితుల మధ్య నిర్వహించుకున్నాయి. వాటికన్‌లోని ఖాళీగా ఉన్న సెయింట్ పీటర్ బసిలికాలోకి పోప్ ఫ్రాన్సిస్ ప్రవేశించి ప్రసంగించారు. ప్రస్తుత సంఘర్షణ పరిస్థితుల్లో తక్షణమే ప్రపంచవ్యాప్తంగా కాల్పుల విరమణ పాటించాలని పోప్ ఫ్రాన్సిస్ పిలుపునిచ్చారు.

## 20 లక్షల సురక్ష స్టోర్లు

- నిత్యావసర సరుకుల పంపిణీకి కేంద్రం కసరత్తు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ)తో 20 లక్షల 'సురక్ష' రిటైల్ స్టోర్లను ఏర్పాటుచేసేందుకు కేంద్రం ప్రణాళికలు రూపొందించింది. లాక్‌డౌన్‌లో కొనసాగింపు, అనంతర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సరిపడా నిత్యావసర సరుకులను భద్రతాప్రమాణాలతో సరఫరా చేయడం, దుకాణాల్లో పరిశుభ్రతను పాటించడం దీని లక్ష్యం. ఇందులో భాగంగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కిరాణా దుకాణాలను పరిశుభ్రమైన రిటైల్ ఔట్‌లెట్లుగా మారుస్తారు. దీనికోసం అగ్రశ్రేణి సరుకు రవాణా సంస్థలతో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక దఫా చర్చలు జరిపింది. 50కి పైగా సంస్థలను కేంద్రం సంప్రదించినట్టు సమాచారం. ఎంపిక చేసిన సంస్థకు ఒకట్రెండు రాష్ట్రాల బాధ్యతను అప్పగించవచ్చు. రానున్న 45 రోజుల్లో 20 లక్షల రిటైల్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకున్నది. అగ్రశ్రేణి ఉత్పాదక సంస్థలతో కలిసి 'సురక్ష సర్కిల్' ఏర్పాటు చేయాలని కేంద్రం కసరత్తు చేస్తున్నది. ఒక సురక్ష సర్కిల్ పరిధిలోకి 5000 కుటుంబాలు, 50 వేల ఎస్‌ఎంఈలను తేవాలని భావిస్తున్నది.

## 9 నెలలకు సరిపడా నిల్వలు

**న్యూఢిల్లీ:** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) కింద దేశవ్యాప్తంగా ఉన్న 81 లక్షల కార్డుదారులకు సరఫరా చేసేందుకు 9 నెలలకు సరిపడా ఆహార ధాన్యాల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం తెలిపింది. కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి రాంవిలాస్ పాశ్వాన్ మాట్లాడుతూ ఈ నెల 10 నాటికి ప్రభుత్వ గోదాముల నుంచి 299.45 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం, 235.33 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను పేదలకు పంపిణీ చేశామన్నారు.

## ఆపదలో అండగా తెలంగాణ బిడ్డ

- కరోనాపై పోరుకు 1500 కి.మీ. ప్రయాణించిన ఖమ్మం వాసి
- ఉత్తరప్రదేశ్‌లో వైరస్ వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో నిమగ్నం



**న్యూఢిల్లీ,/లక్నో, ఏప్రిల్ 12:** ఒక్క ఆదేశంతో సైనికుడు యుద్ధరంగంలో దిగినట్టే.. ఒక్క ఫోన్‌కాల్‌తో కరోపై పోరులో పాలుపంచుకున్నాడు తెలంగాణ బిడ్డ రామకృష్ణ. కరోనా నిర్ధారణ పరీక్షల్లో సాయం చేయాలంటూ తన గురువు ఫోన్ చేయగానే.. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా ఉత్తరప్రదేశ్‌కు బయలుదేరి వెళ్లాడు. ఖమ్మం జిల్లాకు చెందిన రామకృష్ణ.. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీలో మైక్రోబయోలజీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. ఆరు నెలల కిందటే ప్రాజెక్టు వర్క్‌ను పూర్తి చేసి ఖమ్మం వచ్చేశారు. అయితే యూపీలో కరోనా తీవ్రం కావడంతో.. వెంటనే రావాలని, కరోనా నిర్ధారణ పరీక్షల్లో పాలుపంచుకోవాలని వర్సిటీ మైక్రోబయాలజీ విభాగాధిపతి కోరారు. కరోనా నిర్ధారణ పరీక్షలు చేయడానికి వెళ్తున్నానంటే తన తల్లిదండ్రులు భయపడి వద్దంటారేమోనని భావించిన రామకృష్ణ.. హైదరాబాద్‌లోని స్నేహితుల రూమ్‌లో ఉండి థీసిస్ రాస్తానని అబద్ధం చెప్పి గత నెల 22న జనతా కర్ఫ్యూ ఉన్నా.. అష్టకష్టాలు పడి ఖమ్మం నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. 23వ తేదీ ఉదయం విమానాశ్రయానికి బయలుదేరారు. అప్పటికే లాక్‌డౌన్ ప్రకటించడంతో పోలీసులు రామకృష్ణను అడ్డుకున్నారు. దీంతో ఆయన పోలీసులకు అసలు విషయాన్ని వివరించారు. రామకృష్ణ మంచి ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న తెలంగాణ పోలీసులు.. అతడిని అనుమతించారు. రెండు రోజుల్లో దాదాపు 1500 కి.మీ. ప్రయాణించి లక్నోకు చేరుకున్న రామకృష్ణ కరోనా నిర్ధారణ పరీక్షల్లో భాగస్వాములయ్యారు. అతను పడిన కష్టం గురించి కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ ట్వీట్ చేయడంతో రామకృష్ణ ఒక్కసారిగా వెలుగులోకి వచ్చారు.

## జర్మనీ.. దిక్సూచి!

- ప్రభుత్వం పటిష్ఠ చర్యలు
- కరోనాకు ముకుతాడు
- మరణాల రేటు 2 శాతమే
- వైరస్ కట్టడిలో ఇతర దేశాలకు మార్గదర్శకం

**బెర్లిన్:** కరోనా మహమ్మారి ఐరోపా దేశాలను అతలాకుతులం చేస్తున్నది. ఇటలీ, స్పెయిన్, ఫ్రాన్స్, బ్రిటన్ వంటి దేశాల్లో మరణమృదంగం మోగిస్తున్నది. అయితే మిగిలిన ఐరోపా దేశాలతో పోలిస్తే జర్మనీ కరోనాను సమర్థంగా నిలువరిస్తున్నది. ఇటలీ, బ్రిటన్‌లలో మరణాల రేటు 12 శాతం ఉండగా, జర్మనీలో కేవలం రెండు శాతం మాత్రమే ఉండడం విశేషం. దీంతో కరోనా కట్టడికి జర్మనీ అనుసరించిన విధానం మిగిలిన దేశాలకు దిక్సూచిగా మారింది.



లాక్‌డౌన్ నేపథ్యంలో నిర్మానుష్యంగా మారిన బెర్లిన్‌లోని అలెగ్జాండర్‌ప్లేట్జ్ స్క్వేర్

### వారానికి 5 లక్షల మందికి పరీక్షలు

తక్కిన యూరప్ దేశాలతో పోలిస్తే జర్మనీ అత్యధికంగా కరోనా నిర్ధారణ పరీక్షలను నిర్వహించింది. తద్వారా వేగవంతంగా బాధితులను గుర్తించి, వారిని ఐసొలేట్ చేయడం ద్వారా వైరస్ వ్యాప్తికి అడ్డుకట్ట వేసింది. వారానికి దాదాపు 5 లక్షల మందికిపైగా పరీక్షలు నిర్వహించగల సామర్థ్యం జర్మనీ సొంతం.

### బాధితుల్లో వృద్ధులు 20 శాతమే..

వృద్ధులకు కరోనా ప్రాణాంతకం అన్న విషయం తెలిసిందే. జర్మనీలో కరోనా బాధితుల్లో 60 ఏండ్లు పైబడిన వారు కేవలం 20 శాతం మందే ఉన్నారు. అదే ఇటలీ, స్పెయిన్ వంటి ఇతర ఐరోపా దేశాల్లో ఈ వయసు వారు దాదాపు 50 శాతానికి పైగా ఉన్నారు. జర్మనీ జనాభా సగటు వయసు 45.7 ఏండ్లు కాగా, 65 ఏండ్లు పైబడిన వారు 21 శాతం ఉన్నారు. ఇటలీ జనాభా సగటు వయసు 47.3 ఏండ్లు కాగా, 65 ఏండ్లు పైబడిన వారు 23 శాతం ఉన్నారు. ఇక బ్రిటన్ జనాభా సగటు వయసు 40.5 ఏండ్లు కాగా, 65 ఏండ్లు పైబడిన వారు 19 శాతం ఉన్నారు. జర్మనీలోనూ వృద్ధుల జనాభా అధికంగా ఉన్నప్పటికీ విస్తృత పరీక్షలు, ఐసొలేషన్, నిర్ణీత దూరం పాటించడం వంటి చర్యల ద్వారా ఆ దేశం ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగింది.

| దేశం | మరణాల రేటు |
|---|---|
| ఇటలీ | 12.72 |
| బ్రిటన్ | 12 |
| స్పెయిన్ | 9.73 |
| జర్మనీ | 2.09 |
| ప్రపంచ సగటు | 5.98 |

### హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్..

గత కొన్నేండ్లుగా వైద్య రంగంలో నిలకడగా పెట్టుబడులు పెట్టడం జర్మనీకి లాభించింది. ఆ ప్రతిఫలాలు ఇప్పుడు అందివస్తున్నాయి. జర్మనీలో ప్రతి లక్షమందికి 34 వెంటిలేటర్లు ఉన్నాయి. అదే ఇటలీలో కేవలం ఏడు మాత్రమే ఉన్నాయి. ఇక అక్యూట్ కేర్ బెడ్‌ల విషయానికి వస్తే, జర్మనీలో ప్రతి లక్షమందికి 621 బెడ్‌లు ఉన్నాయి. ఇటలీ, బ్రిటన్‌తో పోలిస్తే ఇది రెట్టింపు కంటే అధికం. ఇటలీలో లక్ష మందికి 275 బెడ్‌లు, బ్రిటన్‌లో 228 బెడ్‌లు మాత్రమే ఉన్నాయి.



### మాస్కు లేకుంటే 5 వేల ఫైన్‌లేదా మూడేండ్ల జైలు!

*అహ్మదాబాద్:* కరోనా కేసులు అంతకంతకూ పెరుగుతున్న నేపథ్యంలో గుజరాత్‌లోని అహ్మదాబాద్ మున్సిపల్ అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ముఖానికి మాస్కులు లేకుండా ఇంటి నుంచి బయటకు వచ్చే వారికి రూ. 5 వేల జరిమానా లేదా మూడేండ్ల పాటు జైలు శిక్ష విధిస్తామని చెప్పారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఈ నిబంధనలు అమల్లోకి వస్తాయన్నారు.



### చిన్నారికి కరోనా.. పేరెంట్స్‌పై కేసు

*భావ్‌నగర్:* లాక్‌డౌన్ కొనసాగుతున్నప్పటికీ, తాను ప్రభుత్వ ఉద్యోగినని పోలీసులకు అబద్దం చెప్పి భార్య, నాలుగేండ్ల కూతురుతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లొచ్చాడు ఓ ప్రబుద్ధుడు. అయితే, ఇంటికి తిరిగి రాగానే చిన్నారి అస్వస్థతకు గురైంది. పరీక్షలు చేయగా కరోనా అని తేలింది. దీంతో తల్లిదండ్రులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటన గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో జరిగింది.



### అత్తారింటికి దారేదీ?!

*అలీగఢ్:* అంగరంగ వైభవంగా సావిత్రి అనే యువతికి పెండ్లి జరిగింది. అయితే, అత్తారింటికి వెళ్లే మార్గం ఆమెకు తెలియడం లేదు. దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడమే దీనికి కారణం. యూపీలోని అలీగఢ్‌కు చెందిన సావిత్రి వివాహం గత నెల 21న జరిగింది. 23న భర్తతో కలిసి.. అత్తారిల్లు అయిన జార్ఖండ్‌లోని దందాబాద్‌కు ఆమె చేరుకోవాలి. అయితే లాక్‌డౌన్‌తో సావిత్రి, ఆమె భర్త, బంధువులు అలీగఢ్‌లోనే చిక్కుకుపోయారు.




### అద్దె రాయితీ పథకాన్ని తెండి

*బెంగళూరు:* లాక్‌డౌన్ కాలంలో ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్న అద్దెదారులకు ఊరట కలిగించేలా 'అద్దె రాయితీ' పథకాన్ని తీసుకురావాలని కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే చాలా దేశాలు ఈ పథకాన్ని ప్రవేశపెట్టాయని గుర్తుచేసిన ఆయన.. దేశంలో ఇంకా దీన్ని తీసుకురాకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నదని ఆదివారం వరుస ట్వీట్‌లు చేశారు.




### స్వీయ నిర్బంధంతో మానసిక సమస్యలు!

*బోస్టన్:* కరోనా వ్యాప్తిని అరికట్టడంలో భాగంగా వైరస్ అనుమానితులు స్వీయ నిర్బంధంలో ఉండాలని ప్రభుత్వాలు సూచిస్తున్నాయి. అయితే, ఎక్కువ కాలం స్వీయ నిర్బంధంలో ఉంటే మానసిక సమస్యలు తలెత్తవచ్చని బోస్టన్ వర్సిటీ పరిశోధకులు తేల్చారు. ఒంటరితనాన్ని పోగొట్టేందుకు వీడియో కాలింగ్‌తో సన్నిహితులతో మాట్లాడాలని, యోగా, వ్యాయామం చేయాలని సూచించారు.



### పెరిగిన నీటి వినియోగం

*న్యూఢిల్లీ:* కరోనాను నియంత్రించే క్రమంలో యూపీలోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో నీటి వినియోగం సగటున 60 శాతం పెరిగిందని ఓ స్వచ్ఛంద సంస్థ తెలిపింది. మార్చి 15కు ముందు సగటున ఒక వ్యక్తి రోజుకు 75 లీటర్ల నీటిని వినియోగించగా, కరోనా నేపథ్యంలో పదే పదే చేతులు కడుగడం, పరిశుభ్రత చర్యలు పెరుగడంతో నీటి వినియోగం 125 లీటర్లకు పెరిగిందని 'జల్ జన్ జోడో' కన్వీనర్ సంజయ్‌సింగ్ తెలిపారు.



### శైవలాలతో అడ్డుకట్ట

*న్యూఢిల్లీ:* కరోనా విశ్వమారి వ్యాప్తిని అడ్డుకునేందుకు ఎర్రని శైవలాలు సాయపడుతాయని నవీ ముంబైలోని రిలయన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ శాస్త్రవేత్తలు వెల్లడించారు. సముద్రాల్లో నివసించే ఈ పార్ఫిరీడియం శైవలాల్లో లభించే సల్ఫేట్ పాలీసాకరైడ్లు అనే జీవ సంబంధిత సమ్మేళనాన్ని ఉపయోగించి శానిటరీ పదార్థాలకు రక్షక పూతను ఏర్పాటు చేయవచ్చని అభిప్రాయపడ్డారు.



# నిన్ను నాయినా అని పిలువాలనుంది!

మొన్న టీవీల నిన్ను
సూసినంక.. మాటలిన్నంక..
నీ చెయ్యితోని మా కండ్లనీళ్ళు తుడ్శినట్టు
మా భుజంమ్మీద చెయ్యేసి
ధైర్యం చెప్పినట్టు
మా ఇంట్ల మనిషివైనట్టుగొట్టింది
నిన్ను 'నాయినా' అని పిలవాలనుంది..
పిలవనా.. నాయినా..!

మొన్న నువ్వు ఇచ్చిన భరోసాకు
ఆల్లు ఈల్లని కాదు మొత్తం అందరు
ఊపిరి పీల్సుకున్నరు
పానాలు లేచివచ్చినయ్ అన్నరు
తెలంగాణ వెన్నుపూసగ నిల్శినవ్
గుండె దమ్మువై నడుస్తున్నవ్
మా బాగోగులు పట్టించుకుంటున్నవ్
నిన్ను చూసినా.. నీ మాటలిన్నా..
బతుకుమీద నమ్మకమొస్తది
భయమన్నది ఆమడదూరం పోతది
దేన్నయినా జయిస్తమనిపిస్తది
మేం చేసుకున్న అదృష్టం నువ్వు!
ఇది నా ఒక్కడి మాట కాదు
ఒక్క తెలంగాణ మాట కాదు
తెలుగోళ్లందరి మాట..!

అందరు సల్లగుండాలె
మనుషులు పోతే వస్తరా అని
మానవ వనరుల విలువలు చెప్తివి
తెలంగాణ బిడ్డలే గాదు
ఈ గడ్డమీదున్న ఏ బిడ్డ గూడ
ఉపాసం పండొద్దని
అమ్మలెక్కన అర్సుకుంటున్నవ్
ఆఫీసర్లకి ఆర్డర్లిస్తివి
ఆపన్నుల ఆదుకుంటివి
అనాథల అక్కున చేర్చుకుంటివి
గీ 'కరోనా'ని తరుముకుంట
పానాలు నిలుపుతుంటివి..!

ప్రధాన మంత్రంటే
దేశానికి బడిలెక్కన
మంచిమాట ఎవరన్నా వినాలని
మంచి బాట ఎవరుచూపినా నడవాలని
ప్రమాదంల పార్టీలు చూడొద్దని
మానవత్వం నేర్పిస్తివి
మానవజన్మ పునరుద్ధరిస్తుంటివి
ఇరుగుపొరుగోల్లకు ఆదర్శమైతివి..!

మొన్నమొన్ననే నాయె
తెలంగాణ లేశి నిలబడింది
దూపకు అంగలార్శిన మట్టి పెల్లలకు
దూప తీరిస్తివి.. పంట బిడ్డల్ని పెంచబడ్తివి
ఎవరింట్లనో బతికే బతుకులకు
తెలంగాణ ఇల్లు గడితివి
చీకటి బతుకులల్ల దీపాలెలిగిస్తివి
మంచిగ వున్న టైమ్‌ల
తెలంగాణ పచ్చగ విరబూస్తున్న టైమ్‌ల
ఏడికెల్లి వచ్చెనో రాకాసిలెక్క
దయ్యం లెక్కన.. దరిద్రం లెక్కన..
ఈ కరోనా పాడుగాను
కనపడకుంటనే ఊపిరి తియ్యబట్టె
మనసుల అరిగోస పెట్టబట్టె
మనుషుల దూరం చెయ్యవట్టె..!

భయం.. బాధ..
ఎప్పటికి బాగయితమో
కల్సిమెల్సి ఎప్పుడు తిర్గుతమో.. అని
గాబర గాబర అయితున్న టైమ్‌ల
టీవీల నువ్వొచ్చి
మనాది పడకుండ్రని
మాట్లాడినవ్ సూడు.. గప్పుడు..
ఏ... ఏంగాదు, నాయినున్నడు
నాయిన సూసుకుంటడు అన్పించి
నేనో ముద్దతిని.. పోరగాండ్లకో
రెండు ముద్దలుపెట్టిన
తల్లి గాసం లెక్కన నువ్వుండనే వుంటివి..!
నాయినా..
గప్పుడెప్పుడో ఎన్కట
గోవర్ధన పర్వతమెత్తి
శ్రీకృష్ణ పరమాత్ముడు రాళ్ల వర్షాన్నించి
గోకులాన్ని కాపాడినట్టు
గిప్పుడు నువ్వు కూడా
కరోనా బారిన పడకుంట.. నీ భుజం కాసి
ఈ గడ్డమీదోళ్లు ఓటర్లు కాదు
మనుషులని చెప్పి కాపాడబడ్తివి
అది కథేమో గని.. ఇదైతే నిజం..!

ఆకలి దెల్సినోనివి
అప్పుల బాధలు తెల్సినోనివి
మడమ తిప్పక యుద్ధం చేసేటోడివి
తెలంగాణ తల్లి నుదుట
తొలి తిలకం దిద్దినోనివి
అన్నం పెట్టే రైతన్నకు అన్నవైతివి
పేదోళ్ల పరమాన్నవైతివి
దేవుడిచ్చిన బహుమానం నువ్వు..!

ఆపతుల వున్నం..
బయటికి రాకుర్రి.. పరేషాను కాకుర్రి
పరేషాన్ చేయకుండ్రి..
అన్నవ్, గంతనే గద!
మమ్మల్నేమన్న జైల్లో పెట్నవ?
మాకేమన్న శిక్షలేస్తున్నవ?
అరే! పప్పు, ఉప్పు దొరికే
దుకాన్లు తెరిపిస్తివి
కూరగాయలు దొరుకుతనే వుండే
పాలు పెరుగు వస్తనే వుండె
పేదోళ్లకు రేషన్ ఇస్తనే వుంటివి
పంటలు కొంటనని
ప్రభుత్వ దుకాన్లు తెరవనేబడ్తివి
ఇంకేం కావాల్ననాయిన..
నువ్వు చెప్పినట్టు పానం మిగిల్తే చాలు
నువ్వు చెప్పినట్టింటమ్
కలో గంజో తాగుతం
పోరగాండ్లకు సమ్జాయిస్తమ్
అల్పం గాండ్లకు మేమే బుద్ధిచెప్తమ్
రేపటి కలివిడి కోసం
ఈరోజు అలగ్ అలగ్ వుంటం..!

ప్రాణం అడ్డం పెట్టి పానం పోస్తున్న
డాక్టర్లకు.. బయటికొచ్చి బరువుకాం
ఎండలల్ల మాడ్తున్న పోలీసులకు
గుండెనిండ దండం బెడ్తున్నం
నాయినా! నువ్వు చెప్పినట్టు
పానాలు తీస్క రానీకి
గిప్పుడైతే సావిత్రమ్మలు లేరు గని..
పానాలు పోకుండ సూస్కోనీకి
డాక్టర్లు, పోలీసులు, ప్రభుత్వమోల్లు
మీదిమిక్కిలి నువ్వు..
సావిత్రమ్మలెక్కనే కొడ్తున్నరు..!
నీ ముందు సూపునకు
గీ 'కరోనా' ఓ లెఖ్ఖనా.. నాయినా...
నువ్వు ముందుంటే చాలు
మాస్కుల కవచమేస్కొని
కరోన మీద యుద్ధం చేస్తం
దూరంగుంటం.. మనసుల దగ్గరికైతం
నీ నీడల సల్లగ బతుకుతం
తెలంగాణని బతికిచ్చికుంటం..!

నాయినా..
ఆపదలో ఆదుకున్నోడే మనిషి
కరోనా కనపడని పురుగైతే
నువ్వు కనపడే దేవుని తీర్న..
గీ కరోనా పురుగు ఎట్లనన్న సస్తది
మళ్లీ రేపటి రోజున సిద్ధంగుండాలె...
'బతుకు కరోనా'తో యుద్ధం చేయాలె
వంగిన మొక్కలకు ఊతకర్ర లెక్కన
నువ్వుండనే వుంటివి..!
నాయినా... నువ్వు మానవ మందిరం..
నువ్వు మానవీయ పతాకం...
సల్లంగుండు.. నీ కొడుకులు బిడ్డలు
గూడ సల్లంగుండాలె....



**ఉత్తేజ్**
**98498 99399**

## కవితలకు ఆహ్వానం

తెలంగాణ సామాజిక రచయితల సంఘం తృతీయ వార్షికోత్సవం సందర్భంగా జాతీయస్థాయి కవితా పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నాం. 'కోరలు చాచిన కరోనాను అంతం చేద్దాం' అంశంపై రచయితలు 20 లైన్లకు మించకుండా కవితలను 2020 ఏప్రిల్ 19 లోపు rajeshamravula@gmail.comకు పంపించాలి.

**వివరాలకు: 9848811424**

**- కామిడి సతీష్‌రెడ్డి, తెలంగాణ రచయితల సంఘం సహ అధ్యక్షులు**

> కవిత్వ పోకడలు నానాటికి వింతదారులు తొక్కుతున్న సందర్భంలో.. ఏది సుకవిత్వం, ఏది కుకవిత్వం అని ఒక అభిప్రాయానికి రాలేకపోతున్నాం. వచన కవిత్వం వచ్చిన తర్వాత, ఛందోబద్ధ నియమాలు లేకపోవడం వల్ల, సాహిత్య పరిచయం కాస్తో కూస్తో ఉన్న ప్రతి వ్యక్తీ తనదైనశైలిలో కవిత్వాన్ని రాయగలుగుతున్నాడు. కానీ కాలగమనంలో అన్ని కవిత్వాలు నిలబడుతాయా అనేది ప్రశ్న?

# మెరుపులా మెరిసేదే కవిత

**సమకాలీనంగా** నేడు రాసిన, రాస్తున్న కవులకు ఒక నిబద్ధత, ఒక ప్రమాణం, ఒక సాహిత్య సాంగత్యం, ఒక కవి గురువు లేకపోవడమే కారణం.

ద్వేష, విద్వేషరహితంగా, సిద్ధాంతపరంగా ఉన్న విమర్శలు నిలదొక్కుకుంటాయి. విమర్శకులకు, సమీక్షకులకు కవిత్వ పరిజ్ఞానం మెండుగా ఉండాలి. అనుభవపూర్వకంగా కవితలను అర్థం చేసుకోవాలి. బాగా చదువాలి. విమర్శకులు కవులైనా, కాకపోయినా పరవాలేదు. వారికి విమర్శనా శక్తి ఉంటే చాలు. ఒక కవిత్వాన్ని తీసుకొని, అందులోని గుణగణాలను, లోటుపాట్లను సద్విమర్శ చేయగలుగాలి. ఇక్కడ సద్విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది.

ప్రతి కవి లేదా కవయిత్రి తాను రాసిన కవిత చాలా గొప్పదిగా తలపోస్తారు. ముక్కుసూటిగా విమర్శించకుండా వివరణాత్మకతతో వివరించాలి. ఎలా రాసినా కవిత్వమనిపించుకోదు. వచనాన్ని ముక్కలుముక్కలుగా విరిచి దొంతరులుగా పేర్చి, కవితను మమః అనిపిస్తున్నారు. ప్రతి భావాన్నీ, ప్రతి సన్నివేశాన్నీ కవిత్వం చెయ్యాలి. ప్రతి కవితకూ ఒక ఆత్మ ఉంటుంది. జీవం ఉంటుంది. కొన్ని కవితల్లో అక్షరాలు మనతో మాట్లాడినట్లుంటాయి. మనల్ని పలకరిస్తాయి కూడా! కవి భావావేశానికి మనం మంత్రముగ్ధులైపోతాం. కవిత్వానికి, చదువుకు సంబంధం లేదు. ఏమీ చదువని నిరక్షరాస్యులు కూడా గొప్ప పాటల్ని, అందులో గొప్ప భావావేశాన్ని పొదిగారు. వాల్మీకి గొప్ప పండితుడు కాదు. అతనొక బోయవాడు. మహత్తరమైన రామాయణాన్ని మనకందించాడు. కబీరు, వేమన, పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి పండితులు కారు. కానీ నేటికీ గుర్తుండిపోయే పద్యాల్ని మనకు అందించారు. కవిత్వమనేది ఒక టెక్నిక్. సామాజిక స్పృహ ఉన్న కవి కవిత్వం రాయడమనే టెక్నిక్ తెలియకపోతే గొప్ప కవి కాలేడు. పూవు నేలరాలితే పరిమళం గాయపడుతుంది. మృదుత్వం మౌనంగా రోదిస్తుందన్నాడో కవి. ఈ పదాల్లో కవిత్వం పారాడుతోంది. మనల్ని ఈ భావాలు వెంటాడుతూనే ఉంటాయి.

తెలంగాణ కవులు ఆలిశెట్టి ప్రభాకర్, కాళోజీ సామాన్యులకు చేరువయ్యే కవిత్వాన్ని అందించారు. కవిత్వం రాయడమనేది అందరికీ అబ్బే విద్య కాదు. శ్రీ శ్రీ కవిత్వంలో అగ్నిపర్వతాలు బద్ధలైనట్లు ఉంటుంది. అలాగే కృష్ణశాస్త్రి కవిత్వం మృదు మధురంగా వసంతకోకిల గానం చేసినట్లుంటుంది. సినారె కవిత్వం భావ గర్భితంగా, గంభీరంగా ఉంటుంది. ఇలా ప్రతి కవి ఒక ప్రత్యేకతను కలిగి ఉంటాడు. చివరగా.. 'కప్పి ఉంచితే కవిత్వం.. విప్పి ఉంచితే విమర్శ' అన్నాడు ఒక మహాకవి. మరి సమీక్షకులు, విమర్శకులు ఆలోచిస్తారు కదూ! కవితా సమీక్ష అంటే వారి కవితలోని విషయాలను తిరగ రాయడం కాదు. కవిత్వ నిర్మాణ పద్ధతిని సమీక్ష చెయ్యాలి. విమర్శ అంటే కవితలోని లోటుపాట్లను విడమరచి చెప్పాలి.

కవిత్వ నిర్మాణ పద్ధతుల్లోని మెలకువలను గమనించాలి. వచనాన్ని వీలైనంత తక్కువగా వాడితే మంచిది. వచన కవితా ప్రక్రియలో కవిత్వానికి పెద్దపీట వేయాలి. భావాత్మకత ఉన్నా, కవిత్వ ప్రేరకాలు లేకపోతే ఆ కవిత పండదు. కవిత్వాలు వచన పంక్తులు కాకూడదు.

మాట్లాడే భావాన్ని సంభాషణగా మలుస్తూ కవిత్వాన్ని చేయవచ్చు. వచన కవిత్వంలో కొన్ని మెలకువలను విధిగా అనుసరించాలి. కానీ వచన కవిత్వం ప్రమాణాలను పాటించాలి. కవితలో చెప్పవలసినదాన్ని నాలుగైదు మెటాఫర్ల ద్వారా చెబితే అది మంచి కవిత అవుతుంది. ఎత్తుగడ గానీ, ముగింపు గానీ ఒక మెరుపులా మెరిస్తే కవిత గుర్తుండిపోతుంది.




**- వారణాసి భానుమూర్తిరావు**
*99890 73105*

# దూరం.. దూరమయ్యే రోజు కోసం!

**చిన్నప్పుడు** లెక్కల్లో 'కాలము-దూరము' అనే పాఠ్యాంశం ఉండేది. చిన్నప్పటి 'కాలము-దూరము' లెక్క పెద్దయ్యాక మారకపోయినా దాని అర్థం తాత్త్వికంగా మారిపోయింది. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా.. 'కరోనా కాలం; కరోనా దూరం' అని కొత్త కాలప్రమాణాలు, కొత్త దూరం లెక్కలు వాడుకలోకి వచ్చాయి. మానసిక శాస్త్రంలో వెలితి, శూన్యం, ఒంటరితనం, వైరాగ్యం, నిరాశ, నిస్పృహల లెక్కలు, దూరాలు మొదట మనసు, తర్వాత శరీరం, చివర సమాజంతో ముడిపడి ఉంటాయి. కరోనా శాస్త్రం దీనికి రివర్సు. కరోనా దూరాలు మొదట సమాజం, తర్వాత శరీరం, చివర మనసుతో ముడిపడకుండా ఉండాలి.

'సోషల్ డిస్టెన్స్' అనే ఇంగ్లిష్ మాటకు సామాజిక దూరం అన్న అనువాదం కరక్టే. కానీ సామాజిక దూరం అన్న భావన కరోనా దెబ్బకు దూరదూరంగా ఉండటమంత చిన్న విషయం కాదు. దాని భావం, అర్థ విస్తృతి పెద్దది. అసలే మన నిచ్చెన మెట్ల సమాజంలో, శతాబ్దాలుగా అంటరాని దురాచారం రాజ్యమేలిన దేశంలో సామాజిక దూరం అనగానే ఏవేవో గాయాలు గుర్తొస్తాయి, గుచ్చుకుంటాయి, బాధపెడుతాయి. సామాజిక దూరం మాట కంటే భౌతిక దూరం మాట బెటరని కొందరి వాదన. ఏ తమిళులో అయితే వారి సొంతమైన భాషలో అప్పటికప్పుడు పారిభాషిక పదాలను సృష్టించుకుంటారు. వాటిని ఉపయోగిస్తారు. తెలుగులో మనకేదైనా ఇదివరకు సంస్కృతంలో చెప్తే కానీ అర్థమైచచ్చేదికాదు. ఇప్పుడు ఇంగ్లిష్‌లో చెబితే తప్ప అర్థం కాదు. చక్కగా తెలుగులో.. మనిషికి మనిషికి మధ్య దూరం; ఒకరొకరికి మధ్య ఎడం; దూరం-దూరం.. ఇలా ఎన్ని మాటలనైనా సామాజిక దూరానికి బదులు వాడవచ్చు. కానీ ఎక్కడో అంతరాంతరాల్లో మనకు అచ్చ తెలుగు మాటలు వాడటం నామోషీ, సిగ్గు, చులకన. అదే సంస్కృతమో, ఇంగ్లిషో వాడితే గాంభీర్యం, మర్యాద, హోదా, పెద్దరికం, బాగా చదువుకున్నట్టు. అందుకే తెలుగు, తెలుగు మాండలికాలు, వాటి అందాలు చదువుకున్నవారికంటే చదువుకోని గ్రామీణుల్లోనే సజీవంగా ఉంటాయని ప్రఖ్యాత భాషా శాస్త్రవేత్త భద్రిరాజు కృష్ణమూర్తి సూత్రీకరించారు.

ప్రపంచానికి కరోనా నేర్పిన-నేర్పుతున్న పాఠాలు చాలా ఉన్నాయి. నేర్పబోయే పాఠాలు కూడా చాలా ఉండబోతాయి. కరోనాకు ప్రస్తుతానికి మందుల్లేవు, జాగ్రత్తలు తప్ప. ఒకరికొకరికి దూరం, సమూహాలకు దూరం, స్వీయ గృహనిర్బంధం, పరిశుభ్రతలే ప్రస్తుతానికి మందులు. భౌతికదూరం మాట సామాజికదూరంతో పోలిస్తే నయమే కానీ, అర్థంలో దోషం లేకపోయినా 'భౌతిక' చాలా బరువైన మాట. అసలే కనిపించని కరోనా సూక్ష్మ క్రిమితో సమాజం చస్తుంటే, ఈ సంధి సమాసాల సూక్ష్మ దృష్టి అవసరమా?



కరోనాకు విరుగుడుగా సామాజిక/భౌతిక దూరం పాటించాలి. మనుషుల మధ్య మానసిక దూరాలు తగ్గాలి, తగ్గుతున్నట్లున్నాయి. లేకపోతే ఎక్కడి ఇటలీ? ఎక్కడి స్పెయిన్? ఎక్కడి భారత్? భూగోళంలో ఎక్కడెక్కడి కరోనా విషాదాలకు మనం బాధపడుతున్నాం. గుండెలను బరువెక్కించుకుంటున్నాం. పుడమికి కరోనా పీడ త్వరగా విరగడకావాలని కోరుకుంటున్నాం.

సామాజిక దూరం.. ఇప్పుడు మన సమాజ ఆరోగ్యానికి... భౌతిక దూరం.. ఇప్పుడు మన శరీర ఆరోగ్యానికి... మనసులు దగ్గరవడం.. ఇప్పుడు మనుషుల ఆరోగ్యానికి... భాషదేముంది? కరోనాకు భాష లేదు. వైరస్‌కు నోరు లేదు. కన్నీళ్లకు భాష లేదు.

చావుకు భాష లేదు. ఈ దూరాలు తగ్గి మళ్లీ మనిషి మనిషి కలిసిమెలిసి తిరిగే కాలం త్వరలోనే రావాలి. ఒకరికొకరు తెలియకపోయినా సమూహంలో ఉన్న బలం మళ్లీ బలపడే కాలం త్వరలోనే రావాలి. మోడుగా బోసిపోయిన దారులన్నీ మళ్లీ జనం పాదాలను, జగతి రథచక్రాలను మోసి మోసు లెత్తే కాలం త్వరలోనే రావాలి.

**- పమిడికాల్వ మధుసూదన్,**
*99890 90018*

# కలమే కదనాస్త్రం

**చైనాలో** పుట్టిన కరోనా మహమ్మారి ఒక్కొక్కటిగా దేశాలన్నీ చుట్టి, మనదేశంలోనూ తన రెక్కలు చాచింది. చరిత్రలో కనివిని ఎరుగని స్థాయిలో మానవ హననానికి కారణమవుతున్న ఈ వైరస్ విస్తరించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకున్నాయి. గత నెల 22న కేంద్రం 'జనతా కర్ఫ్యూ'ను ప్రకటించి, ఆ తర్వాత ఈ నెల 14 వరకు లాక్‌డౌన్ విధించింది. కేంద్ర ప్రభుత్వ చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం బాసటగా నిలిచింది.

కరోనా వ్యాధి విస్తరించకుండా ఉండాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం ముఖ్యం. సరైన అవగాహన లేకపోతే ప్రజల్లో అనవసర భయాందోళన ఎక్కువయ్యే అవకాశం ఉన్నది. లేని వ్యాధిని ఉన్నట్టు ఊహించుకోవడం వల్ల ఇతరత్రా మానసిక సమస్యలు కూడా తలెత్తవచ్చు. ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు కవులు, రచయితలు చేసిన కృషి ప్రశంసనీయం.

తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు పలు కీలక సమయాల్లో, పోరాటాల్లో నిబద్ధతతో సాహితీవేత్తలు చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుంది. అందువల్లే కరోనాపై యుద్ధంలో కవులు, రచయితలు భాగస్వాములు కావాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన అయినంపూడి శ్రీలక్ష్మి కవిత 'కరోనాకి ఓ రిటర్న్ గిఫ్ట్'ను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రశంసించారు. గతంలో ప్రపంచం ఎదుర్కొన్న కలరా, ప్లేగు వంటి వ్యాధులను ఈ కవయిత్రి గుర్తుచేస్తూ, వాటిపై మానవ జాతి విజయ పరంపరను వివరించారు. 'గతమెప్పుడూ విజయాల్నే గుర్తుచేస్తుంది/వర్తమానమెప్పుడూ సవాళ్లనే చూపిస్తుంది/భవిష్యత్తెప్పుడూ ఆశలనే ప్రోదిచేస్తుంది' అంటూ ఆశావహ దృక్పథంతో ముందుకుసాగాలని సూచించారు. కరోనా పాజిటివ్ వచ్చినా సవాలును ధైర్యంగా ఎదుర్కోవాలని ఉద్బోధించే కవిత ఇది. ఈ నేపథ్యంలోనే సీఎం పిలుపునకు స్పందించిన కవులు విస్తృతంగా కవిత్వం వెలువరిస్తున్నారు. ఆ కవిత్వ ప్రచురణకు 'నమస్తే తెలంగాణ' దినపత్రిక ముందుకువచ్చి, తన సామాజిక బాధ్యతను నెరవేరుస్తున్నది. సాహిత్య ప్రత్యేక పేజీ 'చెలిమె'లోనే కాకుండా 'సంపాదకీయ పేజీ'లో కూడా కవితలను ప్రచురిస్తుండటం ముదావహం.

గత నెల 9న కొమురవెల్లి అంజయ్య రాసిన 'క..రోనా' అనే కవితతో 'నమస్తే తెలంగాణ' ప్రారంభించింది. 'ఇప్పుడిక చేతులు కడుక్కుందాం/కాళ్లు, మొఖాలు కడుక్కుందాం/ మనల్ని మనమే కడిగేసుకుందాం/ ముఖాలకు మాస్కులేసుకుందాం/ దగ్గినా, తుమ్మినా దాచుకొని తుమ్ముదాం' అంటూ ఈ కవిత ద్వారా అవగాహన కల్పించేందుకు కవి ప్రయత్నించారు. 'శరీరమంతా మాస్కులు ధరించిన/ ఒంటరితనాల వార్డులు రెడీ రెడీ' అనడంలో మనుషులు ఒంటరి అని కాకుండా వార్డులు సైతం ఒంటరివే అంటూ మానవీకరించడం కనబడుతుంది.

'కరోనా క్యా హోనా' అనే వారణాసి భానుమూర్తిరావు కవితలో.. 'జాతి మొత్తం ఏకమై/ కరోనా భూతాన్ని తరిమేద్దాం!/ స్వచ్ఛత, ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ/ వైరస్ లేని సమాజాన్ని నిర్మిద్దాం' అంటూ ఈ కవిత ప్రజలకు పిలుపునిస్తుంది.

'కరుణ లేని కరోనా' అనే కవిత ద్వారా ప్రజల్లో ధైర్యాన్ని ప్రోదిచేసేందుకు డాక్టర్ ఆర్.రమేశ్ ప్రయత్నించారు. 'భయాన్ని వదిలి ధైర్యాన్ని నింపుకో/అపోహల్ని వదిలి నిజాల్ని తెలుసుకో/ జాగరూకతతో మెలిగి/నీ కుటుంబాన్ని, దేశాన్ని కాపాడుకో/ ఆరోగ్యమే మహాభాగ్యం/ పరిశుభ్రతే నీ మంత్రం/ నమస్కారమే మన సంస్కారం' అనే పంక్తులు చక్కటి సందేశాన్ని అందజేస్తాయి.

'ఇప్పుడు/ చేయిచేయి కలపడం కన్నా/చేతుల్ని శుభ్రంగా కడుక్కోవడమే ముఖ్యం/దగ్గరవ్వడం కన్నా/కాస్తంత దూరంగా ఉండటమే మేలు' అంటూ చేతుల పరిశుభ్రతతో పాటు సామాజిక దూరాన్ని పాటించాలని చెప్పే కవిత బిల్ల మహేందర్ రాసిన 'మనిషి దేవుడని ప్రకటిద్దాం'. 'కరోనా 'వైరి'స్' కవితలో 'స్పర్శ వినా బతకలేని మానవుడు/దూరాలను అభ్యాసం చేస్తున్నాడు/అదృశ్య రాకాసిని ఎదుర్కొనే అస్త్రాలు లేక/శూన్యంలో యుద్ధం చేస్తున్నాడు' అని వాస్తవ పరిస్థితిని కవితాత్మకంగా వివరించారు డాక్టర్ ఎన్.గోపి. 'భగవంతుడా../నేనేమైనా పరవాలేదు/ఎంతో జీవితం చూశాను/నా చుట్టూ ఉన్నవాళ్లు బాగుండాలి' అని ఈ కవి పేర్కొనడం పాఠకులను కదిలిస్తుంది.

వైరస్ వ్యాప్తి ఆగిపోవాలని కోరుకునే కవిత డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి రాసిన 'గొలుసు తెగాలె'. అందులో.. 'మనం కదలకుండా ఉంటేనే/దాని గొలుసు భళ్ళున తెగిపోతుంది/మనం చేతులు కలపకుండా ఉంటేనే/దాని సామ్రాజ్యం కూలిపోతుంది/మనం పరిశుభ్రతా మాలను ధరిస్తేనే/అది జారుకుంటుంది' అని పరిశుభ్రతకు ప్రజలు ప్రాముఖ్యం ఇవ్వాలని ఈ కవి సూచించారు.

> కరోనా వ్యాధి విస్తరించకుండా ఉండాలంటే ప్రజల్లో అవగాహన పెంచడం ముఖ్యం. సరైన అవగాహన లేకపోతే ప్రజల్లో అనవసర భయాందోళన ఎక్కువయ్యే అవకాశం ఉన్నది... ఈ నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచేందుకు కవులు, రచయితలు చేసిన కృషి ప్రశంసనీయం.

'హలో' అనే మినీ కవితలో కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి..'ఇంటి నుంచి బయటికి వస్తే/కబర్ లేకుండా చంపేస్తా/ మీరు ఇంట్లోనే ఉంటే/నాకు నేనుగా కనుమరుగై చస్తా' అంటూ తక్కువ పంక్తుల్లో సూటిగా వైరస్ మనస్తత్వాన్ని విశ్లేషించారు.

'నేటి స్వీయ నిర్బంధాలే/రేపటి స్వేచ్ఛకు దుర్భేద్యాలు' అంటూ వివరించిన కవిత గాజుల పవన్ కుమార్ రాసిన 'అజ్ఞాత వాసం'. 'అనుబంధపు ఆలింగన స్పర్శలే/ అణుబాంబుల కన్న/ప్రమాదమనుకోలేదు' అంటూ ప్రస్తుత పరిస్థితిని వివరించే కవిత వి.ప్రకాశ్ రాసి న 'నీ దేహమే శత్రు స్థావరమైతే'.

కరోనాపై ఒకే రోజులో వంద పద్యాలు రాసిన పద్య కవి సిద్దిపేట జిల్లాకు చెందిన బండికాడి అంజయ్యగౌడ్‌తో ఎస్. మల్లారెడ్డి చేసిన ఇంటర్వ్యూను కూడా 'నమస్తే తెలంగాణ ప్రచురించింది. 'జనజాతర తగ్గెను శో/ధన బెరిగెను నిను హరించు దారులు వెదకన్/మనుజులు సంసిద్ధులయిరి/ మనెదవు నీవెట్టులనిక మహిని కరోనా' మొదలైన పద్యాలను ఈ సందర్భంగా ఉదహరించారు.

'రోడ్లు కూడా ఉగ్రంగా మండుతున్నయ్!/రయ్యిరయ్యిన వస్తే/మంటల్లో తగలడిపోతావ్!' అనే సందేశంతో రావులపల్లి సునీత రాసిన కవిత 'ఖబడ్దార్'. 'ఇకనైనా మారండిరా మానవాధముల్లారా!/శుభ్రత పాటిస్తే/పత్తా లేకుండా పరారవుతా/మందు కనిపెడితే/తోక ముడుచుకుంటా' అంటూ వైరస్ మనోభావాలను వెల్లడించిన కవిత ఇందిర వెల్ది రాసిన 'మీ మంచికేనోయ్' బాగుంది. 'కనబడని శత్రువుకు కనబడకుండా/రహస్యమైపోవడమే వ్యూహం' అంటూ లాక్‌డౌన్ వెనుక పాలకుల వ్యూహాన్ని 'రణస్థలి' అనే కవితలో రామా చంద్రమౌళి వివరించారు.

సాహిత్య పేజీ 'చెలిమె', సంపాదకీయ పేజీ ద్వారా కరోనాపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు 'నమస్తే తెలంగాణ' దినపత్రిక చేస్తున్న కృషి ప్రశంసనీయం. విస్తృతస్థాయిలో కరోనా మహమ్మారిపై సృజనాత్మక రచనలు వెలువడేందుకు ప్రేరణగా నిలుస్తున్న ఈ పత్రిక సంపాదకులు అభినందనీయులు.

**- డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు**
**94410 46839**

# ఔన్నత్యమే ఆరాధనీయం






**సద్గురు జగ్గీ వాసుదేవ్**

**భారతీయులలో** చాలామంది శ్రీరాముణ్ణి ఆరాధిస్తారు. కానీ, మీరు అతని జీవిత పరిస్థితులను, తాను నడచిన తీరును గమనిస్తే అదంతా ఓ 'విపత్తుల పరంపర'గా అనిపిస్తుంది. అతను ధర్మబద్ధంగా తనది కావలిసిన సామ్రాజ్యాన్ని కోల్పోయాడు. పైగా, అడవులు పట్టిపోవలసి వచ్చింది. అంతలోనే అతని ధర్మపత్ని అపహరణం. అందుకోసం అతనికి ఇష్టం లేకపోయినా ఒక ఘోర సమరం చేయవలసి వచ్చింది. తన అర్ధాంగిని కాపాడి తిరిగితెచ్చుకోగానే, చుట్టుపక్కల వారందరినుంచి అతిపరుషమైన వ్యాఖ్యానాలను భరించవలసి వచ్చింది. దాంతో తనకు ప్రాణప్రదమైన సహధర్మచారిణిని అడవులలో వదిలిపెట్టాడు. అప్పుడామె నిండు గర్భవతి కూడా. కవలలకు జన్మనీయబోతూ ఉంది. ఆ తర్వాత, తన కన్నబిడ్డలే అని తెలియని పరిస్థితిలో, వారితోనే యుద్ధం చేశాడు. చివరికి తన భార్యను కూడా కోల్పోయాడు. అతని జీవితం ఒక ఎడతెగని విపత్తు. ఇంత జరిగినా, ఎందుకు జనులు రాముణ్ణి ఆరాధిస్తారు?

రాముని ప్రత్యేకత జీవితంలో అతడు ఎదుర్కొన్న పరిస్థితుల్లో లేదు. ఎదురైన విపత్తులలో ఎంత ఉన్నతంగా నడుచుకున్నాడన్న దానిలోనే అతని ఔన్నత్యం ఉన్నది. ఏనాడూ అతనిలో కోపం లేదు. ఎవరినీ నిందించలేదు. గగ్గోలు పెట్టలేదు. అతను అన్ని సందర్భాలలోను ఉదాత్తంగా, హుందాగా నడుచుకున్నాడు. అందువల్లే పవిత్ర జీవనాన్నీ, ముక్తినీ సాధించాలని తపించే వ్యక్తులు రామునిలా జీవించాలని తపిస్తారు. ఎందుకంటే, బాహ్య పరిస్థితులు ఏ క్షణంలోనైనా విషమించగలవని వారు తెలుసుకున్నారు. ఆ విజ్ఞతను వారు పొందారు.

ఎన్నో రకాలుగా జీవిత పరిస్థితులను చక్కదిద్దుకుంటూ ఉన్నా కూడా, బాహ్య పరిస్థితులు ఎప్పుడో ఒకప్పుడు విషమించే ఆస్కారం ఉంటుంది. మీరు అన్నీ సక్రమంగానే నిర్వహించుకోవచ్చు. కానీ, ఒకవేళ తుపాను లాంటి సమస్య వస్తే మాత్రం అది మీ ఇంటిని, మీ సమస్తాన్నీ తుడిచిపెట్టేస్తుంది. 'నాకేమీ అలా జరగదులే' అని అనుకోవడం మూర్ఖంగా బతకటమే అవుతుంది. ఒకవేళ అదే జరిగినా కూడా 'నేను దానిని ధైర్యంగా ఎదుర్కొంటాను' అని అనుకోవడం వివేకవంతమైన జీవనమార్గం. ఈ 'మహత్తరమైన విజ్ఞత' రామునిలో కనిపిస్తుంది. అందుకే, జనులు అతన్ని ఆరాధిస్తారు.

'మీ వద్ద ఎంత ఉంది, మీరేం చేసేవారు, ఏం జరిగింది, ఏం జరగలేదు' ఇవన్నీ ప్రశ్నలు కావు. ఏది జరిగినా, 'మిమల్ని మీరు ఎలా నిలుపుకుంటున్నారు?' అన్నదే అసలు విషయం!



దీనర్థం, మన జీవితాన్ని మనం సక్రమంగా నడుపుకోకూడదనా? కానే కాదు! మనచుట్టూ ఉన్న వ్యవహారాలను చక్కగా సరిదిద్దుకోవాలి. అది అందరికీ మంచిది. అలా ఒక పరిస్థితిని చక్కగా నిర్వహించినప్పటికీ కూడా, మనలో అది తప్పకుండా ఒక అద్భుత భావనను కలిగిస్తుందని చెప్పలేం. కానీ, ప్రతి పరిస్థితిలోనూ మనల్ని మనం మనోజ్ఞంగా నిలబెట్టుకోగలిగినప్పుడు, మనలో అది తప్పకుండా ఒక గొప్ప భావనను కలిగిస్తుంది. ఐనా, అందరి శ్రేయస్సు పట్లా మనకి శ్రద్ధ ఉంది కాబట్టి, మనం ఏ పరిస్థితినైనా సక్రమంగా నిర్వహించాలి.

తన జీవితంలోని పరిస్థితులను చక్కదిద్దటానికి రాముడు ప్రయత్నించాడు.

కానీ, అన్నివేళలా అది వీలు కాలేదు. అనేక విషమ పరిస్థితులనూ అతడు అనుభవిస్తూ వచ్చాడు. అవి నియంత్రణను దాటిపోయాయి. ఇక్కడ ముఖ్యమైన విషయం ఒక్కటే, అతడు అన్నివేళల ఉదాత్తంగా, హుందాగా నడుచుకున్నాడు. ఇదే ఆధ్యాత్మికతలోని మౌలిక సారాంశం. మీ జీవితం ఒక సుందర పరిమళ పుష్పంలా వికసించాలంటే దానికి సానుకూలమైన అంతర్గత పరిస్థితిని కల్పించుకోవాలి. అటువంటి స్థిరమైన అంతర్గత వాతావరణాన్ని మీరు ఎల్లప్పుడూ సృష్టించుకోవాలి. ఇందుకు శ్రీరాముడు ఆదర్శప్రాయుడు. అందుకే ఆయన అందరికీ ఆరాధ్యనీయుడు!

## సరికొత్త కాఫీ ట్రెండ్!

ఇప్పుడు సోషల్ మీడియాలో ట్రెండ్స్‌కి కొదవ లేదు. వాటిలో వంటలకు సంబంధించినవీ ఉన్నాయి. డాల్గోనా కాఫీకి మరీ క్రేజ్ ఎక్కువ. సౌత్ కొరియాలో పుట్టిన ఈ కాఫీ ఇప్పటి వరకు కెఫేలలో మాత్రమే దొరికేది. ఇప్పుడు వంటింట్లో ఎలా చేసుకోవాలో చూపెడుతూ ఎదుటి వారికి చాలెంజ్ విసురుతున్నారు. కాఫీ పొడిలో కొద్దిగా చక్కెర, వేడినీళ్లు పోసి క్రీమ్ అయ్యేంతవరకు గిలక్కొట్టాలి. ఆ తర్వాత పాలను వేడి చేసి గ్లాస్‌లో పోసుకోవాలి. ఇప్పుడు చెంచాతో కొద్దికొద్దిగా క్రీమ్‌ని పాలపై వేస్తుండాలి. పాలతో ఆ కాఫీ క్రీమ్ కలిసిపోకూడదు. అదే కాస్త టెక్నిక్‌తో చేస్తే యమా టేస్టీగా ఉంటుందంటున్నారు కాఫీ ప్రియులు.



ఆపదలో ముందుండి..
ఆనందంలో వెనకుండేవాళ్లు స్త్రీలు.
మహిళలకు చైతన్యమే కాదు..
చేయూత దృక్పథమూ ఎక్కువే.
కష్టకాలంలో కుటుంబంతో పాటు...
సమాజానికీ అండగా నిలుస్తున్నారు.
కరోనా నుంచి మనల్ని కాపాడేందుకు
స్వయం సహాయక సంఘాలుగా కదిలారు.
నాణ్యమైన మాస్కుల తయారీలో
తీరిక లేకుండా ఉన్నారు.



**కరోనా టార్గెట్ మనమే. మానవ సమాజం ఛిన్నాభిన్నమయ్యేలా విజృంభిస్తూనే ఉంది. ఈ గండం నుంచి మనల్ని గట్టెక్కించడానికి డాక్టర్లు.. నర్సులు.. పోలీసులు.. పారిశుద్ధ్య కార్మికులు పోరాడుతున్నారు. వీరితో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలూ కదిలారు. మనకోసం.. వైరస్ వ్యాప్తిని నిరోధించే మాస్కులు తయారు చేస్తున్నారు.**

# 'స్వయం సహాయక' మాస్కులు!

**మాస్క్** వేసుకుంటే కరోనా దరిచేరదనే అభిప్రాయం జనాల్లోకి వెళ్లగానే మాస్కుల తయారీ వేగం పెరిగింది. కానీ అన్నీ నాసిరకం ఉత్పత్తులే. మామూలు పరిస్థితుల్లో పది రూపాయలకు దొరికేవే, కరోనా ప్రభావంతో వంద రూపాయలు పలికాయి. అంత దోపిడి! డబ్బు గురించి ఆలోచించాల్సిన సమయం కాకపోవచ్చు. కానీ కొనుక్కుని ఏం చేసుకుంటాం? అన్నీ యూజ్ అండ్ త్రో రకాలు. ఐదారు గంటలకు మించి వాడరాదు. ఎన్95 మాస్కులు కొనే స్థోమత సామాన్యులకెక్కడిది? సంపాదించుకునేవాళ్లు. సహాయనిధికి సొమ్ములు ఇచ్చేంత స్థోమత లేదు. వాళ్ల ముందు ఉన్నది ఒక్కటే దారి.. నాణ్యమైన మాస్కులు.. గ్లౌసులు.. అందించడమే. నాణ్యమైన సమాజానికి నాణ్యమైన మాస్కులు దొరుకుతున్నాయి, ఎస్‌హెచ్‌జీ మహిళలకు ఉపాధీ లభిస్తున్నది.



**ఆపదలో హీరోలై...**

ఆపద సమయంలో అండగా ఉన్నవారే అసలైన హీరోలు. మాస్కులు.. గ్లౌస్‌లు వేగంగా తయారుచేస్తూ ఎస్‌హెచ్‌జీ మహిళలు కూడా హీరోలు అయ్యారు. అంతా చిన్నచిన్న పనులు చేసుకునేవాళ్లు. రోజుకు వందో.. యాభయ్యో

### మెప్మా పర్యవేక్షణ

మాస్కులు తయారు చేసేందుకు ఆసక్తి ఉన్న మహిళలను గుర్తించింది... మిషన్ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ పావర్టీ ఇన్ మున్సిపల్ ఏరియాస్ (మెప్మా). ఆమేరకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలకు పిలుపునిచ్చింది. లాక్‌డౌన్ వల్ల ఏ ఉపాధీ లేక ఇంట్లో ఖాళీగా కూర్చున్న వందలాది మంది ముందుకొచ్చారు. వారివారి సంఘాల కార్యాలయాల్లో కానీ, ఇంట్లోగానీ మాస్కులు కుడుతూ ప్రభుత్వానికి.. ప్రజలకు వారధిగా నిలుస్తున్నారు.

### 492 సంఘాలు..

రాష్ట్రవ్యాప్తంగా కరోనా మాస్కులు శానిటైజర్ల తయారీలో 492 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయి. సిద్దిపేటలో గరిష్ఠంగా 71 సంఘాలు పనిచేస్తున్నాయి. మాస్కుల తయారీలో కొత్తగూడెం ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారని అధికారులు అంటున్నారు. జిల్లా కో-ఆర్డినేటర్ సుజాత వీరిని సమన్వయం చేస్తుండగా.. కరీంనగర్ యూనిట్ మాస్కుల తయారీని వాణి కో-ఆర్డినేట్ చేస్తున్నారు. ఎస్‌హెచ్‌జీలు తయారుచేస్తున్న కరోనా నిరోధక మాస్కులలో రెండు రకాలు ఉన్నాయి. ఒకటి సింగిల్ లేయర్. మరొకటి డబుల్ లేయర్. సింగిల్ లేయర్ మాస్కుల ధర ఒక్కటి పదిహేను రూపాయలు.

**శాస్త్రీయ పద్ధతిలో..**

నాసిరకం మాస్కుల ద్వారా వ్యాధి సోకకపోవడం మాటేమోగానీ, తేడా వస్తే వైరస్ వ్యాపించే ప్రమాదం ఎక్కువ. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారుచేస్తున్న మాస్కుల వల్ల అలాంటి సమస్యలు రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ గైడ్‌లైన్స్ ప్రకారం అందరికీ ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జూమ్ యాప్ ద్వారా డెమో నిర్వహించారు.

### ఉపాధి మార్గం

మాస్కుల తయారీని మెప్మా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌గా భావిస్తున్నది. డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్. సత్యనారాయణ దీనిని పర్యవేక్షిస్తున్నారు. స్టేట్ కోఆర్డినేటర్ జి. పద్మ అన్ని ఎస్‌హెచ్‌జీలను సమన్వయం చేసుకుంటున్నారు. మెప్మా మెటీరియల్‌ను తీసుకుని... స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్నది. స్వయం సహాయక సంఘాలు పీస్ వర్క్ కింద వీటిని చేస్తున్నాయి. దీనివల్ల డబుల్ లేయర్‌మాస్క్ ఇరవై రెండు రూపాయలు. ఒక్కో గ్రూపు రోజువారీగా కనీసం వెయ్యి మాస్కులు చేస్తున్నాయి. ఇప్పటివరకు నాలుగు లక్షల మాస్కులు సిద్ధం చేశారు. అంటే, నాలుగు లక్షలమంది శ్వాస వ్యవస్థకు రక్షణ కవచాల్ని అందించారు స్వయం సహాయక మహిళలు!

... దాయి శ్రీశైలం



**ఇదో మంచి అవకాశం**

స్వయం సహాయక సంఘాలుగా మేం మా సమస్యల్ని పరిష్కరించుకోవడమే కాదు.. సమాజం శ్రేయస్సు కోసం కూడా కృషి చేస్తాం. మా పనితనాన్ని నిరూపించుకునేందుకు కరోనా రూపంలో ఒక అవకాశం వచ్చింది.

–దీప్తి, రాజశ్రీ స్వశక్తి సంఘం, కరీంనగర్



**మెటీరియల్ అందిస్తున్నా**

ఖమ్మంలోని ఎస్‌హెచ్‌జీలకు మాస్కుల తయారీ కోసం నేను మెటీరియల్ సప్లయ్ చేస్తా. ఆపద సమయంలో చాలా తక్కువ ధరకు మాస్కులు చేస్తున్న మహిళా సభ్యులు అభినందనీయులు.

–భార్గవి, మోక్షిల్ గార్మెంట్స్



**ఆనందం.. బాధ**

కరోనా కోసం మాస్కులు తయారుచేయడం ఒక రకంగా బాధాకరమైన విషయమే. ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా ఏదో ఓ పనిచేస్తున్నందుకు కొంత ఆనందంగా కూడా ఉంది. నిజంగా మాకిది పరీక్షా సమయం.

–ఉమ, శ్రీవినాయక ఎస్‌హెచ్‌జీ, ఖమ్మం

# కంటిద్వారా కరోనా..?

**కంటిమీద,** ముక్కుమీద, నోటిమీద చేతులు పెట్టుకున్నప్పుడు... వాటిద్వారా కొవిడ్–19 శరీరంలోకి ప్రవేశిస్తుంది. అసలు, ఇది కంటి నుంచి శ్వాస వ్యవస్థలోకి ఎలా ప్రవేశిస్తుందన్న సందేహం ఎవరికైనా వస్తుంది. ఇందుకు కారణం కళ్లు, ముక్కు, నోరు... అన్నీ ఒకదానికొకటి అనుసంధానమై ఉండటమే. కంటిలో ఉండే మ్యూకోసా (శ్లేష్మపొర) ద్వారానే వైరస్ లోపలికి ప్రవేశిస్తుంది. ఇది కేంథస్ దగ్గరున్న పింక్ కణజాలం నుంచి మొదలవుతుంది. కరోనా పాజిటివ్ ఉన్న వ్యక్తిని ముట్టుకుని ఆ చేతులతో కళ్లను ముట్టుకున్నా, నలిపినా... చేతులకు ఉన్న వైరస్ మ్యూకోసాలోకి చేరుతుంది. ఇక్కడి నుంచి కంటిలోని నీటిద్వారా లాక్రిమల్ నాళం నుంచి, నేసల్ నాళం



ద్వారా గొంతులోకి చేరుతుంది. మ్యూకోసా దగ్గరుండే పింక్ టిష్యూ అటు నోట్లోని పెదవులతోపాటు ఇటు ముక్కులోపల కూడా ఉంటుంది. కన్ను, ముక్కు, నోరు.. ఈ మూడు చోట్లా పింక్ టిష్యూతోపాటు మ్యూకోసా ఉంటుంది. అందుకే, ఈ మూడు మార్గాల ద్వారా కొవిడ్ గొంతులోకి చేరేందుకు ఆస్కారం ఉంటుంది.

### కాంటాక్ట్ లెన్సులు వాడొచ్చా?

కరోనా వైరస్ విజృంభిస్తున్న సమయంలో కాంటాక్ట్ లెన్సులు వాడటం మంచిది కాదు. ఎందుకంటే లెన్సులు పెట్టుకున్నప్పుడు, తీసినప్పుడు చేతులు కంటికి తగిలే అవకాశాలు ఉన్నాయి. కాబట్టి కళ్లద్దాలు పెట్టుకోవడం మంచిది. కొన్ని ప్రత్యేకమైన పరిస్థితుల్లో... దృష్టిలోపం చాలా ఎక్కువగా ఉన్నవారు, కార్నియాకి సంబంధించిన కెరటోకోనస్ అనే సమస్య ఉన్నవాళ్లు మాత్రమే కాంటాక్ట్ లెన్స్ వాడాల్సి వస్తుంది. అయితే చేతులు శుభ్రంగా కడుక్కొని, తగిన జాగ్రత్తలు తీసుకొన్నాకే వాటిని పెట్టుకోవాలి. తేడా వస్తే ప్రమాదమే.

### చుక్కల మందులు వేసుకోవచ్చా?

గ్లకోమా (నీటి కాసులు) జబ్బు ఉన్నా, కంటిలో నీటి శాతం తక్కువగా ఉండి డ్రై ఐ సమస్య ఉన్నా, శుక్లాల ఆపరేషన్ చేయించుకున్నా, కార్నియాకి సంబంధించిన చుక్కల మందు వాడుతున్నా, కంటి జెల్ వాడుతున్నా... కంటిని ముట్టుకోకుండా కొంత దూరం పైనుండి చుక్కల మందు వాడవచ్చు.

### ఈ లక్షణాలు కనిపిస్తే..

జలుబు, దగ్గు, గొంతునొప్పి, తుమ్ములు, జ్వరంతో పాటు కళ్లు ఎర్రగా అయినా... కంటి నుంచి స్రావాలు కారినా, కళ్లకు దురదలు వచ్చినా... కన్ను, నోరు పొడిబారిపోయినా... కంటిలో రక్తం చిమ్మినా (కంజెక్టివల్ హెమరేజ్)... తప్పనిసరిగా డాక్టర్‌ని కలిసి కొవిడ్–19 పరీక్షలు చేయించుకోవాలి.



**సారికి వెంకట్రావు**
చీఫ్ ఆప్టోమెట్రిస్ట్,
కాంటాక్ట్ లెన్స్ స్పెషలిస్ట్
మాక్సివిజన్ ఐ హాస్పిటల్స్
హైదరాబాద్

## సరుకులిచ్చే చాలెంజ్

మహబూబ్‌నగర్‌కు చెందిన రచన.. హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నది. లాక్‌డౌన్ కారణంగా ఉపాధి కోల్పోయిన ఓ ఆటోడ్రైవర్‌కు నెలకు సరిపడా సరుకులు ఇచ్చింది. అప్పుడే ఓ ఆలోచన వచ్చింది. అతనిలా బాధపడుతున్న ఎన్నో కుటుంబాల కోసం ఏదైనా చేయాలనుకుంది. #LockdownSaviourChallenge పేరుతో సోషల్ మీడియాలో ఓ చాలెంజ్‌ను మొదలెట్టింది. తన స్నేహితులను నామినేట్ చేసింది. ఆర్థికంగా కాస్త మెరుగ్గా ఉన్న మిత్రులు ఆ చాలెంజ్‌ను స్వీకరించారు. వారు కూడా రచనలా నిత్యావసరాలు పంచుతూ, మరికొందరిని నామినేట్ చేస్తున్నారు. ఇలాగైనా మంచిపనులు నలుగురికి తెలిసే అవకాశం ఉందని కొందరు ఫొటోలు సోషల్‌మీడియాలో పోస్టు చేస్తున్నారు. ఇంకొందరు తమకు ప్రచారం అవసరం లేదని సైలెంట్‌గానే సాయం చేస్తున్నారు.





## కాశీలో కరోనా యోగా

లాక్‌డౌన్ కారణంగా నగరానికి 1300 కిలోమీటర్ల దూరాన చిక్కుకొని పోయిన ఓ గృహిణి, ప్రత్యేక పరిస్థితుల్లో యోగా శిక్షకురాలిగా మారిపోయింది. చందానగర్ శివాజీనగర్‌కు చెందిన పద్మ, భవానీశంకర్‌గౌడ్ దంపతులు మరో 68 మందితో కలిసి గత నెల 13న కాశీకి వెళ్లారు. అక్కడే లాక్‌డౌన్‌లో చిక్కుకున్నారు. వారి కష్టాలను తెలుసుకున్న చేవెళ్ల ఎంపి రంజిత్‌రెడ్డి అధికారులతో మాట్లాడి రూ. లక్షతో వారికి వసతితో పాటు భోజన సదుపాయం కూడా కల్పించారు. అయితే లాక్‌డౌన్‌లో భాగంగా 'స్టే హోమ్, స్టే ఫిట్' అంటూ వైద్యులు పిలుపునిస్తున్న నేపథ్యంలో కాశీలో చిక్కుకున్న హైదరాబాద్ యాత్రికులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకునే పనిలో పడ్డారు. చందానగర్ పీజేఆర్ స్టేడియంలో రోజూ యోగా క్లాస్‌కు వెళ్లే అలవాటు ఉన్న పద్మకు యోగా ప్రాణాయామాలపై కొంత పట్టు ఉంది. దీంతో ఆమె తోటి యాత్రికులకు రోజూ ఉదయం, సాయంత్రం యోగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అక్కడున్న వారిలో అధికశాతం వృద్ధులే కావడంతో... పద్మ చెబుతున్న యోగా పాఠాలు వారిలో ఎంతో ఉత్సాహాన్ని నింపుతున్నాయి. 'నాకు తెలిసిన విద్యను నలుగురికీ పంచడానికి ఇలా అవకాశం దొరికింది' అంటారు పద్మ.

## దొంగలున్నారు జాగ్రత్త!

ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకొని సైబర్ నేరగాళ్లు విజృంభిస్తున్నారు. మీకు కరోనా సమాచారం అందిస్తామని, నిర్ధారణ పరీక్షలు చేయిస్తామని, ఫలానా మందులు వాడితే వైరస్‌ను నివారించవచ్చని, ఆన్‌లైన్‌లోనే పరీక్షలు చేయించుకోవచ్చనీ ప్రకటనలు గుప్పిస్తున్నారు. వీటిద్వారా ర్యాన్సమ్ మాల్‌వేర్‌ను మీ మొబైల్‌లోకి పంపుతారు. తర్వాత మీ బ్యాంక్‌ఖాతాలోని డబ్బును లూటీ చేస్తారు. కొన్నిఫేక్ యాప్స్ ద్వారా మీ ఫోన్‌ను నియంత్రణలోకి తీసుకొని తమ పని కానిస్తారు. కరోనావైరస్ యాప్, కరోనావైరస్ మ్యాప్, కరోనా లైవ్1.1, కరోనా వైరస్ ఫైండర్, కరోనా యాప్స్, కొవిడ్19ట్రాకర్... ఇవీ అనధికారికంగా విడుదలైన యాప్స్. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసిన యాప్స్‌ను వాడటం సురక్షితం.



# కరోనాపై.. పోలీస్ సైరన్

**అతడో పోలీస్ ఇన్‌స్పెక్టర్. అందులోనూ ట్రాఫిక్ వింగ్. తీరిక ఉంటుందా?**
**కానీ.. అతడు చేసుకుంటున్నాడు. ఏదో.. కాలక్షేపం కోసం కాదు.**
**కరోనా రక్కసి నుంచి సామాన్యుడిని కాపాడటం కోసం. పాటతో..**
**మాటతో.. కరోనా సందేశమిస్తున్నాడు. ఇంతకూ ఎవరాయన?**



**అంజపల్లి** నాగమల్లు ఎల్బీనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్. సామాజిక బాధ్యత కలిగిన పోలీసుగా ఇతడు కరోనా మహమ్మారి పట్ల మనం ఎలా అప్రమత్తంగా ఉండాలి.. ఆ వైరస్ ఎంత ప్రమాదకరమైంది.. లాక్‌డౌన్‌కు అంతరాయం కలిగించొద్దంటే ఏం చేయాలి?.. తదితర విషయాల మీద సోషల్ మీడియాలో అవగాహన కల్పిస్తూ వీడియోలు పెడుతున్నాడు.

### కరోనాపై పాట

తెలంగాణలో తొలి కరోనా పాజిటివ్ కేసు మార్చి 4వ తేదీన నమోదైంది. అప్పటికి ప్రజలకు కరోనా గురించి పెద్దగా తెలియదు. కానీ ప్రపంచ దేశాలకు కరోనా ఎలా విస్తరిస్తుందో పరిశీలిస్తున్న వ్యక్తిగా నాగమల్లు మార్చి 5వ తేదీనే కరోనా గురించి అవగాహన కల్పిస్తూ పాట రాసి..రికార్డ్ చేసి వీడియోను సోషల్‌మీడియాలో విడుదల చేశారు. 'భయపడవద్దు.. భద్రత పాటిద్దాం. కలిసికట్టుగా కరోనాను అరికట్టేద్దాం' అనే ఆ పాట వైరల్‌గా మారింది.



**కమిషనర్ ప్రోత్సాహం**

మాది సూర్యాపేట జిల్లా నూతన్‌కల్ మండలం శిల్పకుంట్ల గ్రామం. 2008లో ఎస్సైగా ఉద్యోగంలో చేరా. ఒకసారి నల్లగొండలో మూఢనమ్మకాలతో ఒక మహిళను కాల్చి చంపిన ఘటన జరిగింది. ప్రజల్లో మూఢనమ్మకాలపై అవగాహన కల్పించేందుకు నేను నడుముకు కొక్కేలు వేసుకొని టాటా సుమోను లాగాను. అప్పుడు మహేశ్ భగవత్ గారు నల్లగొండ ఎస్పీ. నా గురించి అప్పట్నుంచీ తెలుసు కాబట్టి నన్ను సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నారు.

–నాగమల్లు

### ఆన్‌రోడ్ అవేర్‌నెస్

లాక్‌డౌన్ లేకముందు.. కరోనా చాపకింద నీరులా పాకుతూ వచ్చింది. అప్పుడు మన చేతిలో ఉన్న అస్త్రం ఒక్కటే.. శుభ్రత. చేతులే ఆయుధాలుగా కరోనాతో శాంతియుత పోరాటం ఎలా చేయాలో నాగమల్లు ఆలోచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వేదికగా ఎంచుకుని వాహన చోదకులకు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలో, చేతులను ఎలా శుభ్రం చేసుకోవాలో తెలియజేసి తన బాధ్యతను చాటిచెప్పారు. కరోనా తీవ్రత గురించి ఎక్కువమందికి తెలిసేలా 'ఒగ్గుకథ'ను రికార్డ్‌చేసి యూట్యూబ్‌లో రిలీజ్ చేశారు. దాంతోపాటు మరో కరోనా పాటను కూడా తీసుకొచ్చారు.

### ట్రెయిన్డ్ ఆన్ కరోనా

నాగమల్లును మొదట్నుంచి ప్రోత్సహిస్తున్న రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్.. కరోనాపై పోలీస్ డిపార్ట్‌మెంట్ తరఫున ఎలాంటి కార్యక్రమాలు చేయొచ్చో అతడితో చర్చించారు. సీపీ ఆదేశాల మేరకు నాగమల్లు 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్'లో శిక్షణ తీసుకున్నారు. ట్రెయినింగ్ తర్వాత తన కార్యక్రమాలను మరింత వేగవంతం చేశారు.

### 1000 మందికి భోజనం

రోజూ డ్యూటీ చేస్తూనే కరోనాపై ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తున్నారు నాగమల్లు. లాక్‌డౌన్ వల్ల పేదవారికి.. ఫుట్‌పాత్‌లపై ఉండేవారికి ఆహార సమస్య ఏర్పడుతున్నది. అనాథల్ని ఆకలిబాధ నుంచి తప్పించడానికి తన సొంత ఖర్చుతో సుమారు 1000 మందికి భోజన ఏర్పాట్లు చేశారు.

### కళాబృంద సందేశం

ఒక్క కరోనా సందర్భంగానే కాదు.. నాగమల్లు డిపార్ట్‌మెంట్‌లోకి వచ్చిన నాటినుంచే సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఒక కళాబృందాన్ని ఏర్పాటుచేసి సామాజిక అంశాలపట్ల ప్రజలను చైతన్యపరుస్తున్నారు.

# అల్లరి
ALLARI

## పెద్దల మాట



బలహీనులు ప్రతీకారం
తీర్చుకోవాలనుకుంటారు..
బలవంతులు క్షమిస్తారు..
తెలివైన వారు వదిలేస్తారు.

- అల్బర్ట్ ఐన్‌స్టీన్

## అక్షరాలతో ఆట



1. దర్వాజ కింద భాగం : _డ_
2. కుండ : _డ
3. కుడ్యం : _డ
4. తూర్పు వ్యతిరేక దిక్కు : _డ_ _
5. ఎండవేడి వల్ల తగిలే దెబ్బ : _డ_ _

## జనరల్ నాలెడ్జ్



1. చైనా రాజధాని?
2. మన రాష్ట్ర చేప ?
3. ICRISAT అంటే ఏమిటి, ఎక్కడ ఉంది?
4. శరీరంలో ఆమ్లజని సహిత రక్తాన్ని (మంచిరక్తం) సరఫరా చేసే నాళాలు ఏవి?
5. ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా వాడుకలో ఉన్న సెర్చ్ ఇంజిన్?



## పూర్తి రూపాన్ని రాయండి

1. WHO 2. RNA
3. FRCS 4. PTI

## చుక్కలు కలుపండి



## Count Wisely

One day, king Akbar asked a question in his court that left everyone in the courtroom puzzled. As they all tried to figure out the answer, Birbal walked in and asked what the matter was. They repeated the question to him. his question was, "How many crows are there in the city?" Birbal immediately smiled and went up to Akbar. He announced the answer; he said there were twenty-one thousand, five hundred and twenty-three crows in the city. When asked how he knew the answer, Birbal replied, "Ask your men to count the number of crows. If there are more, then the relatives of the crows must be visiting them from nearby cities. If there are fewer, then the crows from our city must be visiting their relatives who live outside the city." Pleased with the answer, Akbar presented Birbal with a ruby and pearl chain.

Having an explanation for your answer is just as important as having an answer.

Wisely: తెలివైన, courtroom: సభాస్థలం
crows: కాకులు, fewer: తక్కువ
pearl: ముత్యం

## స్టోరీ బాక్స్



# హేళన వద్దు..

కథ



**ఒక ఊరిలో** కిట్టూ అనే అబ్బాయి ఉండేవాడు. అతని తల మీద జుట్టు తక్కువగా ఉండేది. దాంతో చాలా మంది ఏడిపించేవాళ్లు. 'గుండూ.. గుండూ' అంటూ హేళన చేసేవాళ్లు. అందుకే కిట్టూ ఆడుకోవడానికి బయటకు వెళ్లేవాడు కాదు. ఇంటి ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో ఆ ఊరి పిల్లలందరూ ఆడుతూ ఉంటే లోపల నిలబడి చూస్తుండేవాడు. అదే వీధిలో రోజూ సాయంత్రం ఒక తాతగారు నడుచుకుంటూ వెళ్లేవారు. అక్కడ ఆడుకుంటున్న వారిలో ఆకతాయి పిల్లలు ఎంత హేళనగా మాట్లాడినా ఆయన పట్టించుకోకుండా వెళ్లిపోయేవాడు. దాంతో తాతగారికి చెవులు సరిగా వినిపించవని అనుకునేవాళ్లు. అప్పటి నుంచి ఆ దారిలో ఆయన కనిపించగానే 'చెవిటి తాతా'అని అరిచేవారు. ఆయన వినపడనట్టే వెళ్లిపోయేవాడు.

ఒకరోజు కిట్టూ గేటు దగ్గర నిలబడి చూస్తున్నాడు. రోజూ అక్కడ ఆడుకునే పిల్లలు ఎవరూ ఇంకా రాలేదు. రోజు లాగే తాతగారు ఆ వీధిలో నుంచి వెళ్తున్నారు. రోజు ఎవరో ఒకరు ఆ తాతని ఏదో ఒక మాట అనడం గుర్తుకు వచ్చిన కిట్టూ 'చెవిటి తాతా! నీ పేరేంటి?'అని అరిచాడు. వెంటనే ఆ తాత కిట్టు దగ్గరకు వచ్చి 'నా పేరు రాఘవయ్య'అని చెప్పాడు. కిట్టూ ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. భయంగా లోపలికి పారిపోబోయాడు. అప్పుడు రాఘవయ్య కిట్టూ భుజం పట్టుకొని. 'చూడు బాబూ! వాళ్లు హేళన చేస్తారనే కదా నువ్వు ఆడుకోవడానికి వెళ్లడం లేదు. మరి నువ్వు కూడా వాళ్లలాగే ప్రవర్తిస్తే ఎలా? నాకు చెవుడు లేదు. ఒకవేళ ఉన్నా కూడా ఎవరేమన్నా పట్టించుకోను. కానీ అందరూ నాలాగా ఉండరు కదా! నీలాగా బాధ పడేవాళ్లు కూడా ఉంటారు. కాబట్టి హేళనగా మాట్లాడటం మంచిది కాదు. ఇదంతా నీతో మాత్రమే ఎందుకు చెప్తున్నానంటే, నువు మంచి పిల్లాడివి. మంచి విషయాలు చెబితే అర్థం చేసుకునే మనసు ఉందని నా నమ్మకం'అని రాఘవయ్య వెళ్లిపోయాడు. ఆయన చెప్పింది బాగా నచ్చింది కిట్టూకి. ఆ రోజు నుంచి కిట్టూ ఎవరినీ తక్కువ చేసి మాట్లాడలేదు. ఎవరేమన్నా పట్టించుకోకుండా ధైర్యంగా బయటికి వెళ్లి ఆడుకోవడం మొదలు పెట్టాడు.

## మ్యాప్ పాయింటింగ్



పక్కనున్న చిత్రపటంలో వివిధ భాగాలను గుర్తించండి.

1. మస్తిష్కం
2. మెడుల్లా అబ్లాంగేట
3. చిన్న మెదడు
4. వెన్నుపాము
5. పిట్యూటరీ గ్రంథి

## జర నవ్వుకో!

**రాము:** మూలధనం అంటే ఏంటో తెలుసా?
**సోము:** నీకు అది కూడా తెలీదేంట్రా.. ధనాన్ని బీరువా లోంచి తీసి మూలలో పోస్తే.. దాన్నే మూలధనం అంటారు.

***

'ఇతరులు చేయలేని ఏదైనా పనిని మీరు చేయగలరా..?' అడిగాడు సురేష్.
'నా చేతి రాతను నేనే చదవగలను..' తాపీగా బదులిచ్చాడు నీరజ్.

## జవాబులు

**అక్షరాలతో ఆట:**
1.గడప 2.కడవ 3. గోడ
4. పడమర 5వడదెబ్బ

**జనరల్ నాలెడ్జ్:**
1.బీజింగ్ 2.కొర మీను
3. ఇంటర్నేషనల్ క్రాప్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఫర్ సెమి-ఎరిడ్ ట్రాపిక్స్
4. ధమనులు 5. గూగుల్

**పూర్తి పదాన్ని రాయండి:**
1. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్
2. రైబోన్యూక్లిక్ ఆమ్లం
3. ఫెలోషిప్ ఆఫ్ ద రాయల్ కాలేజెస్ ఆఫ్ సర్జన్
4. ద ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా

## దారి కనుక్కోండి




# చిత్రం

## ఐదు భాషల్లో 'స్టేహోమ్'



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

**భా**రతీయ సినిమాలోని అన్ని భాషల నటులు కలిసి చేసిన 'ఫ్యామిలీ' అనే షార్ట్‌ఫిల్మ్ ఇటీవల విశేష ప్రాచుర్యాన్ని పొందింది. కరోనా మహమ్మారిని తుదముట్టించే సంకల్పాన్ని ప్రోదిచేస్తూ స్వీయ నిర్బంధం అవశ్యకతను తెలియజేస్తూ రూపొందించిన ఆ షార్ట్ ఫిల్మ్‌లో అమితాబ్, మోహన్‌లాల్, చిరంజీవి వంటి అగ్ర తారలు భాగమయ్యారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని దక్షిణాది భాషల్లోని ప్రముఖ బుల్లితెర నటులందరూ కలిసి 'స్టేహోమ్' పేరుతో ఓ లఘు చిత్రాన్ని రూపొందించారు. కరోనా లాక్‌డౌన్ టైమ్‌లో ఇంట్లో ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తూ తెరకెక్కించిన ఈ షార్ట్ ఫిల్మ్ సందేశాత్మకంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంతో పాటు పరుచూరి గోపాలకృష్ణ టీవీ నటులు యమున, జయలలిత, హరిత, శుభలేఖ సుధాకర్, ప్రభాకర్, సమీర్, అర్చన, సాయికిరణ్, రవి, అలీరెజా, ఆటో రామ్‌ప్రసాద్, గెటప్ శ్రీను, బాలాదిత్య, అన్నురెడ్డి వంటి 34 మంది దక్షిణాది బుల్లితెర నటీనటులు ఇందులో నటించారు. 29 మొబైల్ కెమెరాలతో ఐదు భాషల్లో ఈ షార్ట్‌ఫిల్మ్‌ను తెరకెక్కించారు. రవికిరణ్ దర్శకత్వం వహించిన ఈ లఘు చిత్రంలో తారలు వారివారి ఇళ్లలోనే ఉండి నటించారు.

## కరోనా కౌగిట మృత్యు ఒడి చేరకు



వందేమాతరం శ్రీనివాస్

**వి**నరా వినరా సోదరా వినకుంటే ఇళ్లు ఆగమైతది కదరా.. కంటికి కనబడని కరోనా ప్రపంచాన విలయ తాండవం ఆడుతుందిరా.. గడపదాటి కాలు బయటపెట్టకు.. సోపతోళ్ల చెంత చేరి రోడ్డు మీద తిరగకు..ఆదమరచి కరచాలనం చేయకు.. కరోనా కౌగిట పడి మృత్యు ఒడి చేరకు' అంటూ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్ పాట ద్వారా కరోనా వైరస్ పట్ల ప్రజల్ని అప్రమత్తం చేశారు. కోట్లు ఉన్నా ప్రాణం కాపాడలేమని, వేలాది ప్రాణాలను తీస్తూ కరోనా మహమ్మారి కలవరపెడుతున్నదని, సూది మందు లేని ఈ రోగం వలన మనిషి బ్రతుకు చెల్లాచెదురైపోతుందనే సందేశాన్ని ఈ గీతంలో తెలియజేశారు. వందేమాతరం శ్రీనివాస్ సంగీతాన్ని అందిస్తూ ఆలపించిన ఈ పాట ప్రతి ఒక్కరిలో ఆలోచనను రేకెత్తిస్తోంది. సుక్క రామ్ నరసయ్య సాహిత్యాన్ని అందించారు.



కాజల్ అగర్వాల్



తనయుడు మహాధన్, కుమార్తె మోక్షదతో రవితేజ



గారాల తనయ సితారతో మహేష్‌బాబు

## కుటుంబంతో సరదాగా..

**సి**నిమా చిత్రీకరణలు, ఇతర ప్రచార కార్యక్రమాలతో ఏడాదంతా తీరిక లేకుండా బిజీగా ఉంటారు అగ్రతారలు. వారికి విరామం అరుదనే చెప్పాలి. కరోనా ప్రభావంతో ప్రస్తుతం సినిమా షూటింగ్‌లు రద్దు కావడంతో స్టార్స్ మొత్తం ఇళ్లకే పరిమితమయ్యారు. ఈ విరామాన్ని భార్యాపిల్లలతో సరదాగా గడుపుతున్నారు. ఈ మధురానుభూతుల తాలూకూ జ్ఞాపకాల్ని సామాజిక మాధ్యమాల ద్వారా అభిమానులతో పంచుకుంటున్నారు. మహేష్‌బాబు తన కూతురు సితారతో కలిసి నవ్వుల్ని చిందిస్తున్న ఫొటోను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఇంట్లో ఉండే ప్రతిక్షణం ఓ మధురజ్ఞాపకమని ఆయన పేర్కొన్నారు. రవితేజ తన పిల్లలతో లాక్‌డౌన్ టైమ్‌ను ఆస్వాదిస్తున్నారు. ఈ స్టార్స్ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## పవన్‌తో వన్స్‌మోర్

**పో**టీ తత్వానికి దూరంగా ఉంటుంది పంజాబీ సోయగం కాజల్ అగర్వాల్. నెంబర్‌గేమ్‌పై తనకు అస్సలు నమ్మకం లేదని చెబుతుంది. దాదాపు పదహారేళ్లుగా చిత్రసీమలో ప్రయాణం సాగిస్తున్న ఈ సుందరికి యువతరంలో క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. పలు భారీ సినిమాల్లో ఈ అమ్మడిని కథానాయికగా ఎంచుకుంటున్నారు. ఇప్పటికే చిరంజీవి సరసన 'ఆచార్య'చిత్రంలో నాయికగా ఛాన్స్ దక్కించుకుంది. కొరటాల శివ దర్శకుడు. కరోనా ప్రభావంతో షూటింగ్ వాయిదా పడింది. ఇదిలావుండగా కాజల్ అగర్వాల్ తెలుగులో మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకుందని తెలిసింది. వివరాల్లోకి వెళితే..అటు రాజకీయాలతో పాటు ఇటు సినీరంగంలో కూడా బిజీ అయ్యారు పవన్‌కల్యాణ్. ఆయన కథానాయకుడిగా 'వకీల్‌సాబ్' చిత్రం ఆరంభమైన విషయం తెలిసిందే. ఈ సినిమాతో పాటు క్రిష్ దర్శకత్వంలో ఓ చిత్రం, హరీష్‌శంకర్ డైరెక్షన్‌లో మరో సినిమాకు పవన్‌కల్యాణ్ అంగీకరించిన విషయం తెలిసిందే. పవన్‌కల్యాణ్-హరీష్‌శంకర్ కలయికలో గతంలో 'గబ్బర్‌సింగ్' వంటి భారీ కమర్షియల్ హిట్ చిత్రం వచ్చింది. దాంతో వీరిద్దరి ద్వితీయ కాంబినేషన్‌పై అభిమానుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో కథానాయికగా కాజల్ అగర్వాల్‌ను ఖరారు చేసినట్లు తెలిసింది. గతంలో పవన్‌కల్యాణ్‌తో కలిసి 'సర్దార్ గబ్బర్‌సింగ్' చిత్రంలో నటించింది కాజల్‌అగర్వాల్. వీరిద్దరు మరోమారు జోడి కట్టబోతుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.



కరోనాను అరికట్టేందుకు చేస్తున్న పోరులో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడుతున్న పోలీసుల త్యాగానికి, స్ఫూర్తికి ప్రతి ఒక్కరూ జేజేలు పలుకుతున్నారు. పోలీసుల స్వీయరక్షణ కోసం వారికి శానిటైజర్లు, మాస్కులను పంపిణీచేశారు హీరో శ్రీకాంత్. రాయదుర్గం పోలీసులతో పాటు సామాన్యులకు ఆదివారం శానిటైజర్లను అందజేశారాయన. ప్రతి ఒక్కరూ ఇంట్లోనే ఉండి కరోనాను నివారించాలని శ్రీకాంత్ పిలుపునిచ్చారు.

## కుటుంబానికి చేయకు నమ్మకద్రోహం



జొన్నవిత్తుల

**క**రోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు సినీ నటులు, గాయనీగాయకులు వివిధ మాధ్యమాల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. గాయకుడు శ్రీకృష్ణ, గేయరచయిత జొన్నవిత్తుల కరోనా లక్షణాలు ఉన్న వారు స్వచ్ఛందంగా ఆసుపత్రులకు రావాలని పాట ద్వారా పిలుపునిచ్చారు. 'ఇది అంతా నీవల్లే జరుగుతుందిరా. జరగకుండా కళ్లు తెరిచి ఇంట్లోనే వుండరా. నీకు నువ్వే చేసుకోకు జీవితద్రోహం. నీ కుటుంబానికి చేయకు నమ్మకద్రోహం. రోగం ఉండి చెప్పకుంటే సాంఘికద్రోహం. రోడ్డు మీద తిరగడమే దేశద్రోహం. దీనంగా ఘోరంగా చావకురా. స్వచ్ఛందంగా నువ్వే ఆసుపత్రికిరా' అంటూ కరోనా మహమ్మారిని నిర్మూలించడంలో ప్రజల బాధ్యతను గుర్తుచేశారు. హైదరాబాద్ పోలీస్ శాఖ సౌజన్యంతో స్వరపరచిన ఈ పాట ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించేలా ఉందని టాలీవుడ్ అగ్ర నటులు చిరంజీవి,నాగార్జున పేర్కొన్నారు.



ఆర్డరిస్తే ఇళ్ల వద్దకే నిత్యావసరాలు, పండ్లు, కూరగాయలు

# డోర్ డెలివరీ

- కరోనా ప్రభావిత ప్రాంతాల్లో కరీం'నగర పాలక సంస్థ' సేవలు
- అందుబాటులోకి మొబైల్ కూరగాయల వాహనాలు
- ముందుకు వస్తున్న పలు ప్రైవేట్ సంస్థలు
- వినియోగదారులకు ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు

***లాక్‌డౌన్‌తో** ఇళ్ల నుంచి బయటకు రాలేకపోతున్నారా..? నిత్యావసర సరుకులు ఎలా తెచ్చుకోవాలని ఆలోచిస్తున్నారా..? కూరగాయలు లేదా పండ్లు లేవని చింతిస్తున్నారా..? మరేం ఆందోళన చెందాల్సిన అవసరం లేదు! మీరు ఆర్డర్ చేస్తే మీ ఇంటి వద్దకే నిత్యావసరాలు, కూరగాయలు, పండ్లు వస్తాయి! కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో ఈ తరహా సేవలు ఇప్పటికే అందుబాటులోకి రాగా, పలు ప్రైవేట్ సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి. వినియోగదారులకు ప్రత్యేకంగా ఫోన్ నంబర్లు ఇస్తూ, ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డోర్ డెలివరీ చేస్తున్నాయి.*

**- కార్పొరేషన్, నమస్తే తెలంగాణ**

**కరీం'నగరం'లో మొబైల్ మార్కెట్లు..**

నగర పాలక సంస్థ పరిధిలో ప్రజలను ఇండ్ల నుంచి బయటకు రాకుండా చూస్తున్నారు. నిత్యావసరాలు, కూరగాయలు ఇండ్ల వద్దకే చేరేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల ఒకటి నుంచి పలు డివిజన్లలో మొబైల్ కూరగాయల వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. 1, 2 డివిజన్ల పరిధిలోని అపోలో దవాఖాన, విద్యారణ్యపురి, బుట్టిరాజరాం కాలనీ వాసులు 9849895829 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అలాగే 9, 31 డివిజన్ల పరిధిలోని పోచమ్మవాడ, కోతిరాంపూర్, అలకాపురికాలనీ, లక్ష్మీనగర్ వాసులు 9963865677లో.. 17, 39 పరిధిలోని విద్యానగర్, రేకుర్తి, హిందుపురికాలనీల ప్రజలు 9618811564లో.. 40, 33 డివిజన్లలోని వావిలాలపల్లి, బ్యాంకు కాలనీ, మెహర్‌నగర్, భగత్‌నగర్, గోదాంగడ్డ ప్రజలు 8500066486లో.. 58, 59 డివిజన్లలోని జ్యోతినగర్ వాసులు 6302494802 నంబర్‌లో సంప్రదించాలని అధికారులు కోరుతున్నారు.

**నగరంలో ముందుకొచ్చిన ప్రైవేట్ సంస్థలు..**

ఇంటి వద్దకే నిత్యావసర సరుకులు అందించేందుకు నగరంలో పలు ప్రైవేట్ సంస్థలు కూడా ముందుకు వచ్చాయి. ఈ మేరకు నగరపాలక సంస్థ అధికారులను సంప్రదించి, తాము డోర్ డెలివరీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపాయి. వాటికి సంబంధించి వివరాలను కూడా అధికారులు ప్రకటించారు.

- 'స్పెన్సర్స్' సంస్థ ఉదయం 6నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు సేవలందిస్తున్నది. 9717888371, 9390732811, 9949366140 నంబర్లలో సంప్రదించవచ్చు.
- 'మై సిటీ సర్వీస్' సంస్థ కూడా ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డోర్ డెలివరీ సదుపాయాన్ని కల్పించింది. 7842847886లో ఆర్డర్ చేయవచ్చు.
- పండ్లు, కూరగాయల కోసం 'ఎఫ్2హెచ్ సర్వీస్' వారు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సేవలందిస్తున్నారు. 9030662999లో లేదా WWW.f2hknr.in లో సంప్రదించవచ్చు
- 'రిలయన్స్ స్మార్ట్' సంస్థ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు డోర్ డెలివరీ చేస్తున్నది. 9398735983, 9676991623లో లేదా www.reliancesmart.inలో సంప్రదించవచ్చు.
- 'డీ మార్ట్' సంస్థ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు డోర్ డెలివరీ సదుపాయాన్ని కల్పిస్తున్నది. https://play.google.com/store/apps/details?id=in.dmartలో వివరాలు ఎంట్రీ చేస్తే, ఇంటి వద్దకే సామగ్రి పంపిస్తున్నది.
- 'స్టోర్ ఫ్రంట్' సంస్థ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు డోర్ డెలివరీ అందిస్తున్నది. https://play.google.com/store/apps/details?id=com.vainsn.storefrontలో సంప్రదించవచ్చు.

**రామగుండంలోనూ సేవలు..**

**గోదావరిఖని టౌన్:** పారిశ్రామిక ప్రాంతమైన రామగుండంలోనూ హోం డెలివరీ సేవలను అందిస్తున్నారు. ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఉదయ్‌కుమార్ కోరారు. నిత్యావసర సరుకుల కోసం ఎన్టీపీసీలోని సూపర్ మార్కెట్ (9705908967), మార్కండేయ కాలనీలో రాధాకృష్ణ సూపర్ మార్కెట్ (9849537838), ఎల్‌జీఎస్ సూపర్ మార్కెట్ (9550950893), ఏబీ సూపర్ మార్కెట్ (9550479349), ఎస్‌వీ సూపర్ మార్కెట్ (8341400505 0), అశోక సూపర్ మార్కెట్ (9849838590), అడ్డగుంటపల్లిలోని సిరిచందన సూపర్ మార్కెట్ (9949757142)ను సంప్రదించాలని ఆయన సూచించారు.





*రామడుగు: దేశరాజ్‌పల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్*

## అన్నదాత క్షేమంగా ఉండాలి

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

**రామడుగు:** అన్నదాత క్షేమంగా ఉండాలన్నదే తెలంగాణ సర్కారు ధ్యేయమని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. రామడుగు, కొక్కెరకుంట వ్యవసాయ సహకార సంఘం పరిధి గోపాల్‌రావుపేట, దత్తోజిపేట, షానగర్, కొక్కెరకుంట, దేశరాజ్‌పల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రాలకు వచ్చేటప్పుడు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రామడుగు, కొక్కెరకుంట సింగిల్‌విండో చైర్మన్లు వీర్ల వెంకటేశ్వరరావు, ఒంటెల మురళీకృష్ణారెడ్డి, ఎంపీపీ కలిగేటి కవిత, ఏఎంసీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, తదితరులున్నారు.



*కరీంనగర్‌లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది*

## కంటైన్మెంట్‌లో వైద్య పరీక్షలు

- కరోనా ప్రభావిత ప్రాంతాల్లో ఇంటింటికీ ప్రత్యేక బృందాలు
- కరీంనగర్‌లో 2,709 మందికి..
- హుజూరాబాద్‌లో 4,588 మందికి టెస్టులు

**కరీంనగర్ హెల్త్/హుజూరాబాద్:** కరోనా నియంత్రిత (కంటైన్మెంట్) ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యబృందాలు పర్యటిస్తున్నాయి. ఇంటింటికీ వెళ్లి పరీక్షలు చేస్తున్నాయి. ఆదివారం కరీంనగర్‌లోని పలు ప్రభావిత ప్రాంతాల్లో 12 వైద్య బృందాలు 662 ఇండ్లలో 2,709 మందికి, హుజూరాబాద్‌లో 24 బృందాలు కలిసి 1,515 గృహాల్లోని 4,588 మందికి స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించాయి. వీరిలో ఎవరికి ఎలాంటి వ్యాధి లక్షణాలూ లేవని డీఎంఅండ్‌హెచ్‌వో జీ సుజాత స్పష్టం చేశారు. గృహ నిర్బంధంలో ఉన్న వారు ఇంట్లోనే ఉండాలని, బయట తిరగరాదని, 14 రోజులు క్వారంటైన్ పూర్తయ్యే వరకు అధికారులకు సహకరించాలని ఆమె కోరారు.

## నిబంధనలు పాటించాలి

- సిరిసిల్ల కలెక్టర్ కృష్ణభాస్కర్

**సిరిసిల్ల కలెక్టరేట్ :** కరోనా వైరస్ నియంత్రణకు ప్రభుత్వం విడుదల చేసిన నిబంధనలను ప్రజలు విధిగా పాటించాలని కలెక్టర్ కృష్ణభాస్కర్ కోరారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన 'జిల్లా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ కమిటీ' సమావేశంలో ఆయన మాట్లాడారు. కరోనా నేపథ్యంలో 59 మందికి పరీక్షలు నిర్వహించగా ఒకరికి పాజిటివ్, 58 మందికి నెగెటివ్ వచ్చిందని వెల్లడించారు. 4,998 మంది వలస కార్మికులకు 12 కేజీల చొప్పున రేషన్ బియ్యం, ₹500 నగదును అందించామని తెలిపారు. జిల్లాలో 173,065 తెల్ల రేషన్‌కార్డుదారులుండగా, 1,56,405 మందికి రేషన్ అందించామని, మిగిలిన వారికి ఈ నెల 15 లోగా పంపిణీ చేస్తామన్నారు. ఉజ్వల స్కీం కింద 19,951 కనెక్షన్లు ఉండగా, వారిలో 2,781 మంది బుక్ చేసుకున్నారని, 1,896 మందికి గ్యాస్ సిలిండర్లు డెలివరీ చేశామని చెప్పారు. ముందస్తు జాగ్రత్తలపై అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు.

# పాడి రైతుల ఔదార్యం

- కరీంనగర్ డెయిరీ ₹15 లక్షల వితరణ
- 3 వేల మందికి తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు
- అందజేసిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్
- స్ఫూర్తిగా నిలిచిన చైర్మన్ సీహెచ్ రాజేశ్వర్‌రావు
- ఇదివరకే సీఎం రిలీఫ్ ఫండ్‌కు ₹10 లక్షల విరాళం



*బల్దియా కార్యాలయ ఆవరణలో పారిశుధ్య కార్మికురాలికి సరుకులను అందజేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి గంగుల, తదితరులు*

**కరీంనగర్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన అసహాయులపై కరీంనగర్ జిల్లా పాడి రైతులు ఔదార్యం చూపారు. ఇప్పటికే డెయిరీ ఉద్యోగులు ఒక రోజు వేతనం ₹10లక్షలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు చైర్మన్ రాజేశ్వర్‌రావు అందించారు. తాజాగా ఆయన పిలుపు మేరకు డెయిరీ పరిధిలోని పాల సేకరణ కేంద్రాల్లోని 70 వేల మంది సభ్యులు ₹15 లక్షలు విరాళంగా అందించారు. ఈ మొత్తంతో నగరంలోని 3 వేల మంది ఆటో డ్రైవర్లు, నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు, వైద్య సిబ్బందికి మంచి నూనె, పప్పులు, చింత పండు, ఉప్మా రవ్వ, కారంపొడి ఇలా తొమ్మిది రకాల నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఆదివారం డెయిరీ ఆధ్వర్యంలో నిత్యావసరాలను రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కరోనా నివారణకు కరీంనగర్ డెయిరీ తన వంతు కృషిగా పేదలకు సహాయం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో మరిన్ని సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపుతో రాష్ట్రంలోని అనేక సంస్థలు ముందుకు వచ్చి పేదలను ఆదుకుంటున్నాయని తెలిపారు. కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావును ప్రత్యేకంగా అభినందించారు. చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, నగర మేయర్ సునీల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

**ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి..**

**కరీంనగర్‌రూరల్:** భవిష్యత్‌లో కరోనా పాజిటివ్ వచ్చిన రోగులు దవాఖానకు వస్తే ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, ముందస్తుగా సిద్ధంగా ఉండాలని ప్రతిమ దవాఖాన నిర్వాహకులకు వినోద్‌కుమార్ సూచించారు. ఆయన మంత్రి గంగులతో కలిసి ప్రతిమ దవాఖానను సందర్శించారు. ఐసొలేషన్ వార్డులో ఏర్పాటు చేసిన 30 బెడ్స్‌ను పరిశీలించారు. కలెక్టర్ శశాంక, వైద్యశాల సీఏవో రామచంద్రరావు, వైద్యశాల డీన్ వివేకానంద్, డైరెక్టర్ డాక్టర్ అమిత్‌కుమార్‌తో ఏర్పాట్లపై చర్చించారు.

# ఇంటికే నిత్యావసర సరుకులు

- పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



*పెద్దపల్లి జంక్షన్ : ఆటో డ్రైవర్లకు నిత్యావసర సరుకులను అందిస్తున్న ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి*

**పెద్దపల్లి రూరల్ /పెద్దపల్లి జంక్షన్/జూలపల్లి :** పెద్దపల్లి హెల్పింగ్ హ్యాండ్స్ ద్వారా నిత్యావసర సరుకులను నిరుపేదల ఇండ్లకే పంపిస్తామని ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు. పెద్దపల్లి పట్టణంలోని రాందేవ్ బాబా ఆలయ ఆవరణలో నిత్యావసర సరుకుల ప్యాకింగ్‌ను ఆయన ఆదివారం పరిశీలించారు. లాక్‌డౌన్ నేపథ్యంలో నిరుపేదలు పస్తులుండొద్దని పెద్దపల్లి 'హెల్పింగ్ హ్యాండ్స్' ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గంలో మొదటి విడుతగా దాదాపు 10వేలకుపైగా నిరుపేదలకు నిత్యావసర సరుకులు అందిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే వెంట పెద్దపల్లి ఏసీపీ హబీబ్‌ఖాన్, సీఐ ప్రదీప్ కుమార్, ఎస్ఐ ఉపేందర్‌రావు, కౌన్సిలర్ కృష్ణమూర్తి, వ్యాపారి బాలకిషన్ జకోటియా, కొట్టె సదానందం ఉన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్‌కు స్వచ్ఛంద సంస్థకు స్థానిక వ్యాపారి మాదాడి సంపత్‌రెడ్డి ₹ 10 వేల విరాళం అందజేశారు. నల్లా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, టీఆర్ఎస్ నాయకుడు నల్లా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్దపల్లి నియోజకవర్గంలోని దాదాపు 3 వేల మంది ఆటో డ్రైవర్లకు వారానికి సరిపడా బియ్యంతో పాటు నిత్యావసర సరుకులను అందించే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జూలపల్లి, ఎలిగేడు మండలాల్లోని 430 మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు సామాజిక కార్యకర్త నాంపెల్లి స్వామి సహకారంతో నిత్యావసర సరుకుల ప్యాకెట్లు అందజేశారు. సింగిల్ విండో అధ్యక్షుడు పుల్లూరి వేణుగోపాల్ రావు, ఆటో యూనియన్ మండలాధ్యక్షుడు బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



*పెద్దపల్లి జంక్షన్: పంపిణీకి సిద్ధంగా నిత్యావసర సరుకుల సంచులు*



*సిరిసిల్ల పట్టణం (డ్రోన్ వ్యూ)*

# నిశీధి వేళ సిరిశాల

కనిపించని జనాలు.. వాహనాల రొద లేని దారులు.. సప్పుడు లేని కూడళ్లు.. ఎటుచూసినా నిర్మానుష్యం! లాక్‌డౌన్‌తో నిశ్శబ్ద వాతావరణం! ఇదీ కార్మిక క్షేత్రం సిరిసిల్ల పరిస్థితి! రాత్రివేళ వెలుగులు విరజిమ్ముతూ, సరికొత్తగా కనిపిస్తున్నది. పర్యవేక్షణలో భాగంగా జిల్లా పోలీస్‌శాఖ తీసిన డ్రోన్ చిత్రాలు సుందరంగా కనిపిస్తున్నవి.

**- సిరిసిల్లక్రైం**



*గాంధీ చౌరస్తా*



*అంబేద్కర్ చౌరస్తా*



*అంబేద్కర్ చౌరస్తాలో కళాకారులు వేసిన చిత్రం*

## సేవ(కు)లకు సలాం

- ఆకట్టుకుంటున్న కళాకారుల చిత్రాలు
- కలెక్టర్ కృష్ణభాస్కర్ అభినందనలు

'లాక్‌డౌన్ పాటిద్దాం.. కరోనాను తరిమేద్దాం.. సమదూరం పాటిద్దాం.. పోలీసులకు సహకరిద్దాం' అంటూ చిత్రకళాకార్మిక సంఘం కళాకారులు సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వేసిన చిత్రాలు ఆలోచింపజేస్తున్నాయి. పోలీసులు, వైద్యులు, పారిశుధ్య కార్మికుల సేవలకు పాదాభివందనాలు తెలుపుతూ అంబేద్కర్ చౌరస్తాలో గీసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ చిత్రాన్ని కలెక్టర్ కృష్ణభాస్కర్, సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ తిలకించి, కళాకారులను అభినందించారు. గుండెల్లి రాజేశం, మేర్గు సత్యనారాయణ, వడ్డెపల్లి సత్యం, వెంగళ గణేష్, చౌకి శ్రీనివాస్, నజీర్, పూర్ణచందర్, తదితరులు పాల్గొన్నారు.

**- సిరిసిల్ల టౌన్**

## సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళం అందించిన వారి వివరాలు



*గోదావరిఖని : ఎమ్మెల్యే కోరుకంటికి ₹లక్ష విరాళం అందజేస్తున్న రాజస్థాని చారిటబుల్ ట్రస్టు సభ్యులు*

- రాజస్థాని చారిటబుల్ ట్రస్టు గోదావరిఖని) ₹లక్ష
- వైఎంసీఏ వెల్ ఆఫ్ కరీంనగర్ ₹60 వేలు
- పెద్దపల్లి వ్యాపారి మాదాడి సంపత్‌రెడ్డి ₹10 వేలు

## ❖ ఏదీ సామాజిక స్ఫూర్తి?

లాక్‌డౌన్ నేపథ్యంలో కోరుట్ల పట్టణంలోని కూరగాయల మార్కెట్, కిరాణా షాపులు రెండు రోజులకోసారి తెరుస్తుండడంతో రద్దీ ఎక్కువగా ఉంటున్నది. ఆదివారం విక్రయాలు ప్రారంభించగా జనం ఎగబడ్డారు. సామాజిక దూరాన్ని పాటించడాన్ని విస్మరించారు. దీంతో అధికారులు రోజు విడిచి రోజు కాకుండా నిత్యం ఉదయం 7నుంచి 10గంటల వరకు విక్రయాలు కొనసాగేలా ఆదేశాలు జారీ చేశారు.

**- కోరుట్ల టౌన్**



## మాస్క్ ధరించనందుకు జరిమానా

**మంచిర్యాల రూరల్ (హాజీపూర్) :** మాస్క్ లేకుండా హాజీపూర్ మండలంలోని గుడిపేట గ్రామం నుంచి దొనబండకు వచ్చిన పచ్చునూరి ఆంజనేయులుకు రూ.500 జరిమానాను సర్పంచ్ జాడి సత్యం ఆధ్వర్యంలో విధించారు. ఈ మేరకు అతనికి రసీదును గ్రామ పంచాయతీ బిల్ కలెక్టర్ అందజేశారు.



*రసీదును అందజేస్తున్న పంచాయతీ బిల్ కలెక్టర్*

# సామాజిక సేవకులు

లాక్‌డౌన్‌తో ఉపాధి కోల్పోయిన పేదలు, కూలీలకు సామాజిక సేవకులు అండగా నిలుస్తున్నారు. ఆకలి తీర్చడంతోపాటు నిత్యావసర సరుకులు అందిస్తున్నారు. కూరగాయలు, నగదు అందిస్తూ, మానవత్వం చాటుతున్నారు.

■ పేదలు, కూలీలకు సాయం



నగరంలో కార్మికులు, నిరుపేదలకు ఆహారం అందిస్తున్న విశాఖ శారదా పీఠం భక్తులు



అల్ఫోర్స్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో చేపట్టిన నిత్యావసరాల పంపిణీలో పాల్గొన్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



నగర పాలక సంస్థ కార్మికులకు నిత్యావసర వస్తువులను అందిస్తున్న మేయర్ సునీల్‌రావు, శ్రీపాల్ రెడ్డి



కార్మికులకు నిత్యావసర సరుకులు అందిస్తున్న సీపీ కమలాసన్‌రెడ్డి

*కరీంనగర్ జిల్లా..*

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ/ చొప్పదండి, నమస్తే తెలంగాణ/తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ/కరీంనగర్ క్రైం/కరీంనగర్ రూరల్/ మానకొండూర్ రూరల్/తిమ్మాపూర్ రూరల్/శంకరపట్నం/హుజూరాబాద్ టౌన్/ఇల్లందకుంట:** టవర్‌సర్కిల్ ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి సహకారంతో సీపీ కమలాసన్‌రెడ్డి నగరంలోని మేదరివాడ, తిరుమలనగర్, విఘ్నేశ్వరనగర్ ప్రాంతాల్లోని 60 కుటుంబాలకు నిత్యావసరాలు పంపి ణీ చేశారు. వన్‌టౌన్ సీఐ విజయ్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ ఉన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ సహ సంఘచాలక్ చక్రవర్తుల రమణాచారి ఆధ్వర్యంలో ఆరెపల్లిలో గుడిసెవాసులకు 15 రోజులకు సరిపడా నిత్యావసరాలను పంపిణీ చేశారు. 22వ డివిజన్‌లోని 15 మంది పారిశుధ్య కార్మికులు, పేదలకు యూఎస్ కన్‌స్ట్రక్టెడ్ ప్రాపర్టీస్ ప్రతినిధి శ్రీరంగనాయకుల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో 29 వస్తువులతో కూడిన ప్యాకెట్లను అందజేశారు. కార్పొరేటర్ గంట కల్యాణి ఆధ్వర్యంలో తన డివిజన్‌లోని 30 మంది పేదలకు కూరగాయలు అందజేశారు. విశాఖ శారదాపీఠం భక్తులు నగరంలోని 120 మందికిపైగా నిరుపేదలు, వలస కార్మికులకు భోజనం అందించారు. పీఠాధిపతి స్వరూపానందేంద్ర, స్వాత్మానందేంద్రస్వాముల ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నగరంలోని బైపాస్ రోడ్డులోని హస్నాపూర్‌లో అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వంద మంది పేదలకు నిత్యావసరాలు సమకూర్చగా, అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ హాజరై, పంపిణీ చేశారు. మంకమ్మతోటలోని సిద్ధార్థ స్కూల్ ఆవరణలో మున్సిపల్ కార్మికులు, పేదలకు మేయర్ నిత్యావసరాలు అందజేశారు. రేకుర్తిలో వృద్ధులకు బీజేపీ దళిత మోర్చా అధికారప్రతినిధి దుర్గం మారుతి నిత్యావసరాలు అందజేశారు. కొత్తపల్లిలో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 20 మంది వలస కూలీలకు సరుకులు పంపిణీ చేశారు. 200 మంది మున్సిపల్ సిబ్బందికి రాగిజావ అందజేశారు. కరీంనగర్‌లోని గీతాభవన్ వద్ద వైకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ రూరల్ ఎస్ఐ శ్రీనివాస్‌రావు ప్రజలకు మాస్కులు పంపిణీ చేశారు. ఎస్ఐ స్వరూప్‌రాజ్ ఉన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ 7వ డివిజన్ పరిధి సదాశివపల్లిలో 'రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 70 మంది వలస కూలీలకు తాసిల్దార్ రాజయ్య చేతుల మీదుగా నిత్యావసరాలను పంపిణీ చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ పరిధి 8వ డివిజన్ పారిశుధ్య సిబ్బందికి శాతవాహన లయన్స్ క్లబ్ డైరెక్టర్ లయన్ జగదీశ్వరాచారి నిత్యావసరాలను సమకూర్చగా, తిమ్మాపూర్ సర్కిల్ సీఐ మహేశ్‌గౌడ్, ఎల్ఎండీ ఎస్ఐ నరేశ్‌రెడ్డి, కార్పొరేటర్ సల్ల శారద రవీందర్ హాజరై, పంపిణీ చేశారు. జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్టు సభ్యులు సిరికొండ ప్రభాకర్‌రావు సహకారంతో కార్పొరేటర్ గుగ్గిళ్ల జయశ్రీ 20 మందికి ఆహార ప్యాకెట్లను అందించారు. తిరుమల నగర్‌లో 100 మంది నిరుపేదలకు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు, వాల్మీకి విద్యా సంస్థల అధినేత యాదగిరి శేఖర్‌రావు నిత్యావసరాలను పంపిణీ చేశారు. విద్యానగర్‌లో 200 మంది పేదలకు నాయకులు తిరుపతి, రాజేందర్ అన్నదానం చేశారు. అంబాల్‌పూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలను అందజేశారు. తిమ్మాపూర్



నిత్యావసరాలను పంపిణీ చేస్తున్న యూఎస్ కన్‌స్ట్రక్టెడ్ ప్రాపర్టీస్ ప్రతినిధులు

పంచాయతీ సిబ్బంది, కార్మికులు 16 మందికి రామకృష్ణకాలనీ సర్పంచ్ మీసాల అంజయ్య ఒక్కొక్కరికీ 25 కిలోల బియ్యం బ్యాగులను అందజేశారు. చొప్పదండిలోని సాయిబాబా ఆలయ మహిళా సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు మూడు రోజులకు సరిపడా నిత్యవసరాలను పంపిణీ చేశారు. హోలీషాలోమ్ చర్చి ఫాస్టర్ శాంతికుమార్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని నిరుపేద కుటుంబాలకు సరుకులు అందజేశారు. హుజూరాబాద్‌లోని శ్రీరామనగర్ కాలనీకి చెందిన ఆడెపు రవీందర్–రాజేశ్వరి దంపతులు, వారి కుమారుడు వంశీకృష్ణ, మరో ముగ్గురి సాయంతో వలస కూలీలకు క్వింటాల్ బియ్యం, రూ.6వేల నిత్యావసరాలను సమకూర్చగా, కౌన్సిలర్ రమాదేవి, టీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్ పంపిణీ చేశారు. దాత దయానంద్ సాయంతో 15వ, 16వ వార్డులో ప్రజలకు కౌన్సిలర్లు రమాదేవి, సుశీల మాస్కులను అందజేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో 400 మంది వలస కార్మికులు, బాటసారులు, మతిస్థిమితం లేనివారికి నాయకులు అన్నం ప్యాకెట్లు అందజేశారు. కనగర్తిలో సర్పంచ్ మట్ట రజిత ఆధ్వర్యంలో 60మంది నిరుపేదలకు నిత్యావసరాలను అందించారు. ఇక్కడ ఎస్ఐ ప్రీతిసుధ ఉన్నారు.

*సిరిసిల్ల జిల్లా..*

**సిరిసిల్ల రూరల్ / సిరిసిల్ల టౌన్ /చందుర్తి/కోనరావుపేట/ ఎల్లారెడ్డిపేట/ఇల్లంతకుంట :** చీర్లవంచలో 45 మంది వలస కార్మికులకు నిత్యావసర సరుకులను విద్యార్థి ప్రజ్ఞ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు రవికిరణ్ రెడ్డి, సభ్యులు అందజేశారు. అదేగ్రామంలో సర్పంచ్ జక్కుల రవీందర్ ఆధ్వర్యంలో 40 మంది వలస కార్మికులకు ఒక్కొక్కరికి 12 కిలోల బియ్యం, ₹500 నగదును సిరిసిల్ల సెస్ చైర్మన్ దోర్నాల లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. సిరిసిల్లలోని 3వ వార్డులో డీఎస్పీ చంద్రశేఖర్‌తో కలిసి మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ శానిటైజర్లు, మాస్కులను పంపిణీ చేశారు. గాజుల మల్లయ్య కల్యాణ మండపంలో అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో రేషన్‌కార్డు లేని పేదలకు నిత్యావసర సరుకులను అందజేశారు. తన పుట్టిన రోజు సందర్భంగా సర్పంచ్ చిలుక అంజిబాబు మూడపల్లిలో పారిశుధ్య కార్మికులకు బట్టలు, పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అలాగే చందుర్తి ఠాణాలో ఎస్ఐ సునీల్‌కు, పోలీస్ సిబ్బందికి శానిటైజర్లను అందించారు. కొలనూర్‌లో ఒక్కొక్కరికి ₹800 విలువైన బియ్యం, నిత్యావసరాలను 35 కుటుంబాలకు సర్పంచ్ తుమ్మల యమున, ఎంపీటీసీ ప్రవీణ్ చేతుల మీదుగా అందజేశారు. మల్కపేటలో రోజువారి నలుగురు కూలీలకు గుడిపాటి బాపురెడ్డి 80 కిలోల బియ్యాన్ని సర్పంచ్ ఆరె లత చేతుల మీదుగా పంపిణీ చేశారు. నిజామాబాద్‌లోని ఆయుర్వేద దవాఖాన ఫార్మసిస్ట్ రాణి, ఆమె భర్త, కూతురు పేద కుటుంబాలకు ₹4వేలు అందించినట్లు సర్పంచ్ అరుణరెడ్డి తెలిపారు. రాజన్న గొల్లపల్లిలో సర్పంచ్ బొజ్జ వసంత, మల్లేశం దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఇంటికి రెండు చొప్పున 250 మాస్కులను ఎంపీపీ చంద్రయ్య అందజేశారు. వార్డు సభ్యులు మామిండ్ల కైలాసం ఇంటింటికీ కూరగాయలు అందించారు. అల్మాస్‌పూర్‌కు చెందిన ఒక్కో కుటుంబానికి 25 కిలోల బియ్యం, ₹1500 చొప్పున నాలుగు పారిశుధ్య కా ర్మిక కుటుంబాలకు, 12 కిలోల బియ్యం, ₹500 చొప్పున సర్పంచ్ పుష్పల, ఆర్‌బీఎస్ కో ఆర్డినేటర్ శంకర్, ఎంపీపీ పిల్లిరేణుక చేతులమీదుగా 38 పేద కుటుంబాలకు అందించారు. ఎల్లారెడ్డిపేటలోని బీసీ కాలనీలో పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి ₹7 వేలతో నిత్యావసర సరుకులను అందించారు. గొల్లపల్లిలో నాలుగు ఆశ కార్యకర్తల కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గొర్రె ఆది మల్లేశ్ తన కొడుకు సాయి చేతులమీదుగా అందించారు. అలాగే, 18 మంది పారిశుధ్య కార్మికులకు ₹5 వేలు, 40 మంది పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఇల్లంతకుంటకు చెందిన రాజేశ్వర శర్మ 40 కిలోలు, బిల్లా రఘువీర్ క్వింటాల్ బియ్యాన్ని నిరుపేదలకు అందజేశారు. తిప్పారపు సురేశ్ పేదలకు 50కిలోల బియ్యంతో పాటు కూరగాయలు, పారిశుధ్య కార్మికులకు ₹1000 అందజేశారు.



సిరిసిల్ల టౌన్ : సిరిసిల్లలోని 3వ వార్డులో స్థానికులకు మాస్కులు, శానిటైజర్లు అందజేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ, డీఎస్పీ



తెలంగాణ చౌక్‌లో ఆహార ప్యాకెట్లను అందజేస్తున్న యువకులు



సిరిసిల్ల రూరల్ : చీర్లవంచలో కార్మికులకు నిత్యావసర సరుకులను అందజేస్తున్న విద్యార్థి ప్రజ్ఞ వెల్ఫేర్‌సభ్యులు



ఎల్లారెడ్డిపేట : గొల్లపల్లిలో ఆశ కార్యకర్తలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందిస్తున్న నాయకులు



హుజూరాబాద్ టౌన్: హాట్ స్పాట్ ప్రాంతాల్లో వీఆర్వోలు, వీఆర్ఏలకు విధులు కేటాయిస్తున్న ఆర్డీవో, మున్సిపల్ పాలకవర్గం

## కంటైన్మెంట్ ఏరియాల సందర్శన

**హుజూరాబాద్ టౌన్:** హుజూరాబాద్ పట్టణంలోని కంటైన్మెంట్ క్లస్టర్ల ఏరియాలను హుజూరాబాద్ ఆర్డీవో బెన్‌షాలోం ఆదివారం పరిశీలించారు. డివిజన్‌లోని ఐదు మండలాలకు చెందిన వీఆర్ఏలకు డ్యూటీలు కేటాయించారు. అనంతరం కౌన్సిలర్లను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హాట్‌స్పాట్ కేంద్రాలైన కాకతీయకాలనీ, గాంధీనగర్, మామిండ్లవాడ, విద్యానగర్, సిద్ధార్థనగర్‌లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి నిత్యావసరాలు అందించారు. ప్రజలు బయటకు రాకుండా హెల్త్ సూపర్‌వైజర్ రమేశ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పర్యవేక్షించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



బోయినపల్లి : విలాసాగర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ వేణుగోపాల్

**బోయినపల్లి :** విలాసాగర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్ ప్రారంభించారు. డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సర్పంచ్ జూలపల్లి స్వప్నాంజలి, ఉపసర్పంచ్ బండారి రాములు, టీఆర్ఎస్ నాయకులు జూలపల్లి అంజన్‌రావు, సింగిల్‌విండో డైరెక్టర్లు, తదితరులున్నారు. కోరెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్‌విండో చైర్మన్ తీపిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రారంభించారు. దుంద్రపల్లి, అనంతపల్లి, మల్కాపూర్ గ్రామాల్లోనూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సీఈవో బాపురెడ్డి, డైరెక్టర్లు హన్మాండ్లు, స్వామిరెడ్డి, రాధ, రమణా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ❖ పక్షుల దాహం తీర్చేందుకు..



సిరిసిల్ల టౌన్ : డివైడర్ల మధ్యలో ఏర్పాటు చేసిన తొట్టెల్లో నీరు పోస్తున్న మున్సిపల్ కమిషనర్

**సిరిసిల్ల టౌన్:** వేసవిలో పక్షుల దాహం తీర్చేందుకు సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ వెల్దండి సమ్మయ్య వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా కేంద్రంలోని డివైడర్ల మధ్య ఏర్పాటు చేసిన చెట్లపై ప్రత్యేకంగా తయారుచేసిన నీటి తొట్టెలను కలెక్టర్ కృష్ణభాస్కర్ ఆదేశాలతో ఏర్పాటు చేశారు. రోజూ వీటిలో నీళ్లు పోయాలని సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు.

## అనుమతి లేకుండా చేపలు పడితే చర్యలు'

**కరీంనగర్ రూరల్ :** కొత్తపల్లి మండలంలోని చెరువుల్లో అనుమతి లేనిదే చేపలు పట్టరాదని తాసిల్దార్ స్పష్టం చేశారు. కరోనా నేపథ్యంలో గుంపులు, గుంపులుగా వెళ్లి చేపలు పట్టరాదని, రాష్ట్ర ప్రభుత్వం విధించిన లాక్‌డౌన్ నిబంధనలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఒకరోజు ఐదుగురికి మాత్రమే చేపలు పట్టుకునేందుకు అవకాశం ఇస్తామని, ఇందు కోసం రోజుకు ఐదుగురికి అనుమతి ఇవ్వాలని కోరుతూ సంబంధిత ఎస్ఐ, తాసిల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించి గుంపులుగా వెళ్లి చేపలు పట్టేందుకు ప్రయత్నిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు..

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**కార్పొరేషన్, నమస్తే తెలంగాణ :** మరమ్మతు పనుల కారణంగా సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ టౌన్ అంజయ్య తెలిపారు. 11కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని శివనగర్, రాంనగర్, ప్రగతినగర్, మార్కండేయనగర్, సప్తగిరికాలనీ, టెలిఫోన్ క్వార్టర్స్ ప్రాంతాల్లో, 11కేవీ శ్రీరాంనగర్ కాలనీ ఫీడర్ పరిధిలోని శ్రీరాంనగర్‌కాలనీ, ఆదిత్యనగర్, కొత్తయాస్వాడ, హరిహరనగర్, విద్యానగర్, సాలంపుర ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. అలాగే, ఉదయం 8.30 నుంచి ఉదయం 11 గంటల వరకు కిసాన్ నగర్, కాన్‌పుర, హుస్సేనిపుర, శర్మనగర్, శివాజీనగర్, ఆదర్శనగర్, బుట్టిరాజారాం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని చెప్పారు.

## మున్సిపల్ సిబ్బందికి వ్యక్తిగత రక్షణ కిట్లు



వేములవాడ : వ్యక్తిగత రక్షణ కిట్లను ధరించిన సిబ్బంది

**వేములవాడ, నమస్తే తెలంగాణ:** వేములవాడ పురపాలక సంఘం పరిధిలో విధులు నిర్వహిస్తున్న 25 మంది పారిశుధ్య, ఐసోలేషన్ వార్డులో సిబ్బందికి వ్యక్తిగత రక్షణ కిట్లను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. కంటైన్మెంట్ ప్రాంతంలోని వారికి అవసరమైన వస్తువులు, సిబ్బందికి గ్లాస్ మాస్క్‌లను ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

## జిల్లా సరిహద్దుల్లో బారికేడ్లు



సిరిసిల్ల రూరల్ : తంగళ్లపల్లి మండలం రామచంద్రాపూర్–జక్కాపూర్ రూట్‌లో బారికేడ్లతో మూసివేసిన పోలీసులు

**సిరిసిల్ల రూరల్ :** తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జిల్లా సరిహద్దు గ్రామాల శివారుల నుంచి సిద్దిపేట జిల్లాకు వెళ్లే దారులన్నింటినీ పోలీసులు మూసివేశారు. ఆదివారం ఎస్ఐ అభిలాష్ ఆధ్వర్యంలో తంగళ్లపల్లి మండలం ఇందిరానగర్–ఇబ్రహీంపూర్, జిల్లెల్ల –మాటిల్ల, జిల్లెల్ల చెక్‌పోస్ట్–జక్కాపూర్, జిల్లెల్ల గ్రామం–జక్కాపూర్, రామచంద్రాపూర్–జక్కాపూర్, రామచంద్రాపూర్ గ్రామం–జక్కాపూర్ దారుల్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. రాకపోకలను నిషేధించారు.

## కొనసాగుతున్న నిత్యాన్నదానం



బోయినపల్లి : కొదురుపాకలో అన్నం వడ్డిస్తున్న టీఆర్ఎస్ నాయకులు

**బోయినపల్లి :** ఎంపీ జోగినపల్లి సంతోశ్ కుమార్ స్వగ్రామమైన కొదురుపాకలో నిత్యాన్నదానం కొనసాగుతున్నది. ఐదోరోజు ఆదివారం 200 మంది వలస కూలీలకు అన్నదానం చేశారు. టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కత్తెరపాక కొండయ్య, మాజీ ఎంపీటీసీ బొల్లవేణి భాను శ్రీ, నాయకులు చిక్కాల సుధాకర్‌రావు, బొల్లవేని తిరుపతి యాదవ్, ఒద్దెల మహేందర్, నాగుల నాగరాజు, తదితరులున్నారు.

## గంజాయి పట్టివేత



స్వాధీనం చేసుకున్న గంజాయి

**కోనరావుపేట :** ద్విచక్ర వాహనంపై గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను పోలీసులు పట్టుకున్నారు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో చందుర్తి సీఐ వెంకటేశ్ వివరాలను వెల్లడించారు. మర్తనపేటలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్ఐ పర్శరాములు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. సిరిసిల్లకు చెందిన వొల్లాల సాయికృష్ణ (21), ఇప్పకాయల వినోద్ (21)ల గర్జనపల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి సిరిసిల్ల వైపు ద్విచక్రవాహనంపై వస్తున్నారు. పోలీసులను చూసి కొద్దిదూరంలో ఆగి, పారిపోయే ప్రయత్నం చేశారు. గమనించిన కానిస్టేబుళ్లు జనార్దన్, నాగరాజు వారిని వెంబడించి పట్టుకున్నారు. సుమారు ₹11వేల విలువైన 600 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. వీరికి గర్జనపల్లిలో విక్రయించిన సంబంధిత వ్యక్తులను కూడా గుర్తించి అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

## సోడియం హైపో క్లోరైట్ ద్రావణం పిచికారీ



చందుర్తి : జోగాపూర్‌లో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని స్ప్రే చేస్తున్న సెస్ డైరెక్టర్ అల్లాడి రమేశ్

**చందుర్తి :** జోగాపూర్‌లో ఆదివారం సెస్ డైరెక్టర్ అల్లాడి రమేశ్ తన సొంత ఖర్చులతో మిషన్ ద్వారా వీధుల్లో సోడియం హైపోక్లోరైట్ ద్రావణాన్ని పిచికారీ చేయించారు. సర్పంచ్ మ్యాకల పర్శరాములు, ఎంపీటీసీ మ్యా కల గణేశ్, వట్టెంల కనుకయ్య, తదితరులున్నారు.

## దండం పెడుతా.. బయటకు రావద్దు

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** లాక్ డౌన్ ఉల్లంఘించి ప్రజలెవరూ బయటకు రావద్దని మున్సిపల్ అధ్యక్షురాలు జిందం కళ, డీఈ వెంకటశేషయ్య కోరారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వారు సిరిసిల్ల పట్టణంలో పర్యటించి లాక్‌డౌన్ అమలు తీరును పరిశీలించారు. కూరగాయలు, మాంసం విక్రయాల మార్కెట్ వద్ద సామాజిక దూరం పాటించేలా మార్కులు వేయించారు. బయటకు రావద్దంటూ వాహనాలపై వెళ్లే వారికి దండం పెడుతూ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన లాక్‌డౌన్‌ను విజయవంతం చేయాలని, పోలీసులు, అధికారులకు ప్రజలు సహకరించాలని అధ్యక్షురాలు కళ కోరారు.

## లాక్‌డౌన్‌కు సహకరించాలి

**వీర్నపల్లి :** లాక్ డౌన్‌కు ప్రజలు సహకరించాలని డీఎస్పీ చంద్రశేఖర్ కోరారు. ఆదివారం మండలకేంద్రంలో వ్యాపారులు, ప్రజాప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. సిరిసిల్లలో ₹1500కు 22 రకాల నిత్యావసర సరుకులు అందిస్తున్నట్లు తెలిపారు. వీర్నపల్లిలోనూ అందించాలని సూచించారు. ఎంపీపీ మాలోత్ భూల, ఆర్‌బీఎస్ మండల కన్వీనర్ ఎడ్ల సాగర్, సీఐ సర్వర్, ఎస్ఐలు రామచంద్రం, అభిలాశ్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## చింతచెట్టు దిగుతూ మృత్యుఒడికి

■ తిమ్మాపూర్‌లో మహిళ మృతి

**తిమ్మాపూర్ రూరల్:** చింతకాయలు కొట్టి, చెట్టు దిగుతుండగా ఓ మహిళ జారి కిందపడి మృతి చెందింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శేరి పద్మ(45) ఆమె భర్త ఓదెలు, ఆమె సోదరుడు, వదినలతో కలిసి గ్రామంలోని మామిడికుంట వద్ద చింతచెట్టుకు ఉన్న చింతకాయలు కొట్టేందుకు వెళ్లారు. పద్మ, ఆమె సోదరుడు చెట్టు ఎక్కి చింతకాయ దులిపి, దిగుతుండగా పద్మ ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడింది. దీంతో తీవ్రగాయాలైన పద్మను 108లో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఎల్ఎండీ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో, ట్రైనీ ఐపీఎస్ నితికాపంత్ తెలిపారు.

## ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరి మృతి

**బోయినపల్లి :** శాభాష్‌పల్లి హైలెవల్ వంతెనపై ఆదివారం ఓ ద్విచక్రవాహనదారుడు అదుపుతప్పి పడి మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. అనుపురం ఆర్ అండ్‌ఆర్ కాలనీకి చెందిన కొండపల్లి రవీందర్ రావు(45) తన ఇంటివద్ద కిరాణాషాపు నడుపుతున్నాడు. టీవీఎస్ ఎక్సెల్‌పై కరీంనగర్‌లోని కిరాణాషాపులో సరుకులు తీసుకువచ్చేందుకు వెళ్తున్నాడు. శాభాష్‌పల్లి హైలెవల్ వంతెన వద్దకురాగానే అదుపుతప్పి కింద పడిపోయాడు. పోలీసులు 108 వాహనంలో కరీంనగర్‌లోని ఓ దవాఖానకు తరలించగా, అక్కడ పరిస్థితి విషమించి మృతి చెందాడు. రవీందర్‌రావు భార్య పద్మ ఫిర్యాదు మేరకు వేములవాడ రూరల్ సీఐ నవీన్ కుమార్ కేసు నమోదు చేసుకున్నారు.


నమస్తే తెలంగాణ
CLASSIFIED
BUSINESS OPPRTUNITY
★ఇంట్లోనే ఉండి తక్కువ పెట్టుబడితో డబ్బులు సంపాదించుకునే సౌకర్యము ఈ సదావకాశాన్ని వినియోగించుకోండి.
Ph: 9381157359
NT-252880

అర్జెంటుగా సూపర్‌వైజర్స్ కావలెను
★మీ జిల్లాలలో ప్రముఖ కంపెనీలలో పనిచేయుటకు హెల్పర్స్, ప్యాకర్స్, టీం లీడర్స్, సూ||వైజర్స్ స్త్రీ/పు|| కావలెను. Q: 5th- డిగ్రీ, జీ: 16-18 వేలు, అనుభవం అవసరం లేదు. రూం+ భో|| ఫ్రీ. ఫోన్: 8790796771.
NT-000

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం.
4 లైన్ల ప్రకటన కేవలం 150/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 40/- మాత్రమే
3+1 స్కీం కలదు
GST 5% వర్తించును
ప్రకటనల విభాగం
9182 777 571
9182 777 194

# వాణిజ్య

**వెన్‌కాబ్ చికెన్ ధరలు (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 85.00 | రిటైల్ లైవ్ | 107.00 |
| డ్రెస్‌డ్ | 155.00 | స్కిన్‌లెస్ | 177.00 |

**గుడ్ల ధరలు (వందకు)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 365.00 | వరంగల్ | 368.00 |
| మెదక్ | 365.00 | కరీంనగర్ | 368.00 |
| రంగారెడ్డి | 365.00 | డజన్ ధర | 54.00 |

# కరోనా దెబ్బకు జీడీపీ ధమాల్

## ఈ ఆర్థిక సంవత్సరం 1.5-2.8 శాతం మధ్యే

## గత 30 ఏండ్లలో ఇదే అత్యల్పం

## తాజా నివేదికలో ప్రపంచ బ్యాంకు అంచనా




(ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ)

**భారత** ఆర్థిక వృద్ధిరేటుపై కరోనా వైరస్ ప్రభావం అధికంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు అభిప్రాయపడింది. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధిరేటు 1.5 శాతం నుంచి 2.8 శాతం మేరకు నమోదుకావచ్చని పేర్కొన్నది. 1991లో ఆర్థిక సరళీకరణ మొదలైన తర్వాత భారత్‌లో అత్యల్ప వృద్ధిరేటు ఇదేనని ఆదివారం విడుదల చేసిన 'సౌత్ ఏషియా ఎకనమిక్ ఫోకస్ రిపోర్ట్'లో ప్రపంచ బ్యాంకు స్పష్టం చేసింది. గత ఆర్థిక సంవత్సరం (2019-20)లో భారత ఆర్థిక వృద్ధిరేటు 4.8 శాతం నుంచి 5 శాతం మేరకు ఉండవచ్చని అంచనా వేసింది. గతేడాది అక్టోబర్‌లో ప్రపంచ బ్యాంకు అంచనా వేసిన వృద్ధిరేటు కంటే ఇది 1.2-1 శాతం తక్కువగా ఉండటం గమనార్హం. ఆర్థిక రంగంలో నెలకొన్న బలహీనతల వల్ల భారత వృద్ధిరేటు ఇప్పటికే మందగమనంలో కొనసాగుతున్నదని, ఇలాంటి తరుణంలో కొవిడ్-19 మహమ్మారి విజృంభించడం దేశ ఆర్థిక వ్యవస్థకు మరింత పెద్ద గుదిబండలా మారిందని ప్రపంచ బ్యాంకు తన నివేదికలో పేర్కొన్నది. కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించడంతో అనేక కర్మాగారాలు, వ్యాపారాలు మూతపడ్డాయి. విమాన, రైలు, రోడ్డు రవాణా వ్యవస్థలు స్తంభించిపోవడం వల్ల సరుకు రవాణా గణనీయంగా తగ్గడం, సరఫరా, డిమాండ్ భారీగా తగ్గిపోవడంతో ఈ ఏడాది వృద్ధిరేటు మరింత దిగజారుతుందని ప్రపంచ బ్యాంకు అభిప్రాయపడింది. ముఖ్యంగా సేవల రంగానికి తీవ్ర నష్టం వాటిల్లవచ్చని, అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ప్రతికూలతల వల్ల దేశీయ పెట్టుబడుల్లో జాప్యం జరుగవచ్చని తెలిపింది. అయితే వచ్చే ఆర్థిక సంవత్సరం (2021-22)లో దేశ వృద్ధిరేటు 5 శాతానికి పుంజుకోవచ్చని, అప్పటికి కొవిడ్-19 ప్రభావం పూర్తిగా తగ్గిపోతుందని అభిప్రాయపడింది. కాగా, ఈ ఏడాది భారత జీడీపీ వృద్ధిరేటు 4 శాతానికి క్షీణిస్తుందని ఆసియా అభివృద్ధి బ్యాంకు, 2 శాతానికి పతనమవుతుందని ఫిచ్ రేటింగ్స్, 3.5 శాతానికి దిగజారుతుందని ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్, 3.6 శాతానికి తగ్గుతుందని ఇండియా రేటింగ్స్ అండ్ రిసెర్చ్, 2.5 శాతానికి పతనమవుతుందని మూడీస్ ప్రకటించాయి.

### 40 ఏండ్ల కనిష్ఠానికి దక్షిణాసియా వృద్ధిరేటు

**కరోనా** కాటుతో దక్షిణాసియా ఆర్థిక పరిస్థితి క్షీణించే ప్రమాదమున్నదని ప్రపంచ బ్యాంకు పేర్కొన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణాసియా జీడీపీ వృద్ధిరేటు కేవలం 1.8 నుంచి 2.8 శాతం మధ్యే పరిమితం కావచ్చని అంచనా వేసింది. గత 40 ఏండ్లలో ఇదే అత్యల్ప వృద్ధిరేటని తెలిపింది. దక్షిణాసియాలో భారత్‌తోపాటు శ్రీలంక, నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, అఫ్గానిస్థాన్, మాల్దీవులు ఉన్నాయి. ఈ ఏడాది దక్షిణాసియా జీడీపీ వృద్ధిరేటు 6.3 శాతంగా ఉండవచ్చని గతేడాది అక్టోబర్‌లో అంచనా వేసింది. కానీ కరోనా సంక్షోభం ముంచుకురావడంతో ప్రస్తుతం ప్రపంచ బ్యాంకు తన అంచనాను గణనీయంగా కుదించింది. ఈసారి చైనా జీడీపీ కూడా దారుణంగా క్షీణిస్తుందని పేర్కొన్నది. ప్రపంచ జీడీపీలో 16 శాతంగా ఉన్న చైనా వాటా ఇప్పటికే 6 శాతానికి పడిపోయింది. ముమ్మందు ఇది 5 శాతానికి దిగజారుతుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది.

### లాక్‌డౌన్ ఎక్కువకాలం కొనసాగితే..



**లాక్‌డౌన్** ఎక్కువ కాలం కొనసాగితే భారత జీడీపీ వృద్ధిరేటు మా అంచనాల కంటే మరింత దిగజారవచ్చు. ప్రస్తుతానికి భారత ప్రభుత్వం కరోనా వైరస్ వ్యాప్తిని కట్టడి చేయడంపైనే దృష్టిసారించాలి. ఆర్థిక వ్యవస్థ తిరిగి పుంజుకొనేందుకు దోహదపడే చర్యలపై ప్రభుత్వం దృష్టిసారించాలి. తాత్కాలికంగా ఉద్యోగాలు కల్పించడం లాంటి ప్రయత్నాలు భారత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తాయి. దీంతోపాటు సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు మూతపడకుండా ప్రభుత్వం జాగ్రత్తపడాలి. దీర్ఘకాలంలో భారత్‌ను ఆర్థికంగా, సామాజికంగా సుస్థిరమైన మార్గంలో పెట్టేందుకు ఇది మంచి అవకాశం.

**- హాన్స్ టిమ్మర్, ప్రపంచ బ్యాంకు ముఖ్య ఆర్థికవేత్త (దక్షిణాసియా)**

నేడు తెలంగాణ

## బాండ్ల వేలం?

### రెండు వేల కోట్ల నిధుల సమీకరణ

**కరోనా** మహమ్మారిని తరిమికొట్టేందుకు అత్యంత పకడ్బందీగా చర్యలు చేపడుతున్న తెలంగాణ ప్రభుత్వం.. నిధుల సమీకరణ ద్వారా రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలకు, ఇతర అత్యవసర కార్యక్రమాలకు విఘాతం కలుగకుండా చూసేందుకు పక్కా వ్యూహం తో ముందుకు సాగుతున్నది. బాండ్ల వేలం ద్వారా తొలుత బహిరంగ మార్కెట్ల నుంచి రూ.2 వేల కోట్ల రుణాలను తీసుకోనున్నది. ఈ బాండ్లను రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) ద్వారా సోమవారం వేలానికిపెట్టే అవకాశమున్నది. వాస్తవానికి ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌ఆర్‌బీఎం) ప్రకారం మన రాష్ట్ర సంపదలో 3.25 శాతం వరకు రుణాలు తీసుకునే అవకాశమున్నది. ప్రస్తుతం మన రాష్ట్ర సంపద రూ.9.5 లక్షల కోట్ల వరకు ఉండటంతో దశలవారీగా దాదాపు రూ.31 వేల కోట్ల వరకు రుణాలు తీసుకోవచ్చు. ప్రస్తుతం కనీవిని ఆర్థిక సంక్షోభం నెలకొన్న నేపథ్యంలో ఎఫ్‌ఆర్‌బీఎం పరిమితిని 5 శాతం వరకు పెంచాలని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసిన విషయం విదితమే. దీనికి కేంద్రం అంగీకరిస్తే మన రాష్ట్రం మరో రూ.20 వేల కోట్ల మేరకు రుణాలు తీసుకునే అవకాశముంటుంది.

చైనా చేతికి

## హెచ్‌డీఎఫ్‌సీ వాటా

### 1.75 కోట్ల షేర్లను కొన్న చైనా సెంట్రల్ బ్యాంక్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** దేశీయ బ్యాంకింగేతర ఆర్థిక దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్‌లో దాదాపు 1.75 కోట్ల షేర్ల (1.01 శాతం)ను చైనా సెంట్రల్ బ్యాంక్ హస్తగతం చేసుకున్నది. జనవరి-మార్చి త్రైమాసికంలో పీపుల్స్ బ్యాంక్ ఆఫ్ చైనా ఈ వాటాలను కొన్నట్లు ఎక్స్ఛేంజీ వివరాల ద్వారా తెలుస్తున్నది. అయితే దీనికి సంబంధించిన పూర్తి లావాదేవీల వివరాలు మాత్రం తెలియాల్సి ఉన్నది. నిరుడు అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో ఎల్‌ఐసీ తమ వాటాను 4.21 శాతం నుంచి 4.67 శాతానికి పెంచుకున్నది. కాగా, ఫిబ్రవరి మొదటి వారం నుంచి గమనిస్తే హెచ్‌డీఎఫ్‌సీ షేర్ల విలువ 41 శాతం పతనమైంది. ప్రస్తుతం హెచ్‌డీఎఫ్‌సీ షేర్ విలువ రూ.1,701.95గా ఉన్నది.

# ఒడిదుడుకుల్లోనే..

### ఈ వారం మార్కెట్ సరళిపై నిపుణుల అంచనా



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం ఒడిదుడుకులకు లోనయ్యే వీలుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా పెరుగుతున్న కరోనా కేసులు ట్రేడింగ్‌ను ప్రభావితం చేస్తాయంటున్నారు. అయితే లాక్‌డౌన్‌ను పూర్తిగా కాకపోయినా స్వల్పంగా ఎత్తివేసినా మార్కెట్ సెంటిమెంట్ బలపడే వీలుందనీ చెప్తున్నారు. స్తంభించిన ఆర్థిక కార్యకలాపాలు తిరిగి మొదలయ్యేందుకు అవకాశాలుండటమే ఇందుకు కారణమని వారు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యమంత్రులతో ప్రధాని మోదీ జరిపిన వీడియో కాన్ఫరెన్స్‌లో లాక్‌డౌన్‌ను పొడిగించడమే ఉత్తమమన్న ఏకాభిప్రాయం వ్యక్తమైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తుండగా, ఆర్థిక నష్టం దృష్ట్యా కొన్ని సడలింపులు ఉంటాయన్న అంచనాలు వినిపిస్తున్నాయి. ఇదే జరిగితే మదుపరులకు ధైర్యం రావచ్చని నిపుణులు అంటున్నారు. మంగళవారం అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని మార్కెట్లకు సెలవు.

**రూ.9,103 కోట్లు వెనక్కి**

కరోనా వైరస్ సంక్షోభం నేపథ్యంలో భారతీయ మార్కెట్ల నుంచి ఎఫ్‌పీఐ ఈ నెలలో ఇప్పటిదాకా రూ.9,103 కోట్ల పెట్టుబడుల్ని వెనక్కి తీసుకున్నారు. ఈ నెల 1-9 మధ్య స్టాక్ మార్కెట్ల నుంచి రూ.2,951 కోట్లు, రుణ మార్కెట్ల నుంచి రూ.6,152 కోట్లు తరలిపోయాయి.

**మెరిసిన ఆర్‌ఐఎల్**

గత వారం ఆర్‌ఐఎల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. మొత్తం టాప్-10 కంపెనీల మార్కెట్ విలువ రూ.4,04,068.05 కోట్లు పెరిగింది. ఆర్‌ఐఎల్ మదుపరుల సంపద అత్యధికంగా రూ.89,383.67 కోట్లు పెరిగి రూ.7,72,883.49 కోట్లను తాకింది. దీంతో బీఎస్‌ఈ నమోదిత కంపెనీల్లో అగ్ర సంస్థగా నిలబడింది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లు ఆకర్షణీయం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** మదుపరులు మళ్లీ గోల్డ్ ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)పై ఆసక్తి చూపుతున్నారు. ఆరేండ్ల తర్వాత గత ఆర్థిక సంవత్సరం (2019-20) గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.1,600 కోట్లకుపైగా పెట్టుబడులను పట్టుకొచ్చారు. 2012-13 తర్వాత తిరిగి పెట్టుబడులు రావడం ఇదే. నాడు రూ.1,414 కోట్లు తెచ్చారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతున్న విషయం తెలిసిందే. దీంతో తమ పెట్టుబడులకు గోల్డ్ ఈటీఎఫ్‌లే సురక్షితమని మెజారిటీ మదుపరులు భావిస్తున్నారు.

## 'ప్రైమ్ నౌ'కు అమెజాన్ గుడ్‌బై

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** అమెజాన్ ఇండియా తమ నిత్యావసరాల యాప్ 'ప్రైమ్ నౌ'ను మూసేస్తున్నది. ఆర్డర్‌పై కేవలం రెండు గంటల్లో గ్రాసరీలను డెలివరీ చేయగలగడం దీని ప్రత్యేకత. అయితే ఈ యాప్ సేవలను అమెజాన్ ప్రధాన యాప్‌లో కలిపేస్తున్నారు. దీని స్థానంలో అమెజాన్ ఫ్రెష్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. ప్రైం సభ్యుల కోసం గతేడాది ఆగస్టులో ఈ యాప్‌ను రూపొందించారు. ఒక్క గూగుల్ ప్లే స్టోర్ నుంచే ఈ యాప్‌ను 10 లక్షలకుపైగా మంది డౌన్‌లోడ్ చేసుకోవడం గమనార్హం.

## 'మమ్మల్నీ ఆదుకోండి'

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** అసలే ఆర్థిక మందగమనంతో సతమతమవుతున్న తమను కరోనా సంక్షోభం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నదని ఆటోమొబైల్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తమకు ఆర్థిక చేయూత ఇవ్వాలని అటు వాహన తయారీదారులను ఇటు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. లాక్‌డౌన్‌తో వ్యాపారం స్తంభించిపోయిందని, బీఎస్-4 శ్రేణి వాహన అమ్మకాలు నిలిచిపోయాయని, జీతాలు ఇవ్వలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నామని ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ అధ్యక్షుడు ఆశిష్ హర్షరాజ్ కాలే పీటీఐతో అన్నారు.

# ఇదే సరైన సమయం

### చైనానుంచి నిష్క్రమించే సంస్థల్ని భారత్ ఆకర్షించాలి: ఎఫ్‌ఐఈవో




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 12:** కరోనా వైరస్ నేపథ్యంలో చైనా నుంచి తమ తయారీ కేంద్రాలను మార్చాలని చూస్తున్న సంస్థలను ఆకర్షించేందుకు ఇదే సరైన సమయమని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్‌ఐఈవో) అభిప్రాయపడింది. ఈ విషయంలో ప్రధాని మోదీ దృష్టిపెట్టాలని కోరింది. భూసేకరణ చట్టంలో మార్పులు తేవాలని, నెల రోజుల్లో విద్యుత్ సౌకర్యం కల్పించాలని, రెండు నెలల్లో బ్యాంక్ రుణాలను మంజూరు చేయాలని ఎఫ్‌ఐఈవో అధ్యక్షుడు ఎస్ సరఫ్ ప్రధానికి రాసిన లేఖలో సూచించారు. భూములు అందుబాటులో ఉంటే అన్ని రాష్ట్రాల పారిశ్రామిక అభివృద్ధి మండలిలు నెల రోజుల్లో కేటాయించాలన్నారు. నియోజకవర్గ కేంద్రాల నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అటవీ భూముల్లోనూ పరిశ్రమల ఏర్పాటుకు షరతులతో కూడిన అనుమతుల్ని ఇవ్వాలని ఆ లేఖలో సరఫ్ సూచించారు. మరో అటవీ భూమిలో పరిశ్రమ యాజమాన్యాలతో మొక్కలు నాటించాలని, దీనివల్ల గ్రామీణ ప్రజలకు ఉపాధి లభిస్తుందని సూచించారు. ప్రస్తుతం భారీ సంస్థలే భారత్‌కు వస్తున్నాయని, క్షేత్రస్థాయి సమస్యలను తీర్చితే చిన్న, మధ్యతరహా సంస్థలూ దేశంలోకి వస్తాయని చెప్పారు.

**పరిశ్రమ పునర్నిర్మితం కావాలి: సద్గురు**

కరోనా వైరస్ నేపథ్యంలో పరిశ్రమలు సహా అనేక రంగాలు పునర్నిర్మాణం కావాల్సిన అవసరం ఉందని ఈశా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్ అన్నారు. ఆదివారం ఫిక్కీ, ఈశా ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ సంస్థలను ఆకర్షించే దిశగా కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. అలాగే వైద్య రంగంలో మౌలిక సదుపాయాలు పెరుగాల్సిన అవసరం ఉందన్నారు. కాగా, తన 65 ఏండ్ల వైద్య వృత్తిలో ఇలాంటి పరిస్థితిని ఎప్పుడు చూడలేదని అపోలో హాస్పిటల్ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఈ ఇంటరాక్టివ్ సేషన్‌లో ఫిక్కీ జాతీయ అధ్యక్షురాలు సంగీతారెడ్డి, మాజీ అధ్యక్షుడు సందీప్ సోమనిలు పాల్గొన్నారు.



# ఐటీ పరిశ్రమకు దెబ్బే

### ఉద్యోగ కోతలకు అవకాశం • లాక్‌డౌన్‌పై నాస్కామ్ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్

**హైదరాబాద్, ఏప్రిల్ 12:** ఐటీ రంగ ఉద్యోగులకు లాక్‌డౌన్ దెబ్బేనని నాస్కామ్ మాజీ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. ఉద్యోగ కోతలకు ఆస్కారం ఉంటుందన్నారు. అయితే వర్క్ ఫ్రం హోం సంస్కృతి వల్ల దీర్ఘకాలంలో సత్ఫలితాలు ఉండగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దీనివల్ల కొత్త మార్గాలు ఆవిష్కృతమయ్యే వీలుందన్న ఆయన ఐటీ సంస్థల ఖర్చులు ఆదా కావచ్చని చెప్పారు. ఈ మహమ్మారి స్టార్టప్‌ల ఉసురు కూడా తీస్తున్నదని, నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని పీటీఐతో మాట్లాడుతూ తెలిపారు. పెద్ద సంస్థలు ఉద్యోగులను వదులుకోవని, జీతాలు చెల్లించడానికి తగినన్ని నగదు నిల్వలు ఉంటాయన్న ఆయన చిన్న సంస్థలకే చిక్కులని వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితులపై నాస్కామ్ మాజీ ఛైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి స్పందిస్తూ యావత్ ప్రపంచంపై కరోనా ప్రభావం ఉన్నందున ఐటీ రంగం సహజంగానే ఇబ్బందులకు గురవుతుందన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బాగున్న ఆర్థిక వ్యవస్థ అంటూ ఏదీ లేదన్నారు.

**వెంటాడుతున్న నిరుద్యోగ భయం**

కరోనా వైరస్ సంక్షోభం ఉద్యోగుల్లో నిరుద్యోగ భయాలను రేకెత్తిస్తున్నది. లాక్‌డౌన్‌పై స్పష్టత లేకపోవడంతో తమ ఉద్యోగాలు ఉంటాయా? ఉండవా? అన్న సందిగ్ధంలో చాలామంది ఉన్నారిప్పుడు. రోజురోజుకూ వీరి సంఖ్య పెరిగిపోతుండగా, భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తమవుతున్నది.

# ఆట

## అవి సమస్యలే కావు




**న్యూఢిల్లీ:** కొవిడ్-19ను సమర్థంగా ఎదుర్కోవాలంటే.. స్వీయ నిర్బంధమే ఉత్తమమని టీమ్‌ఇండియా మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. విపత్కర పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలను పాటించాలని సూచించాడు. ఆదివారం ట్విట్టర్ వీడియోలో వీరూ మాట్లాడుతూ.. 'కరోనా వైరస్ కారణంగా ప్రస్తుతం మనం ఇండ్ల నుంచి బయటకు రాలేకపోవచ్చు.. ఉదయం వాకింగ్, జాగింగ్‌కు వెళ్లలేకపోవచ్చు. షాపింగ్‌మాల్స్‌కు వెళ్లే అవకాశం లేకపోవచ్చు. ఇవన్నీ మీకు సమస్యలుగా కనిపించవచ్చు. కానీ జీవితంలో ఇవేవీ పెద్ద ఇబ్బందులు కావు. మన కోసం వైద్య, పోలీస్, పారిశుధ్య సిబ్బంది ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడుతున్నారు. అందుకే ఈ సమయంలో మనం ఇంటి నుంచి బయటకు రాకుండా.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సూచనలు పాటించాల్సిన అవసరముంది' అని అన్నాడు.

## ధోనీకి రుణపడి ఉంటా




**న్యూఢిల్లీ:** చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ, కోచ్ ఫ్లెమింగ్‌కు తానెప్పుడూ రుణపడి ఉంటానని ఆస్ట్రేలియా ఆటగాడు షేన్ వాట్సన్ అన్నాడు. గతేడాది ఐపీఎల్లో వరుసగా విఫలమవుతున్నా.. తగినన్ని అవకాశాలిచ్చి తనలో ఆత్మవిశ్వాసం నింపిన ధోనీకి వాట్సన్ కృతజ్ఞతలు తెలిపాడు. '2019 ఐపీఎల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయా.. దీంతో నన్ను జట్టు నుంచి తప్పిస్తారనుకున్నా. కానీ ధోనీ, ఫ్లెమింగ్ నాపై నమ్మకముంచారు. వారి ప్రోత్సాహం నన్ను పది అడుగుల ఎత్తున్నట్లు ఫీలయ్యేలా చేసింది. అద్భుతమైన నాయకత్వంలో ఉన్న శక్తి అదే' అని వాట్సన్ అన్నాడు. లీగ్ దశలో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన వాట్సన్ ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఫైనల్లో 59 బంతుల్లో 80 పరుగులు చేసి తుదికంటా పోరాడాడు.

# ఎఫ్‌టీపీ మార్చాల్సిందే

కరోనా వైరస్ మహమ్మారి విజృంభణ నేపథ్యంలో ఫ్యూచర్ టూర్స్ ప్రోగ్రామ్ (ఎఫ్‌టీపీ)లో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్ పేర్కొన్నాడు. ఈ అంశంపై అన్ని దేశాల క్రికెట్ బోర్డులు ఆలోచించాలని అజ్జూభాయ్ సూచించాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్ జరగాలంటే ఎఫ్‌టీపీ సవరణ అనివార్యమని అన్నాడు. టీ20 ప్రపంచకప్, ఎఫ్‌టీపీ, ఐపీఎల్‌పై అజారుద్దీన్ వెల్లడించిన వివరాలు అతడి మాటల్లోనే..



- **వచ్చే రెండేండ్ల సిరీస్‌లను తిరిగి సరిచేయాలి**
- **షెడ్యూల్‌లో ఐపీఎల్‌కు చోటివ్వాలి**
- **హెచ్‌సీఏ అధ్యక్షుడు మహ్మద్ అజారుద్దీన్**

**న్యూఢిల్లీ:** కొవిడ్-19 ప్రబలుతున్న నేపథ్యంలో.. రాబోయే రెండేండ్ల కోసం ముందుగానే నిర్ణయించిన ఎఫ్‌టీపీలో మార్పులు అనివార్యమనిపిస్తున్నది. ఇలాంటి విపత్కర పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించలేరు కాబట్టి.. షెడ్యూల్‌ను తిరిగి రూపొందించాలి. వైరస్ ప్రభావం తగ్గితే.. ఆ తర్వాత ఈ అంశంపై ఇతర దేశాలతో చర్చించవచ్చు. ప్రస్తుతం ఏమీ చేయలేని పరిస్థితి. వాస్తవానికి ఈ ఏడాది మార్చి 29 నుంచి మే 24 వరకు ఐపీఎల్ 13వ సీజన్ జరగాల్సి ఉన్నా.. మహమ్మారి కారణంగా రెండు వారాలు వాయిదా వేశారు. అయితే ఇప్పుడున్న స్థితిలో లీగ్ నిర్వహణ కష్టమే.

**ఐపీఎల్ నిర్వహించాలంటే..**

ఈ ఏడాది క్రికెట్ షెడ్యూల్‌లో ఐపీఎల్‌కు చోటు కల్పించాలంటే.. మొత్తం అంతర్జాతీయ సిరీస్‌ల తేదీలను మార్చాల్సి ఉంటుంది. లేకపోతే లీగ్‌ను నిర్వహించడం కష్టం. లీగ్ రద్దైతే.. ఆటగాళ్లతో పాటు ఫ్రాంచైజీలు, వాటాదారులు తీవ్రంగా నష్టపోతారు. ఆ ప్రభావం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ)తో పాటు మిగిలిన దేశాల బోర్డులపై కూడా పడుతుంది. లీగ్ కేవలం దేశీయ ప్లేయర్‌లకే కాదు.. విదేశీ ఆటగాళ్లకూ ముఖ్యమైనదే. అందుకే ఎఫ్‌టీపీలో మార్పులు చేసి ఐపీఎల్ కోసం స్లాట్ ఏర్పాటు చేస్తారని ఆశిస్తున్నా.

**టీ20 వరల్డ్‌కప్‌పై..**

ఆస్ట్రేలియా వేదికగా జరుగాల్సి ఉన్న పొట్టి ప్రపంచకప్‌పై కరోనా వైరస్ ప్రభావం ఉండకపోవచ్చనుకుంటున్నా. అక్టోబర్ మూడో వారంలో జరుగనున్న మెగాటోర్నీ గురించి ఇప్పుడే చెప్పడం కష్టం. అయినా అప్పటి వరకు పరిస్థితుల్లో మార్పు వస్తుందనుకుంటున్నా. ప్రపంచకప్‌నకు ఇబ్బంది కలుగకుండా.. ఐపీఎల్ కోసం షెడ్యూల్‌లో మార్పు లు చేస్తే మంచిదని నా వ్యక్తిగత అభిప్రాయం.

**వారం రోజుల్లోనే..**

ఎప్పుడూ మైదానాల చుట్టూ తిరిగే క్రికెటర్లు.. ప్రస్తుత పరిస్థితులో అసహనానికి గురవుతూ ఉంటారు. ప్రాక్టీస్ కోసం గంటలు గంటలు వెచ్చించే ఆటగాళ్లకు కనీసం నెట్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగానే ఉంటుంది. ప్రస్తుతం ఆటలో కొనసాగుతున్న చాలా మంది క్రికెటర్లు తమ సొంత ఫిట్‌నెస్ ప్రోగ్రామ్‌తో ముందుకు సాగుతున్నారు. అంటే వారి ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటూ వ్యాయామాలు కొనసాగిస్తున్నారు. కరోనా వైరస్ మహమ్మారి ప్రభావం తగ్గి ఒకసారి పరిస్థితుల్లో మార్పు వస్తే వారం రోజుల్లో అంతా చక్కదిద్దుకుంటుంది.

### విదేశీ ఆటగాళ్లంతా సిద్ధంగానే..

ఖాళీ మైదానాల్లో ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడేందుకు కూడా విదేశీ ప్లేయర్లు సిద్ధంగా ఉన్నారు. ఇదే అంశాన్ని చాలామంది ఆటగాళ్లు బాహాటంగానే ప్రకటించారు. అంటే వారికి ఈ లీగ్ ఎంత ముఖ్యమో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటి వరకు ఒక్కరి నోటి నుంచి కూడా 'ఐపీఎల్ వద్దు'అనే మాట రాలేదు. ఈ ఏడాదిలో ఎప్పుడో ఒకప్పుడు లీగ్ జరిగితే బాగుంటుందనే అంతా భావిస్తున్నారు. దీన్ని నిర్వహకులు దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరముంది.

## ఐపీఎల్ వరకైతే ఓకే




**మెల్‌బోర్న్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 13వ సీజన్‌ను ప్రేక్షకులు లేకుండా నిర్వాహించినా ఫర్వాలేదు కానీ.. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌నకు అది సాధ్యం కాక పోవచ్చని ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ అంటున్నాడు. 'ఐపీఎల్ వరకైతే ప్రేక్షకులు లేకున్నా ఫర్వాలేదు. కానీ టీ20 వరల్డ్‌కప్‌ను అభిమానులు లేకుండా ఊహించుకోలేం. ప్రపంచకప్ టోర్నీని నేను అలా ఆలోచించుకోలేను. ఖాళీ మైదానాల్లో ఐపీఎల్ నిర్విహిస్తే ఆడేందుకు నేను సిద్ధమే. భవిష్యత్తులో ఏం జరుగుతుందో ఇప్పుడే చెప్పలేం' అని మ్యాక్సీ చెప్పుకొచ్చాడు.

## 'వాళ్లు టాప్ ఆర్టిస్టులు'

**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ చరిత్రలో గుండప్ప విశ్వనాథ్, మహ్మద్ అజారుద్దీన్, వీవీఎస్ లక్ష్మణ్ 'టాప్ ఆర్టిస్ట్స్'అని.. మాజీ క్రికెటర్, ప్రస్తుత భారత మహిళల జట్టు కోచ్ డబ్ల్యూవీ రామన్ పేర్కొన్నారు. సుప్రసిద్ధ చిత్రకారులు పాబ్లో పికాసో, క్లాడీ మానెట్, వాన్ గాఫ్‌లతో ఈ ముగ్గురిని పోల్చారు. ట్విట్టర్‌లో తనకు ఎదురైన ఓ ప్రశ్నకు బదులిచ్చిన రామన్.. భారత క్రికెట్‌లో ఈ ముగ్గురు సొగసైన ఆటగాళ్లని పేర్కొన్నారు. విశ్వనాథ్, అజ్జూ, వీవీఎస్ మణికట్టు మాయాజాలంతో కట్టిపడేసేవారని.. వారి సొగసిరి ఆటతో భారత్‌కు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించా రని రామన్ గుర్తుచేసుకున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

నమస్తే తెలంగాణ
నిపుణ
[ హైదరాబాద్ ]
సోమవారం 13 ఏప్రిల్ 2020

**కరోనా విజృంభణతో పది పరీక్షలు ఆగిపోయాయి. లాక్‌డౌన్ తర్వాత పది పరీక్షలు నిర్వహించినా తర్వాత ఏం చేద్దాం అని ఆలోచిస్తుంటారు. ఆర్థికంగా ఉన్నవారైతే ఉన్నత చదువులు చదవాలనుకుంటారు. అదే లేనివారైతే త్వరగా ఉపాధినిచ్చే కోర్సులు చేయాలనుకుంటారు. అలాంటివారు ఐటీఐ కోర్సులు చేస్తే త్వరగా ఉపాధి లభిస్తుంది. కావాలంటే ఆ తర్వాత ఉన్నత చదువులు కూడా చదువుకోవచ్చు. అలాంటివారికోసమే ఈ ప్రత్యేక కథనం..**



# ఉపాధినిచ్చే ఐటీఐ

- ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ (ఐటీఐ)లు దేశ ఆర్థిక వ్యవస్థలో ముఖ్యమైన పాత్రను పోషిస్తున్నాయి. ప్రత్యేకించి నైపుణ్యం కలిగిన మానవవనరులను అందిస్తున్నాయి. కాబట్టి పదో తరగతి తర్వాత తక్కువ వ్యయంతో ఐటీఐని ఎంచుకోవడం ద్వారా ఒకటి లేదా రెండేండ్లలో టెక్నికల్‌గా నైపుణ్యం పొందవచ్చు. దీంతో చిన్న వయస్సులోనే ఉపాధి పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా ఉద్యోగం చేసుకుంటూనే ఉన్నత చదువులు కూడా చదవవచ్చు.
- కేంద్రప్రభుత్వ కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఐటీఐలను ప్రారంభించింది. నిరుద్యోగితను తగ్గించేందుకు, మానవ వనరుల నైపుణ్యాలను పెంచేందుకు క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీం కింద 1950లో ఐటీఐలను స్థాపించారు. కేంద్రప్రభుత్వ ఆధీనంలోని రైల్వేశాఖలో ఉద్యోగాల భర్తీకి ఎక్కువగా ఐటీఐ పూర్తిచేసినవారినే తీసుకుంటున్నారు.
- నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎన్‌సీవీటీ) అనుబంధగా రాష్ట్రంలో 54 ప్రభుత్వ, 222 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ (ఎస్‌సీవీటీ) అనుబంధంగా రాష్ట్రంలో 10 ఐటీఐలు ఉన్నాయి.
- ఐటీఐలో ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్ కోర్సులు ఉన్నాయి. ఇంజినీరింగ్ కోర్సుల్లో ఫిట్టర్, డీజిల్ మెకానిక్, ఎలక్ట్రీషియన్, మెకానిక్ (రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్), టర్నర్, వెల్డర్ (జనరల్ అండ్ ఎలక్ట్రికల్), డ్రాఫ్ట్స్‌మెన్, ఎలక్ట్రానిక్ మెకానిక్ తదితర కోర్సులు ఉన్నాయి.
- నాన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో బుక్ బైండింగ్, కార్పెంటర్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, కటింగ్ అండ్ స్యూయింగ్, డ్రెస్‌మేకింగ్, హార్టికల్చర్, స్టెనోగ్రఫీ, మ్యానుఫ్యాక్చర్ ఫుట్‌వేర్, సెక్రటేరియల్ ప్రాక్టీస్, బ్యూటీషియన్, హెల్త్ శానిటరీ తదితర కోర్సులు ఉన్నాయి.

## ఇంజినీరింగ్ ట్రేడులు

- **ఫిట్టర్:** ఇది రెండేండ్ల కోర్సు. ఆరు నెలలకు ఒకటి చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. కోర్సు పూర్తిచేసినవారు యాంగిల్ ఐరన్, ఐ-బీమ్స్, స్టీల్‌ప్లేట్స్‌లను వివిధ నిర్మాణాల్లో ఏ విధంగా ఉపయోగించాలో తెలుసుకుంటారు. ఈ ట్రేడ్‌లో ఉత్తీర్ణులైనవారు డిప్లొమా లేదా డిగ్రీ కోర్సుల్లో చేరి ఉన్నత విద్యను అభ్యసించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలుంటాయి. వివిధ పరిశ్రమల్లో, బ్రిడ్జిలు, భవనాలు నిర్మించే పెద్దపెద్ద కంపెనీల్లో వెల్డర్ ఫిట్టర్, పైప్ ఫ్యాబ్రికేటర్, మెకానికల్ ఫిట్టర్, టెక్నికల్ అసిస్టెంట్/టెక్నీషియన్, ప్లాంట్ మెయింటెనెన్స్ ఫిట్టర్, లేథ్ మిషన్ ఆపరేటర్ వంటి ఉద్యోగాల్లో చేరవచ్చు. భారీ పరిశ్రమల్లో వివిధ ఉత్పత్తుల నిర్మాణానికి అవసరమయ్యే విడి భాగాల తయారీ కోసం చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చు.
- **డీజిల్ మెకానిక్:** ఏడాది కోర్సులో ఆరు నెలలకు ఒక సెమిస్టర్ చొప్పున రెండు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ట్రేడ్ పూర్తిచేసినవారు డీజిల్ ఇంజిన్‌కు సంబంధించి పూర్తి అవగాహన పొందుతారు. డీజిల్ ఇంజిన్‌లో తలెత్తే లోపాలను సరిదిద్దగల నైపుణ్యం కలిగి ఉంటారు. అసెంబుల్డ్, టెస్ట్ షాప్‌లు, మెకానిక్ షాప్‌లు, మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమల్లో ఆటో డీజిల్ ఇంజిన్ మెకానిక్, డీజిల్ ఇంజిన్ సర్వీస్ టెక్నీషియన్, ఆటో ఫిట్టర్, మెకానిక్, డీలర్స్ సర్వీస్ మెకానిక్, డ్రైవర్ లేదా వెహికిల్ ఆపరేటర్, స్పేర్ పార్ట్స్ సేల్స్ అసిస్టెంట్, ల్యాబొరేటరీ అసిస్టెంట్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. లేదంటే సొంతంగా డీజిల్ ఇంజిన్ మెకానిక్ షాప్ ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందవచ్చు.
- **ఎలక్ట్రీషియన్:** ఇది రెండేండ్ల కోర్సు. ఈ కోర్సు పూర్తిచేసినవారు నివాసాలు, వ్యాపార సముదాయాలు, పరిశ్రమల్లోని భవనాల్లో వివిధ రకాల వైరింగ్ విధానాల గురించి తెలుసుకుంటారు. స్ట్రీట్ లైట్లు, జాతీయ రహదారుల్లో లైటింగ్ వ్యవస్థ, ట్రాఫిక్ సిగ్నళ్లకు సంబంధించి పూర్తి అవగాహన కలిగి ఉంటారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డులు, ఎంఎన్‌సీ కంపెనీల్లో ఎలక్ట్రీషియన్, వైర్‌మెన్, మెషినరీ ఎలక్ట్రీషియన్ వంటి ఉద్యోగాలు పొందవచ్చు. సంబంధిత లైసెన్స్ సర్టిఫికెట్ పొంది సొంతంగా వర్క్‌షాప్‌లు ఏర్పాటు చేసుకోవచ్చు. హౌస్ వైరింగ్ కాంట్రాక్టర్లుగా ఎదగవచ్చు.



- **మెకానిక్ (రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనర్):** ఈ కోర్సు కాల వ్యవధి రెండేండ్లు. ఆరు నెలలకు ఒకటి చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ కోర్సు పూర్తిచేసినవారు రిఫ్రిజిరేటర్, వాటర్ కూలర్, బాటిల్ కూలర్, డీప్ ఫ్రీజర్, వాక్ ఇన్ కూలర్, స్ప్లిట్ ఎయిర్ కండిషనర్, ప్యాకేజ్ ఎయిర్ కండిషనర్, సెంట్రల్ ఎయిర్ కండిషనర్, ఆటోమొబైల్ ఎయిర్ కండిషనర్, ట్రాన్స్‌పోర్టు రిఫ్రిజిరేషన్, ఎయిర్‌క్రాఫ్ట్ ఎయిర్ కండిషనింగ్, రైల్వే ఎయిర్ కండిషనింగ్, షిప్ రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మొదలైన వాటి సర్వీసింగ్, రిపేరింగ్‌పై పూర్తి అవగాహన కలిగి ఉంటారు. ఈ ట్రేడ్‌లో ఉత్తీర్ణులైతే ఉపాధి, ఉద్యోగ అవకాశాలు చాలా ఉంటాయి. ఇండ్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, కార్యాలయాలు, ఫ్యాక్టరీల్లో.. రిఫ్రిజిరేటర్లు, ఏసీలు, ఎయిర్ కూలర్లు మొదలైన వాటి సర్వీసింగ్, రిపేరింగ్ చేస్తూ ఉపాధి పొందచ్చు. వివిధ కంపెనీల్లో ఏసీ టెక్నీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేషన్ మెకానిక్ వంటి ఉద్యోగాలు చేయవచ్చు. సంబంధిత రంగంలో ఉన్నత విద్యను అభ్యసించవచ్చు.
- **టర్నర్:** రెండేండ్ల కోర్సులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆరు నెలలకు ఒక సెమిస్టర్ ఉంటుంది. కోర్సులో భాగంగా లోహ విడిభాగాల తయారీ, పరిశ్రమల్లో ఉండే యంత్రాలు, యంత్రాల విడిభాగాలను కచ్చితంగా వాడటం ఎలా అనేది తెలుసుకుంటారు. విజయవంతంగా కోర్సును పూర్తి చేసిన తర్వాత ఉత్పత్తి, తయారీ, ఆటోమొబైల్ సంబంధిత రంగాల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. ముఖ్యంగా సేవారంగాలైన రవాణా, రైల్వే, నౌకా నిర్మాణం, మరమ్మతులు, రక్షణ రంగాల్లో మెరుగైన అవకాశాలు ఉంటాయి. అంతేకాకుండా ప్రభుత్వరంగ సంస్థలైన బీహెచ్‌ఈఎల్, బీఈఎంఎల్, ఎన్టీపీసీ, సైనిక సంబంధిత వర్క్‌షాప్‌లలో ఉద్యోగాలు కూడా లభిస్తాయి. టర్నర్ ట్రేడ్ పూర్తిచేయడం వల్ల రేడియల్ డ్రిల్లింగ్ ఆపరేటర్, క్వాలిటీ టెక్నీషియన్, సీఎన్సీ ఆపరేటర్, లేథ్ మిషన్ ఆపరేటర్, హైడ్రాలిక్ హోస్ క్రింపర్ తదితర ఉద్యోగాలు పొందవచ్చు.
- **వెల్డర్ (జనరల్ అండ్ ఎలక్ట్రికల్):** వెల్డర్ అనేది మెకానికల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన ఒకేషనల్ కోర్సు. ఏడాది కోర్సులో ఆరు నెలలకు ఒక సెమిస్టర్ చొప్పున రెండు సెమిస్టర్లు ఉంటాయి. వెల్డింగ్‌కు సంబంధించిన నైపుణ్యం, మెటల్ వర్కింగ్ మెలకువలను నేర్చుకుంటారు. విజయవంతంగా కోర్సు పూర్తి చేసిన తర్వాత ఇదేరంగంలో డిప్లొమా/ డిగ్రీ కోర్సులను చేయవచ్చు. భారీ, చిన్న తరహా పరిశ్రమలకు అవసరమైన పనుల కోసం సొంతంగా వర్క్‌షాప్ ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందవచ్చు. వైమానిక, రక్షణ, నౌకానిర్మాణం, నిర్మాణ రంగం, ఆటోమోటివ్‌లోని చిన్న, భారీ తరహా పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయి. గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్ వెల్డర్, ట్రాక్ వెల్డర్, వెల్డర్, స్ట్రక్చరల్ స్టీల్, పైప్ యార్క్ వెల్డర్, వెల్డర్ అండ్ ఫ్యాబ్రికేటర్ హెల్పర్ సంబంధిత ఉద్యోగాలు ఉంటాయి.
- **డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్):** ఈ రెండేండ్ల కోర్సులో ఆరు నెలలకు ఒకటి చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సివిల్ ఇంజినీరింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలపై అవగాహన కలుగుతుంది. విజయవంతంగా కోర్సును పూర్తిచేస్తే ప్రభుత్వ ఆధీనంలోని భవనాలు, చారిత్రక ప్రాంతాల్లో అపారమైన ఉద్యోగావకాశాలు ఉంటాయి. నిర్మాణరంగానికి సంబంధించి డిగ్రీ కోర్సులు చేయడానికి అవకాశం ఉంటుంది. చారిత్రక వస్తువులకు సంబంధిచి డ్రాయింగ్‌లు వేసే ఉద్యోగావకాశాలు కూడా ఉంటాయి. డ్రాఫ్ట్స్‌మెన్ పైపింగ్, డ్రాఫ్ట్స్‌మెన్ స్ట్రక్చరల్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్, స్ట్రక్చరల్ డ్రాఫ్ట్స్‌మెన్ సంబంధిత ఉద్యోగాలు ఉంటాయి. డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్)కు సంబంధించి అడ్వాన్స్ కోర్సులు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మెన్‌లో డిప్లొమా, ఆర్కిటెక్చరల్ డ్రాఫ్ట్స్‌మెన్‌షిప్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా తదితర కోర్సులు కూడా చేసే అవకాశం ఉంటుంది.
- **ఎలక్ట్రానిక్ మెకానిక్:** ఎలక్ట్రానిక్ మెకానిక్ అనేది ఎలక్ట్రానిక్ వస్తువులకు మరమ్మతులకు సంబంధించిన కోర్సు. రెండేండ్ల కోర్సులో ఆరు నెలలకు ఒకటి చొప్పున నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. కోర్సులో భాగంగా ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించిన పరిజ్ఞానం, వాటి మరమ్మతులు, నిర్వహణ గురించి సంపూర్ణ అవగాహన కలుగుతుంది. కోర్సును విజయవంతంగా పూర్తిచేసిన తర్వాత ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ, ఆటోమొబైల్ ఎలక్ట్రానిక్స్ సంబంధిత, సోలార్ విద్యుత్తు ఆధారిత ఇన్వెర్టర్ల తయారీ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఉంటాయి. సేవా రంగాలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్, రైల్వే, ఇస్రో, నౌకాశ్రయం, ఆర్పీఎఫ్, బీపీసీఎల్ తదితర ప్రభుత్వరంగ సంస్థల్లో కూడా ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఎల్జీ, సామ్‌సంగ్, నోకియా, సోని తదితర ఫోన్ల పరిశ్రమల్లో కూడా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అసిస్టెంట్‌లైన్‌మెన్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిక్, మెయింటెనెన్స్ టెక్నీషియన్, చార్జ్‌మెన్ మెకానిక్ సంబంధిత ఉద్యోగాలు ఉంటాయి. పై చదువులు చదవడానికీ ఆస్కారం ఉంది. ఎలక్ట్రానిక్స్‌లో అడ్వాన్స్‌డ్ డిప్లొమా, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్స్‌లో అడ్వాన్స్‌డ్ డిప్లొమా కోర్సులను కూడా చదవవచ్చు.
- **ఎంపిక:** ఎస్ఎస్‌సీ మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. సీట్ల కేటయింపు నియమ నిబంధనల మేరకు మెరిట్ కం రిజర్వేషన్ ఆధారంగా ఉంటుంది.
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. ఆధార్‌కార్డ్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, స్కాన్ చేసిన తాజా పాస్‌పోర్ట్ ఫొటో, ఎస్ఎస్‌సీ మెమో/తత్సమాన పత్రం, కుల ధృవీకరణ తదితర పత్రాలను కలిగి ఉండాలి. ఆ తర్వాత న్యూ అప్లికెంట్/రిజిస్ట్రేషన్ ఐడీతో లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ సహాయంతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **వెబ్‌సైట్:** http://iti.telangana.gov.in
- రాష్ట్రంలో ప్రతి జిల్లాకు (పాత జిల్లా) ఒక ఐటీఐ ప్రిన్సిపల్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ఐటీఐ ప్రిన్సిపాళ్ల కార్యాలయాలున్న ప్రాంతం
- హైదరాబాద్-సికింద్రాబాద్
- ఆదిలాబాద్- మంచిర్యాల
- నల్లగొండ-భువనగిరి
- ఖమ్మం-కొత్తగూడెం
- నిజామాబాద్-నిజామాబాద్
- కరీంనగర్-పెద్దపల్లి
- మహబూబ్‌నగర్-మహబూబ్‌నగర్
- వరంగల్-వరంగల్
- రంగారెడ్డి-మేడ్చల్
- మెదక్-పటాన్‌చెరు

... సత్యం చాపల

## మైనారిటీల ఐటీఐలు

- ప్రభుత్వ ఐటీఐ (ఎం)- బోధన్-నిజామాబాద్ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్, బౌద్ధ, పార్శీ)

**ప్రైవేట్ మైనారిటీ ఐటీఐలు**

- జహంగీర్ పీర్ ప్రైవేట్ ఐటీఐ- మహబూబ్‌నగర్ (ముస్లిం)
- బాయ్స్ టౌన్ ప్రైవేట్ ఐటీఐ- దారుషిఫా-హైదరాబాద్ (క్రిస్టియన్)
- హెచ్‌ఈహెచ్ అల్లావుద్దీన్ ప్రైవేట్ ఐటీఐ- బొగ్గులకుంట-హైదరాబాద్ (ముస్లిం)
- జాఫేరియా ప్రైవేట్ ఐటీఐ- దారుషిఫా-హైదరాబాద్ (ముస్లిం)
- అంజుమన్ ఒమర్ ఐటీఐ- ముషీరాబాద్-హైదరాబాద్ (ముస్లిం)
- మౌంట్ కార్మెల్ బాయ్స్ ఐటీఐ- పాల్వంచ-భద్రాద్రి కొత్తగూడెం (క్రిస్టియన్)
- ఫాతిమా ఐటీఐ- కాజీపేట్-వరంగల్ (క్రిస్టియన్)
- అన్ని కో ఎడ్యుకేషనల్ ఐటీఐల్లో బాలికలకు 33.33 శాతం సీట్లు కేటాయించారు. ప్రభుత్వ ఐటీఐ-మహబూబ్‌నగర్, క్యూక్యూఎస్ ఐటీఐ-సంతోష్‌నగర్(హైదరాబాద్), సెయింట్ జోసెఫ్ ప్రైవేట్ ఐటీఐ (హన్మకొండ)లలో బాలికలకు మాత్రమే ప్రవేశం కలదు.
- ప్రభుత్వ ఐటీఐ-హత్నూరా (సంగారెడ్డి), ప్రభుత్వ ఐటీఐ-భద్రాచలం (భద్రాద్రికొత్తగూడెం)లలో బాలురకు మాత్రమే ప్రవేశం కలదు.

## నాన్ ఇంజినీరింగ్ ట్రేడులు

- **బుక్‌బైండర్:** ఇది రెండేండ్ల కోర్సు. ఈ కోర్సు చేసినవారికి ప్రింటింగ్ ప్రెస్, పబ్లిషింగ్ హౌస్‌లలో వీరికి మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సు హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ వొకేషనల్ ట్రైనింగ్ అండ్ రిసర్చ్ సెంటర్, గవర్నమెంట్ డిస్ట్రిక్ట్ లెవల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ గర్ల్స్, గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్-మల్లేపల్లిల్లో అందుబాటులో ఉంది.
- **కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్:** ఇది ఏడాది వ్యవధిగల కోర్సు. ప్రస్తుతం ప్రతి పని కంప్యూటర్ ద్వారానే జరుగుతుంది. కాబట్టి ఈ కోర్సు చేసినవారికి ఉపాధి త్వరగానే లభిస్తుంది. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో వీరి అవసరం చాలా ఉంటుంది. బాయ్స్ టౌన్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సెంటర్, గవర్నమెంట్ డిస్ట్రిక్ట్ లెవల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ గర్ల్స్-హైదరాబాద్, గవర్నమెంట్ డిస్ట్రిక్ట్ లెవల్ ట్రైనింగ్ సెంటర్-వికారాబాద్, గవర్నమెంట్ డిస్ట్రిక్ట్ లెవల్ ట్రైనింగ్ సెంటర్ ఫర్ ఉమెన్-మలక్‌పేట్, గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్-మల్లేపల్లి, గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్-సనత్‌నగర్, హైదరాబాద్ టెక్నికల్ కాలేజీ ఐటీసీ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్ అండ్ టెక్నాలజీ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సెంటర్‌లలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.



- **సెక్రటేరియల్ ప్రాక్టీస్:** ఇది ఏడాది వ్యవధిగల కోర్సు. ఈ కోర్సులో కార్యాలయానికి సంబంధించిన నైపుణ్యాన్ని పెంపొందిస్తారు. ఈ కోర్సు పూర్తిచేస్తే ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఆఫీస్ అసిస్టెంట్‌గా, సెక్రటరీగా ఉపాధి పొందవచ్చు. డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ ఫౌండేషన్ ఐటీసీ-హైదరాబాద్, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వొకేషనల్ ట్రైనింగ్ అండ్ రిసర్చ్ సెంటర్ -హైదరాబాద్‌లలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.
- **డాటా ప్రిపరేషన్ అండ్ కంప్యూటర్ సాఫ్ట్‌వేర్:** ఇది ఏడాది వ్యవధిగల కోర్సు. ఈ కోర్సు పూర్తిచేసినవారికి కూడా ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో ఉపాధి లభిస్తుంది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సెంటర్, మిల్లత్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సెంటర్‌లలో ఈ కోర్సు ఉంది.
- **స్టెనోగ్రఫీ (ఇంగ్లిష్):** ఇది ఏడాది వ్యవధిగల కోర్సు. ఈ కోర్సు పూర్తిచేస్తే ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు లభిస్తాయి. గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఉమెన్-మలక్‌పేట్, గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్-మల్లేపల్లి, గవర్నమెంట్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్-సికింద్రాబాద్‌లలో ఈ కోర్సు అందుబాటులో ఉంది.

# వీక్లీ రౌండప్

## National



### ప్లాస్మాతో కరోనా చికిత్స

- కరోనా రోగులకు చికిత్స చేయడానికి దేశంలో తొలిసారిగా 'కాన్వలసెంట్ ప్లాస్మా'ను ఉపయోగించాలని కేరళలోని శ్రీ చిత్ర తిరుణాల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మెడికల్ సైన్సెస్ అండ్ టెక్నాలజీ ఏప్రిల్ 9న నిర్ణయించింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో కాన్వలసెంట్ ప్లాస్మా పరిశోధనకు భారత వైద్య పరిశోధన మండలి ఆమోదం తెలిపిందని ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ ఆశా కిశోర్ తెలిపారు. కరోనా నుంచి పూర్తిగా కోలుకున్న రోగుల రక్తంలోని ప్లాస్మాలో యాంటీబాడీలు పుష్కలంగా ఉంటాయి. ఇవి కరోనా వైరస్‌ను సమర్థంగా ఎదుర్కొంటాయన్నారు.

### కరోనా అత్యవసర ప్యాకేజీ

- కరోనా కారణంగా దేశంలో ఏర్పడిన ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ 'భారత్ కొవిడ్-19 అత్యవసర స్పందన, ఆరోగ్య వ్యవస్థ సన్నద్ధత ప్యాకేజీ' పేరుతో ఏప్రిల్ 10న రూ.15 వేల కోట్లు ప్రకటించింది. తక్షణం రూ.7,500 కోట్లు ఖర్చు చేస్తారు. మిగిలిన మొత్తాన్ని నాలుగేండ్లలోపు అందిస్తారు.

### లాక్‌డౌన్‌ను పొడిగించిన తొలి రాష్ట్రం

- ఒడిశాలో లాక్‌డౌన్‌ను ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ సీఎం నవీన్ పట్నాయక్ ప్రభుత్వం ఏప్రిల్ 10న నిర్ణయం తీసుకుంది. దీంతో దేశంలో లాక్‌డౌన్‌ను పొడిగించిన మొదటి రాష్ట్రంగా ఒడిశా నిలిచింది. ఒడిశాలో జూన్ 17 వరకు విద్యాసంస్థలను మూసివేయనున్నారు.

### కరోనా నిరోధానికి కొత్త పరికరం

- కరోనా వైరస్ కట్టడికి మరో కొత్త పరికరాన్ని తెచ్చినట్లు డీఆర్‌డీవో ఏప్రిల్ 10న తెలిపింది. రోగుల నుంచి వైద్య సిబ్బందికి వ్యాధి సోకకుండా ఉండేందుకు.. హైదరాబాద్‌లోని రిసెర్చ్ సెంటర్ ఇమారత్, చండీగఢ్‌లోని టీబీఆర్‌ఎల్‌లు సంయుక్తంగా 'ఏరోసాల్ కంటైన్మెంట్ బాక్స్'ను రూపొందించాయి. చికిత్స, నమూనాల సేకరణ సమయాల్లో రోగి నోటి నుంచి వెలువడే తుంపర్లు ఏవీ వైద్య సిబ్బందికి తాకకుండా ఈ పరికరం అడ్డుగోడగా పనిచేస్తుంది. రోగికి పరీక్షలు జరిపేందుకు వీలుగా ఇందులో రెండు రంధ్రాలను ఏర్పాటు చేశారు. అక్రిలిక్/పెర్స్‌పెక్స్ పదార్థంతో తయారైన ఈ బాక్స్ తేలికగా ఉంటుంది.

## International

### కరోనా సోకని దేశాలు

- కరోనా వైరస్ 200కు పైగా దేశాల్లో వ్యాపిస్తే.. 17 దేశాలను మాత్రం ఈ వైరస్ దరిచేరలేదని ఏప్రిల్ 6న విడుదలైన ఓ నివేదిక వెల్లడించింది. ఆ దేశాలు.. కామరూస్, కిరిబతి, లెసోతో, మార్షల్ ఐలాండ్స్, మైక్రోనేషియా, నౌరు, పలావు, సమోప, శావ్‌టోమ్ అండ్ ప్రిన్సిపి, సాల్మన్ ఐలాండ్స్, తజకిస్థాన్, టోంగా, తుర్క్‌మెనిస్థాన్, తువాలు, వనౌటు, యెమెన్, ఉత్తర కొరియా

### పాక్ 3 మిలియన్ డాలర్లు

- సార్క్ కొవిడ్-19 ఫండ్ ఎమర్జెన్సీ ఫండ్‌కు పాకిస్థాన్ 3 మిలియన్ డాలర్లు (రూ.22.81 కోట్లు) విరాళం అందిస్తున్నట్లు ఏప్రిల్ 9న పాక్ విదేశాంగ శాఖ తెలిపింది. వీటికి సంబంధించి అన్ని ప్రక్రియలు సార్క్ కార్యదర్శి నియంత్రణలోనే ఉండాలని వెల్లడించింది. కరోనాపై పోరుకు సార్క్ దేశాలు కొవిడ్-19 ఎమర్జెన్సీ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని భారత ప్రధాని మోదీ ప్రతిపాదించిన విషయం తెలిసిందే. భారత్ తరపున ఈ ఫండ్ కోసం కోటి డాలర్లు (రూ.73.95 కోట్లు) విరాళంగా ప్రకటించారు.

### చమురు ఉత్పత్తికి కోత

- రోజుకు 10 మిలియన్ బ్యారెళ్ల మేర (బీపీడీ) చమురు ఉత్పత్తిని తగ్గించేందుకు ఒపెక్, భాగస్వామ్య దేశాలు ఏప్రిల్ 10న అంగీకరించాయి. డిమాండ్ పడిపోయిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మరింత పతనమై, తమ ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలకుండా ముడిచమురు ఉత్పత్తి దేశాలు తాజా నిర్ణయం తీసుకున్నాయని ఇందుకు సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాయని ఒపెక్ పేర్కొంది. దీని ప్రకారం 2020, జూలై వరకు రోజుకు 10 మిలియన్ బ్యారెళ్లు, ఆ తర్వాత నుంచి ఏడాది చివరి వరకు రోజుకు 8 మిలియన్ బ్యారెళ్లు, 2021 ప్రారంభం నుంచి 16 నెలల వరకు రోజుకు 6 మిలియన్ బ్యారెళ్ల చొప్పున ఉత్పత్తిని తగ్గించుకోవాలి.

### పులికి కరోనా వైరస్

- అమెరికాలోని న్యూయార్క్‌లో ఉన్న బ్రాంక్ జంతుప్రదర్శనశాలలోని నదియా అనే నాలుగేండ్ల ఆడపులికి కరోనా వైరస్ సోకిందని అమెరికా ఫెడరల్ అధికారులు ఏప్రిల్ 5న ప్రకటించారు. రోజూ నదియా బాగోగులు చూసే ఉద్యోగి ద్వారా ఈ వైరస్ సోకినట్టుగా వైల్డ్ లైఫ్ సొసైటీ అధికారులు భావిస్తున్నారు. బ్రాంక్ జూపార్కును మార్చి 16 నుంచి మూసివేశారు. జంతువులు, పశువుల్లో కరోనా వైరస్ ప్రబలడం కొత్త ప్రశ్నలను లేవనెత్తుతుందని జూపార్కు డైరెక్టర్ జిమ్ బ్రెహెనీ చెప్పారు.



## Sports

### జ్డెన్ అత్యుత్తమ క్రికెటర్‌గా స్టోక్స్



- 2020కు గాను 'లీడింగ్ క్రికెటర్ ఆఫ్ ద వరల్డ్'గా ఇంగ్లండ్ టాప్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్‌ను ఎంపిక చేసినట్లు విజ్డెన్ క్రికెటర్స్ అల్మనాక్ ఏప్రిల్ 8న ప్రకటించింది. 2005లో ఆండ్రూ ఫ్లింటాఫ్ తర్వాత ఇంగ్లండ్ ఆటగాడు ఈ అవార్డుకు ఎంపిక కావడం ఇదే మొదటిసారి. ఇంగ్లండ్ తొలిసారి వన్డే వరల్డ్ కప్ గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించిన స్టోక్స్ ఫైనల్లోనూ ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.
- మహిళల విభాగంలో ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ ఎలీస్ పెర్రీ ఉత్తమ ప్లేయర్‌గా ఎంపికైంది. 2016లో కూడా ఆమె ఇదే అవార్డుకు ఎంపికయ్యింది. దీంతో రెండుసార్లు ఈ అవార్డుకు ఎంపికయిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. యాషెస్ టెస్ట్ ఇన్నింగ్స్‌లలో సెంచరీ, అర్ధసెంచరీతోపాటు వన్డేల్లో 73 సగటుతో, టీ20ల్లో 150 సగటుతో పరుగులు సాధించింది. 27 వికెట్లు పడగొట్టింది.

### ప్రొ హాకీ లీగ్ మ్యాచ్‌లు రద్దు

- మే 23, 24 తేదీల్లో భారత్, న్యూజీలాండ్ జట్ల మధ్య జరగాల్సిన రెండు ప్రొ హాకీ లీగ్ మ్యాచ్‌లు రద్దయినట్టు న్యూజీలాండ్ హాకీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇయాన్ ఫ్రాన్సిస్ ఏప్రిల్ 10న తెలిపారు. న్యూజీలాండ్ ప్రభుత్వం లాక్‌డౌన్ మార్గనిర్దేశకాలను అనుసరించి తాము విదేశాల్లో పర్యటించే అవకాశం లేదని అందుకే భారత్‌తో భువనేశ్వర్‌లో జరిగే రెండు ప్రొ హాకీ లీగ్ మ్యాచ్‌లను, చైనాలో మహిళల హాకీ జట్టు పర్యటనను రద్దు చేసుకుంటున్నామని వెల్లడించారు.

## Persons

### ఎమెల్సీగా మహారాష్ట్ర సీఎం



- మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలని ఆ రాష్ట్ర మంత్రి మండలి ఏప్రిల్ 9న నిర్ణయం తీసుకుంది. ఉద్ధవ్‌కు శాసనసభ, శాసనమండలిలో సభ్యత్వం లేకపోవడంతో గవర్నర్ కోటాలో ఖాళీగా ఉన్న సీటు నుంచి సీఎం ఉద్ధవ్ ఠాక్రేను నియమించాలని గవర్నర్ భగత్‌సింగ్ కోష్యారీని కోరినట్టు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి అనిల్ పరబ్ తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 164 (4) ప్రకారం ఎవరైనా మంత్రి ఆరునెలల్లోగా ఉభయ సభల్లో దేనిలోనూ సభ్యుడు కాకపోతే ఆ పదవికి అనర్హుడవుతారు.

### నాస్కామ్ చైర్మన్‌గా యూబీ ప్రవీణ్‌రావు

- ఐటీ కంపెనీల సమాఖ్య 'నాస్కామ్' చైర్మన్‌గా 2020-21 ఆర్థిక ఏడాదికి ఇన్ఫోసిస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సీవోవో), నాస్కామ్ ప్రస్తుత వైస్‌చైర్మన్ యూబీ ప్రవీణ్‌రావు ఏప్రిల్ 6న ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈ పదవిలో ఉన్న డబ్ల్యూఎన్ఎస్ గ్లోబల్ సర్వీసెస్ గ్రూపు సీఈవో కేశవ్ మురుగేశ్ స్థానంలో ప్రవీణ్‌రావు బాధ్యతలు చేపట్టనున్నారు.

### జాక్ డోర్సీ భారీ విరాళం

- కరోనాను నిరోధించే చర్యలకు మద్దతుగా నిలిచేందుకు ట్విటర్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో జాక్ డోర్సీ రూ.7,600 కోట్ల (1 బిలియన్ డాలర్లు) విరాళాన్ని ఏప్రిల్ 9న ప్రకటించారు. ఇది తన మొత్తం సంపదలో 28 శాతం. ట్విటర్, స్క్వేర్ సంస్థల్లోని షేర్లు సహ డోర్సీ మొత్తం సంపద రూ.22 వేల కోట్ల (దాదాపు 3 బిలియన్ డాలర్లు)కు పైగా ఉంది.

### ఏపీ ఎస్ఈసీగా కనగరాజ్

- ఆంధ్రప్రదేశ్ నూతన ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా రిటైర్డ్ జడ్జి జస్టిస్ కనగరాజ్ ఏప్రిల్ 11న బాధ్యతలు చేపట్టారు. తమిళనాడుకు చెందిన ఆయన ప్రస్తుతం ఎస్ఈసీగా పనిచేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్‌కుమార్ స్థానంలో నియమితులయ్యారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తిని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ)గా నియమించేలా పంచాయతీరాజ్ చట్టం-1994 సెక్షన్-200కు సవరణ చేస్తూ ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చింది.